RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి ®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:259 హైదరాబాద్, శుక్రవారం, 16 మే 2025 పేజీలు: 12 వెల: 1.00



## సరస్వతీనది పుష్కరస్నానమాచరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు


కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సరస్వతీనది పుష్కరస్నానమాచరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు.

గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. ఇవాళ వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు.

సరస్వతి నవరత్న మాల హారతి

ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది.





## తెలంగాణలో భారీ కుంభకోణం.. రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: రేవంత్ హయాంలో అధికారులు జైలుకు కూడా వెళ్లే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి దుష్ప్రవర్తనతో తెలంగాణ ప్రభుత్వ అధికారులను సుప్రీంకోర్టు హెచ్చరించిందని గుర్తుచేశారు. హెచ్‌సీయూ భూమిని విక్రయించడానికి రూ.10వేల కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. పచ్చదనాన్ని నాశనం చేయడానికి బుల్డోజర్లను మోహరించడం పర్యావరణ చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీసుకునే చర్యలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. రేవంత్ ప్రభుత్వం అనాలోచిత చర్యలతో పర్యావరణానికి హాని కలిగించే ప్రమాదం ఉందని అన్నారు. కంచ గచ్చిబౌలి అడవులను తప్పనిసరిగా రక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కంచ గచ్చిబౌలి వ్యవహారంలో జరిగిన తప్పిదాలకు రేవంత్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

తెలంగాణ మహిళల ఆత్మ గౌరవాన్ని రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆరోపించారు. ఇవాళ(గురువారం) తెలంగాణ భవన్‌లో గొంగిడి సునీత మీడియాతో మాట్లాడారు. తెలంగాణ మహిళలతో విశ్వ సుందరీమణుల కాళ్లు కడిగిస్తారా అని ప్రశ్నించారు. వరంగల్‌కు చెందిన ఇద్దరు మహిళా మంత్రులతో కాళ్లు కడిగించి ఉంటే ఇంకా బాగుండేదని అన్నారు. రుద్రమదేవి, సమ్మక్క, సారలమ్మ అస్తిత్వాన్ని రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసేలా చేసిందని గొంగిడి సునీత మండిపడ్డారు.

## కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు.. బీఆర్ఎస్ నేతలకు గట్టిగా ఇచ్చిపడేసిన మంత్రి సీతక్క..

మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్ నాయకులకు పరిపాటిగా మారిందని ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికీ తెలంగాణ సెంటిమెంట్ ను రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం నాడు మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు వరంగల్ వెయ్యి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

## యాదగిరిగుట్టను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు



యాదగిరిగుట్ట, భువనగిరి: మిస్‌వరల్డ్ పోటీదారులు గురువారం సాయంత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు.

పోచంపల్లిలో అందాల భామలు

టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.

## 'ఇంకేమీ డిసైడ్ కాలేదు.. ఇప్పుడు మాట్లాడటం తొందరపాటే': ట్రంప్ 'జీరో టారిఫ్' వ్యాఖ్యపై జైశంకర్



కాల్పులు విరమణకు ఎవరు పిలుపునిచ్చారో స్పష్టంగా వెల్లడైందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ) అన్నారు. అలాగే చాలా వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లు ఆఫర్ చేసిందని అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఆయన మాట్లాడుతూ.. "మేం ఆ దేశ మిలిటరీపై దాడి చేయలేదు. మే 7న వెనక్కి తగ్గడానికి ఇష్టపడనివారు.. మే 10న మాత్రం తగ్గారు. కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో దీనిని బట్టి తెలుస్తోంది" అని మంత్రి అన్నారు.

ట్రంప్ 'జీరో టారిఫ్' వ్యాఖ్య.. మంత్రి రిప్లై

భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. భారత్-పాక్ ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో వాణిజ్యం నిలిపేస్తానంటూ ఇరుదేశాలకూ స్పష్టం చేశానని.. ఈ క్రమంలో అవి అంగీకారానికి వచ్చాయని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అలాగే తమ దేశం నుంచి దిగుమతి చేసేకొనే చాలా రకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన సంచలన ప్రకటనపైనా జైశంకర్ స్పందించారు. "రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అవి సంక్లిష్ట చర్చలు. ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునేవరకు అవి కొనసాగుతూనే ఉంటాయి. వాణిజ్య ఒప్పందం పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలి. అది జరిగేవరకు దాని గురించి ప్రకటన చేయడం తొందరపాటే అవుతుంది" అని ట్రంప్ ప్రస్తావన లేకుండా మంత్రి మాట్లాడారు.

పాకిస్థాన్‌తో మరీ ముఖ్యంగా కశ్మీర్ విషయంలో మూడోపక్షం జోక్యాన్ని భారత్ అనుమతించదు. కేంద్రంలోని ప్రతి ప్రభుత్వమూ ఇదే వైఖరిని అనుసరిస్తోంది. అలాంటిది.. తాజా ఉద్రిక్తతల వేళ కాల్పులు విరమణ గురించి ట్రంప్ ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. మన దేశ సమస్య అయిన కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మొదలైన విషయాలు చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానిని కోరిన సంగతి తెలిసిందే.

## అందుకే కులగణనకు ప్రధాని మోదీ అంగీకారం: రాహుల్ గాంధీ



దర్భంగా: దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు.

ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. " ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ గేటు బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను.

భారత శక్తి
VOICE OF INDIAN

## పాకిస్తాన్ కోలుకోవడం అంత ఈజీ కాదు

భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణకు అంగీకరించినప్పటికీ, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్ తీసుకున్న ఐదు కీలక నిర్ణయాలు పాకిస్థాన్‌ను చావుదెబ్బ తీశాయి. ఇప్పుడే కాదు భవిష్యత్తులో కూడా పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థను అవి ప్రభావితం చేస్తూనే ఉంటాయి. పహెల్గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది.. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. మే 7, 2025న చేపట్టిన ఆపరేషన్ సింధూర్.. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారతదేశ సైనిక, వ్యూహాత్మక పరాక్రమాన్ని ప్రదర్శించింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఈ సర్జికల్ స్ట్రైక్ చేసిందిసింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, గగనతలాన్ని మూసివేయడం, ప్రత్యక్ష, పరోక్ష వాణిజ్యంపై పూర్తి నిషేధం వంటి ఈ చర్యలే అందుకు కారణం. ఉగ్రవాదం, వాణిజ్యం రెండు కలిసి సాగవు అంటూ ప్రధాని మోదీ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.సింధు జలాల ఒప్పందం నిలిపివేత.. 1960 సెప్టెంబర్ 19న కుదిరిన సింధూ జలాల ఒప్పందం.. భారత్, పాకిస్తాన్ మధ్య ఒక ముఖ్యమైన నీటి భాగస్వామ్య ఒప్పందం. తొమ్మిది సంవత్సరాల చర్చల తర్వాత ప్రపంచ బ్యాంకు దీనికి మద్దతు ఇచ్చింది. దీనిపై అప్పటి భారత ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకం చేశారు. భారత ప్రభుత్వం ప్రకారం.. పాకిస్తాన్ సింధూ నది వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడి ఉంది. దాని 16 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ భూమిలో 80 శాతం నీటిపారుదల, దాని మొత్తం నీటి వినియోగంలో 93 శాతం వాటా కలిగి ఉంది. ఈ నదీ వ్యవస్థ 237 మిలియన్ల మందికి మద్దతు ఇస్తుంది. గోధుమ, వరి, పత్తి వంటి కీలక పంటల ద్వారా పాకిస్తాన్ జిడిపిలో 25 శాతం వాటాను అందిస్తుంది. అయితే మంగళా, టార్బెలా వంటి ప్రధాన జలాశయాలలో పరిమితమైన లైవ్ వాటర్ నిల్వ, వార్షిక ప్రవాహ సామర్థ్యంలో కేవలం 10 శాతం ఉండటంతో నీటి సరఫరాలో అంతరాయం వల్ల తీవ్రమైన వ్యవసాయ నష్టం, ఆహార అభద్రత, నగరాల్లో నీటి కొరత, విస్తృత విద్యుత్ అంతరాయాలకు కారణమవుతుంది. ఈ అంతరాయాలు వస్త్రాలు, ఎరువులు వంటి కీలక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఇది విస్తృత ఆర్థిక, విదేశీ మారక ద్రవ్య సంక్షోభానికి దారితీస్తుంది.వాణిజ్యం రద్దు.. మే 2న జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈఖ 2023లో కొత్త నిబంధనను ప్రవేశపెట్టిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ పాకిస్తాన్ నుండి దిగుమతులపై పూర్తి నిషేధం విధించింది. ఈ నిర్ణయం "తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పాకిస్తాన్‌లో ఉద్భవించే లేదా ఎగుమతి చేసే అన్ని వస్తువుల ప్రత్యక్ష లేదా పరోక్ష దిగుమతి లేదా రవాణాను తక్షణమే నిషేధించాలని" నిర్దేశిస్తుంది. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన ఆర్థిక వ్యవస్థతో పోరాడుతున్న పాకిస్తాన్‌పై 'పరోక్ష' దిగుమతుల నిషేధం తీవ్రంగా ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య ప్రత్యక్ష వాణిజ్యం తక్కువగా ఉన్నప్పటికీ, గణనీయమైన పరిమాణంలో వస్తువులు థర్డ్ పార్టీ దేశాల ద్వారా వర్తకం నడుస్తోంది. ఒక నివేదిక ప్రకారం.. దాదాపు 500 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన డ్రై ఫ్రూట్స్, రసాయనాలు వంటి వస్తువులు ఇతర దేశాల ద్వారా భారతదేశానికి చేరుకుంటాయి. భారతదేశం విధించిన నిషేధంతో పరోక్ష దిగుమతులను కూడా కవర్ చేస్తూ కస్టమ్స్ అధికారులు ఇప్పుడు మధ్యవర్తిత్వ దేశాల ద్వారా పాకిస్తాన్ వస్తువులను నిరోధించగలరని టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది.ఎయిర్ స్పేస్ మూసివేయడం.. పాకిస్తాన్ రిజిస్టర్డ్, ఆపరేట్ చేయబడిన లేదా లీజుకు తీసుకున్న అన్ని విమానాలు వాణిజ్య, సైనిక, పౌర విమానాలు సహా భారత గగనతలాన్ని ఉపయోగించకుండా నిషేధిస్తూ ఇండియా ఎయిర్‌మెన్ కు నోటీసు జారీ చేసింది. ఈ చర్య విమాన షెడ్యూల్‌లకు గణనీయంగా అంతరాయం కలిగిస్తుంది. ప్రయాణ సమయాలను పొడిగిస్తుంది. పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ నిర్వహణ ఖర్చులను పెంచుతుంది. విమాన ప్రయాణ వ్యవధిని పొడిగించడం వల్ల ఎక్కువ ఇంధనం, ఎక్కువ సిబ్బంది షిఫ్ట్‌లు అవసరం అవుతాయి.సరిహద్దుల మూసివేత.. భారత్, పాకిస్తాన్ మధ్య ప్రధాన వాణిజ్య వారధి అయిన అట్టారి సరిహద్దును మూసివేయడం వలన పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. ఈ చర్య వస్తువుల ప్రవాహానికి అంతరాయం కలిగిస్తుంది. ఈ మార్గంపై ఎక్కువగా ఆధారపడే చిన్న వ్యాపారులు, తయారీదారులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అదనంగా భారత యాత్రికులు వీసా లేకుండా పాకిస్తాన్‌లోని సిక్కుల అత్యంత గౌరవనీయమైన పుణ్యక్షేత్రాలలో ఒకదాన్ని సందర్శించడానికి వీలు కల్పించే కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్‌కు తాత్కాలికంగా నిలిపివేయాలని భారత్ తీసుకున్న నిర్ణయం ఆ ప్రాంతంలో పర్యాటకాన్ని ప్రభావితం చేస్తుంది.షిప్పింగ్, పార్సిల్ సేవలపై నిషేధం.. భారత్, పాకిస్తాన్ మధ్య షిప్పింగ్, పార్సిల్ సేవలను భారత ప్రభుత్వం నిషేధించడం వలన ఇప్పటికే వెంటిలేటర్‌పై ఉన్న పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థపై మరింత దెబ్బతినే అవకాశం ఉంది. షిప్పింగ్ కంపెనీలు తమ కార్యకలాపాలను తిరిగి మార్చవలసి రావచ్చు. దీని వలన డెలివరీలలో జాప్యం జరుగుతుంది. ప్రపంచ వాణిజ్య నెట్‌వర్క్‌లతో పాకిస్తాన్ కనెక్టివిటీకి అంతరాయం కలుగుతుంది. అదనంగా పాకిస్తాన్ నౌకలను భారత ఓడరేవులను ఉపయోగించడంపై నిషేధం ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న దేశ లాజిస్టిక్స్, షిప్పింగ్ పరిశ్రమను మరింత దెబ్బతీస్తుంది. తగ్గిన వాణిజ్యం, పెరిగిన ఖర్చుల కారణంగా పాకిస్తాన్‌లో మొత్తం ఆర్థిక పరిస్థితి మరింత బలహీనపడవచ్చు.బాగా ఆలోచించిన వ్యూహం ద్వారా, భారతదేశం కీలకమైన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేయడంలో, కీలకమైన సైనిక ముప్పులను తటస్థీకరించడంలో, చాలా కాలంగా క్షీణించిన నిరోధాన్ని పునరుద్ధరించడంలో విజయం సాధించింది. పూర్తి స్థాయి యుద్ధం, పౌర ప్రాణనష్టాలను నివారించేటప్పుడు ఇదంతా సాధించబడింది. టామ్ కూపర్, జాన్ స్పెన్సర్, జెన్నిఫర్ జెంగ్ నొక్కిచెప్పినట్లుగా, ఈ ఆపరేషన్ భారతదేశం అభివృద్ధి చెందుతున్న రక్షణ సిద్ధాంతాన్ని ప్రతిబింబిస్తుంది.

# కడప రెడ్డమ్మ పగ తీర్చేసుకున్నారుగా

కడప, మే 15,

కడప జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి కసి తీర్చుకున్నారు. కడపలో ఫైర్ బ్రాండ్ లీడర్ గా మాధవి రెడ్డి గెలిచారు. గెలిచింది ఒకేసారి అయినప్పటికీ ఆమె నిత్యం వార్తల్లో ఉంటున్నారు. కడప రెడ్డమ్మగా ఆమె దూకుడుతో వ్యవహరిస్తున్న తీరు కొన్ని సార్లు విమర్శలకు ఎదురవుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. మాధవి రెడ్డి కడప జిల్లాలో టీడీపీలో ఫైర్ ఉన్న లీడర్ గా ఎదుగుతున్నారు. కడప జిల్లా వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కావడంతో మాధవీ రెడ్డి కి టీడీపీ కూడా అదే స్థాయిలో ప్రయారిటీ ఇస్తుంది. పార్టీ అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. తాజాగా కడప మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించి తన పవర్ ఏంటో మాధవిరెడ్డి చూపించగలిగారువైసీపీకి, సురేష్ బాబుకు సానుభూతి వస్తుందా? లేదా? అన్నది పక్కన పెడితే తాను అనుకున్నది సాధించడంలో మాధవి రెడ్డి ముందున్నారని మాత్రం చెప్పాలి. తాను శపథం చేసినట్లుగానే తనకు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో వేదికపై కుర్చీ ఇవ్వనందుకు చివరకు మేయర్ కుర్చీనే లాగేశారు. మున్సిపల్ నిబంధనలను అడ్డుపెట్టి మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించారు. మేయర్ సురేష్ బాబు తన కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులు అప్పగించారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా కడప మేయర్ సురేష్ బాబుపై వేటు వేసింది. దీంతో ఆయన కుర్చీ ఇవ్వనందుకు తన కుర్చీనే కోల్పోవాల్సి వచ్చింది.మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీ ఏడు నియోజకవర్గాల్లో గెలిచింది. పది శాసనసభ నియోజకవర్గాలున్న కడప జిల్లాలో తొలిసారి కూటమి పార్టీలకు ఇంతటి పెద్ద స్థాయిలో విజయం లభించింది. గతంలో ఇన్ని స్థానాలను టీడీపీ ఎప్పుడూ గెలవలేదు. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని సత్తా చాటింది.యితే కడప నియోజకవర్గంలో 1999లో గెలిచిన తర్వాత మళ్లీ టీడీపీ గెలిచింది 2024 లోనే. 1999 తర్వాత ఇక టీడీపీ అక్కడ గెలవలేదు. అంటే దాదాపు రెండున్నర దశాబ్దం కడప నియోజకవర్గంలో పసుపు జెండా ఎగురలేదనే చెప్పాలి. ఈసారి మాత్రం మాధవి రెడ్డి గెలిచి తన సత్తాను చాటారు. దీంతో ఆమెకు మంత్రి పదవి దక్కుతుందని భావించినా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా అది సాధ్యం కాలేదు.మాధవీ రెడ్డి భర్త కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి. తొలి నుంచి ఆయన కుటుంబం టీడీపీలోనే కొనసాగుతుంది. ఆర్థికంగా, సామాజికపరంగా బలమైన కుటుంబంగా పేరుంది. జగన్ సొంత జిల్లాలో అదీ కడపలో గెలవలేకపోయినా పార్టీ జెండాను రెడ్డప్పగారి కుటుంబం వదిలి పెట్టలేదు. ఈసారి మాత్రం తన సతీమణి మాధవరెడ్డికి టిక్కెట్ తెచ్చుకుని మరీ గెలిపించుకున్నారు. మాధవీ రెడ్డి గెలిచిన దగ్గర నుంచి స్పీడ్ గానే ఉన్నారు. కార్పొరేషన్ లో కుర్చీ కోసం చేస్తున్న గలాటా కూడా కొంత కాంట్రవర్సీగా మారినా ఆమె వెనక్కు తగ్గలేదు. కార్పొరేషన్ సమావేశంలోనే మాధవి రెడ్డి శపథం చేశారు. తనకు వేదికపై కుర్చీ వేయని నువ్వు కుర్చీలో ఉలా ఉంటావో చూస్తానంటూ వెళ్లిపోయారు. అనుకున్నట్లే మాధవి రెడ్డి అనుకున్నది సాధించారు.

కాంట్రాక్టు పనులకు అప్పగించారని...

మేయర్ ను సురేష్ బాబును ప్రభుత్వం తొలగించింది. మున్సిపల్ శాఖ నిబంధనలను ఉల్లంఘించి తమ బంధువులకు కాంట్రాక్టు పనులకు అప్పగించారన్న ఆరోపణలపై కడప మేయర్ సురేష్ బాబును ఆ పదవి నుంచి తొలగించింది. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించారని విచారణలో తేలిందని మున్సిపల్ శాఖ తెలిపింది.దీనిపై నోటీసులు ఇచ్చిన మున్సిపల్ శాఖ విచారణకు హాజరు కావాలని కోరింది. నిన్న సురేష్ బాబు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ శాఖ కార్యదర్శి ఎదుటహాజరయ్యారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులకు అప్పగించారన్న ఆరోపణలపై ఆయనను తొలగిస్తూ నిర్ణయిం తీసుకున్నారు. ప్రభుత్వం సురేష్ బాబుపై అనర్హతవేటు వేసింది.

# బుగ్గన పార్టీ మారుతున్నారా..

కర్నూలు మే 15,

వైసీపీ ప్రభుత్వంలో తిరుగులేని స్థాయిలో చక్రం తిప్పిన ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. 2024 ఎన్నికలలో బుగ్గన పరాజయం పాలయ్యారు. కర్నూలు జిల్లా డోన్ లో తెలుగుదేశం అభ్యర్థి కోట్ల విజయం సాధించారు. డోన్ లో తెలుగుదేశం జెండా ఎగరడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. చంద్రబాబు వ్యూహం ఫలించి కోట్ల విజయం సాధించారు. బుగ్గన పరాజయం పాలయ్యారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఆర్థిక మంత్రిగా చక్రం తిప్పి, ఐదేళ్లూ వరుసగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన బుగ్గన ఆ ఓటమితో డోన్ లో అడ్రస్ లేకుండా పోయారు. అపర మేధావిలా అసెంబ్లీ లో వ్యవహరించిన ఆయన ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో తన వ్యాపార వ్యవహారాల కోసం జగన్‌కి హ్యాండ్ ఇచ్చే ఆలోచన చేస్తున్నారంట. అయితే కూటమి పార్టీలు నో ఎంట్రీ బోర్డు పెట్టడంతో ఏం చేయాలో తోచక అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారన్న టాక్ నడుస్తోంది.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్ రాజకీయం ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. గతంలో ఈ సెగ్మెంట్ లో ప్రస్తుతం తెలుగుదేశంలో ఉన్న కేఈ, కోట్ల కుటుంబాలే ప్రత్యర్థులుగా కొనసాగాయి. 1978 నుంచి 2009 వరకు ఆ రెండు ఫ్యామిలీ మధ్యే ఎలక్షన్ వార్ నడుస్తూ వచ్చింది. 2014లో వైసీపీ నుంచి ఎంట్రీ ఇచ్చిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనూహ్యంగా కేఈ కృష్ణమూర్తిపై గెలుపొందారు. రెండోసారి కూడా గెలిచిన బుగ్గన ఆర్థిక మంత్రిగా అయిదేళ్లు చక్రం తిప్పారు రాజకీయ ప్రత్యర్థులైన దిగ్గజ కుటుంబాలు కేఈ, కోట్ల కుటుంబాలు గత ఎన్నికల సమయానికి ఒకే గూటి కిందకు చేరడం, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో బుగ్గనకు ఘోర పరాజయం తప్పలేదు. అదీ కాక నియోజకవర్గానికి అందుబాటులో ఉండకుండా అసెంబ్లీలో పిట్టకథలు చెప్తూ గడిపేసిన బుగ్గనపై డోన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ ఓటమి తర్వాత బుగ్గన డోన్ వాసులకు నల్లపూసై పోయారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఆయన అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారిస్తోందన్న ప్రచారంతో భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులను, వారి వ్యాపారాలను టార్గెట్ చేస్తూ బుగ్గన వేధింపులకు గురి చేశారన్న ఆరోపణలున్నాయి. అదే విధంగా బుగ్గనను ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఎప్పుడూ రాలేదు, అమరావతి, ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడుపుతూ నియోజకవర్గంలో ప్రజలకు దూరమయ్యారు. అంతేగాక సొంత పార్టీ కేడర్‌ను కూడా బుగ్గన పట్టించుకోలేదని టాక్. వాటికి తోడు సొంత మండలం బేతంచెర్లలోనే బుగ్గన తీవ్రస్థాయిలో అరాచకాలకు పాల్పడ్డారంట. ప్రస్తుతం కేసుల భయం వెంటాడుతుండటంతో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైసీపీని వీడి జగన్‌కు హ్యాండ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారంట. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు అప్పుల కోసం ఢిల్లీ చుట్టూ తిరిగి అక్కడి పెద్దలతో అంతో ఇంతో పరిచయాలు పెంచుకున్న ఆయన.. బీజేపీలో చేరడానికి వారితో మంతనాలు సాగిస్తున్నారంట. అందుకే ఆయన వైసీపీ కార్యక్రమాల్లో కూడా కనిపించడం లేదనీ, ఎక్కువ టైమ్ ఢిల్లీలోనే గడుపుతున్నారని బుగ్గన అనుచరులు చెప్పుకుంటున్నారంట. బీజేపీలో చేరడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాల సంగతి తెలిసి డోన్ కూటమి నేతలు తమ అధిష్టానాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చారంట. దాంతో బుగ్గనకు కూటమి పార్టీల్లో ఎంట్రీకి డోర్స్ క్లోజ్ అయిపోయారంటున్నారు. ఆ క్రమంలో బుగ్గన ఆచూకీ ఆయన సొంత అనుచరులకే అంతుపట్టకుండా తయారైందంట.


## సమ్మెను విజయవంతం చేసి కేంద్రం మెడలు వంచుదాం

బడా పారిశ్రామికవేత్తలకు తొత్తుగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 20వ తేదీన తలపెట్టిన సమ్మెను విజయవంతం చేద్దామని ఐ ఎన్ టి యు సి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాలిగామ మల్లేష్ ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్,సిఐటియు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సోమారపు వెంకన్న టీబీజీకేఎస్ నాయకుడు తిరుపతి, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఓసిపిత్రీ లోని బేస్ వర్క్ షాప్ వద్ద సమ్మె సన్నాహక ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాల రద్దు కోసం భారతదేశ కార్మిక వర్గం వీరోచిత పోరాటాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు,, అదే మాదిరిగా సింగరేణి కార్మిక వర్గం సైతం భవిష్యత్తులో జరగబోయే ఏ తరహా ఉద్యమాలకైనా సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. అధికార మదంతో విర్రవీగిన నరేంద్ర మోడీ రైతాంగ పోరాటాలకు తలదించక తప్పలేదని వారు గుర్తు చేశారు. భారతదేశం కార్మిక వర్గం రైతాంగ పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని కార్మిక వర్గం ఉద్యమించాలన్నారు. అనంతరం ఈనెల 20వ తేదీ సమ్మెను విజయవంతం చేద్దామని పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. అంతకుముందు ఏఐటియుసి సెంట్రల్ నాయకులు ఎల్ ప్రకాష్ అధ్యక్షత ఉపన్యాసం చేయగా, ఐ ఎన్ టి యు సి, బేస్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ కరక శ్రీనివాస్ ముగింపు ఉపన్యాసం చేసి, ద్వారా సమావేశాన్ని ముగించారు. ×ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ×రాజరత్నం, ఫిట్ సెక్రటరీ కుమారస్వామి,ఐఎన్టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బర్ల రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బానోత్ జాన్, నాయకులు కంది శ్రీనివాస్, నిరంజన్ సిఐటియు వైస్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, భూమయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు

# చెవిరెడ్డి భాస్కరరెడ్డి గాయబ్...

తిరుపతి, మే 15,

వైసీపీలో కీలక నేతగా వెలుగొందిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అధికారంలో ఉన్నంత కాలం తెగ దూకుడు ప్రదర్శించారు. అలాంటి ఫైర్‌బ్రాండ్ కనీళ్ల పెట్టుకోవడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. తన స్వగ్రామం తుమ్మలగుంట ఆత్మీయసభలో మీకు అన్ని చేశాను, కాని మీరు నా కొడుకును ఓడించారంటూ తన మనోవేదన వెళ్లగక్కిన సందర్భంలో ఆయన కళ్లు చెమర్చాయి. గత 11 నెలలుగా గ్రామస్తులలో ఎలాంటి సమావేశాలు పెట్టని అయన తాజాగా ఉన్నట్లుండి మీటింగ్ పెట్టారు. అసలు చెవిరెడ్డి ఎందుకు అంత అత్యవసరంగా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారనేది చర్చనీయాంశంగా మారింది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో వైసిపి కీలక నాయకుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అంటే తెలియని వారుండరు. జగన్ ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన మంత్రి పదవి దక్కించుకోలేక పోయినప్పటికీ.. చాలా మంది మంత్రుల కంటే ఎక్కువగానే చెలాయించారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి ఏకంగా తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌లో తిరుమల దేవాలయ సెట్ వేయించి తన నాయకుడితో ఉగాది వేడుకలు నిర్వహింప చేసి తన వీరవిధేయత చాటుకుని విమర్శల పాలయ్యారు.2014లో టీడీపీలోని అనైక్యతతో చంద్రగిరిలో సొంత సామాజికవర్గం గల్లా అరుణకూమారిని వ్యతిరేకించడంతో చెవిరెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత 2019లో జగన్ గాలిలో సునాయాస విజయం సాధించారు. అయితే మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో పట్టు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా పండుగలకు తాయిలాలు పంచడంతో పాటు ఇంటింటికి శుభాకాంక్షలు వెళ్ళేవి. దానికి తోడు వాలంటీర్ వ్యవస్థ రాక ముందే తానే నియోజకవర్గంలో అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకుని మంత్రాంగం సాగించారు. అలా అన్నీ కలిసి వచ్చి 2019లోఆయన భారీ మెజార్టీతో గెలవగలిగారు.ఎన్నికల తర్వాత శాసన సభ విప్‌తో పాటు తుడా చైర్మన్ పదవి కూడా అయనకే దక్కింది. తుడా పదవిని అడ్డంపెట్టుకుని చెవిరెడ్డి



పెద్ద తతంగమే నడిపారు. తన గ్రామ సమీపంలోని తుమ్మలగుంట చెరువును సగానికిపైగా పూడ్పించి.. తుడా నుంచి 60 కోట్లు పైగా ఖర్చు పెట్టి అత్యాధునిక వాకింగ్ ట్రాక్‌తో పాటు, అనేక విధాలుగా అభివృద్ధి చేసారు. చెరువును పూడుస్తున్నా చెవిరెడ్డి హవా చూస్తూ ఇరిగేషన్ శాఖ వారు నోరెత్తలేకపోయారంటారు. తుడా పరిధిలో ఇష్టా రాజ్యంగా బెంచీల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి, ఆ బల్లలపై తన పేరు వేయించుకుని చెవిరెడ్డి చేసిన ప్రచార అర్భాటం ఇప్పటికీ ప్రజల నోళ్లలో నానుతూనే ఉంది.

దానికి తోడు రహదారులకు సైతం వైఎస్‌తో పాటు తన పేరు పెట్టుకున్న ఘనత ఆయనది. తుడా అనేది కేవలం చంద్రగిరి నియోజకవర్గం వరకే అన్నట్లు పాలన సాగించారు. తుడా నిధులతో సొంత సర్వే టీములకు, వ్యక్తిగత సిబ్బందికి జీతాలు ఇప్పించుకున్నారన్న ఆరోపణలున్నాయి. వాటితో పాటు అనేక రకాలుగా తుడా నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగాలున్నాయి.తుడా నిధులతో తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్కుపై ఇప్పటికీ వివాదాలు నడు స్తున్నాయి. పూర్వం చెరువు ఏలాగుందో అలా ఉంచాలని చాలామంది గ్రీన్ ట్రిబ్యునల్‌కువెళ్ళారు. ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ అదేశాలతో అవిలాల చెరువును యాథావిధిగా ఉంచడానికి టీటీడీ ఇరిగేషన్ శాఖ అందులో ఉన్న నిర్మాణాలు తొలగిస్తోంది. ఇదే పరిస్థితి తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్క్‌కు కూడా పట్టే కాలం దగ్గరలో ఉందని అంటున్నారుఎన్నికలలో ఎంపీగా ఒంగోలు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు చెవిరెడ్డి. మరో వైపు చంద్రగిరిలో తన కూమారుడు మోహిత్ రెడ్డిని అభ్యర్థిగా రంగంలో దించారు. మోహిత్ భారీ తేడాతో టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు పలు కేసులు, వివాదాలు చెవిరెడ్డిని చుట్టుముడుతున్నాయి. ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదుతో సీఐడీ కేసులు పెట్టి విచారిస్తోంది. తుడా నిధల అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నది. దాంతో పాటు పోలింగ్ తర్వాత పులివర్తి నానిపై పద్మావతి మహిళా యూనివర్సిటిలో జరిగిన దాడికి సంబంధించి హత్యాయత్నం కేసుల విచారణ సాగుతోంది.వాటితో పాటు తుమ్మలగుంట చెరువులో ఉన్న పార్క్‌ను ఇప్పటి వరకు చెవిరెడ్డి తన సొంత ఆస్తిలా భావిస్తూ వచ్చారు.. ఇప్పుడు దాన్ని తుడా నిర్వహణలో తీసుకోవాలని పై స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో పావులు కదపడం మొదలు పెట్టారంట. గ్రామంలోని వారందరితో అత్యవసర ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి మరీ తాను అందర్నీ బిడ్డల కంటే ఎక్కువగా చూసుకున్నా,

తన బిడ్డని ఓడించారంటూ సెంటిమెంట్ పండించే ప్రయత్నం చేశారంట. దాంతో పాటు పార్క్‌ను తుడా నిర్వహిస్తే దారుణంగా మారిపోతుందని దాని కోసం పోరాటం సాగిద్దామని పిలుపు నివ్వడం హాస్యాస్పదంగా మారింది. పార్క్ కట్టిన చెరువు ఇరిగేషన్ శాఖది, అయితే నిధులు తుడావి అయినప్పుడు నిర్వహణ అవి చేయాలి కానీ తన పరిధిలో ఉంచుకోవాలని ప్రయత్నించడంపై విమర్శలు వస్తున్నాయి. మొత్తం మీద సొంత అస్తి కోల్పోతున్నట్లు చెవిరెడ్డి తెగ ఇదై పోతున్నారని అందరూ సెటైర్లు విసురుతున్నారు. పక్కనున్న హాథీరాంజీ మఠం భూములలో గ్రామస్తులు కొంతమంది ఇల్లు కట్టుకున్నప్పుడు వాటిని చెవిరెడ్డి కూల్చి వేయించారు. ఇప్పుడు తన దాకా వచ్చే సరికి నొప్పి తెలుస్తోందని గ్రామస్తులు దెప్పిపొడుస్తున్నారు. మొత్తం మీద చెవిరెడ్డి కన్నీటి ఎపిసోడ్ ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది.

## ప్రియుడి కోసం భర్తను హత్య చేయించిన భార్య

మెదక్ మే 15

ప్రియుడితో కలిసి భర్త శ్రీను హత్యకు భార్య మరో వ్యక్తితో కలిసి 50 వేల రూపాయలకు సుపారి ఇచ్చిన వైనం ఇది. హత్య అనంతరం తన భర్త కానిపించడం లేదని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది కిలాడి భార్య లత. హవేలీ ఘనపూర్ (మం) షమ్నాపూర్ గ్రామంలో ఘటన జరిగింది. లత అదే గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అనేక సార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి నచ్చజెప్పినా, లత పద్ధతి మార్చుకోలేదు. భర్త అడ్డును తొలగించుకోవడానికి మోహన్ అనే వ్యక్తికి 50 వేలు ఇచ్చి భర్తను హతమార్చమని చెప్పింది. పథకం ప్రకారం గత నెల 16న మద్యం తాగుదామంటూ శ్రీనుని అనంతసాగర్ గ్రామ శివారులోకి తీసుకెళ్లిని మోహన్ బీరు సీసాతో తలపై కొట్టి హత్య చేసాడు. గత నెల 28వ తేదీన తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది లత . పోలీసులు విచారణ చేస్తుండగా, అనుమానంతో నిలదీయగా తామే హత్య చేశామని లత, ప్రియుడు మల్లేష్ అంగీకరించారు.

## సరస్వతి నది పుష్కర స్నానమాచరించిన గండ్ర జ్యోతి

కాళేశ్వరం మే 15

వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ ఉ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సరస్వతి నది పుష్కర స్నానమాచరించారు. 12 ఏండ్లకు ఒక్కసారి వచ్చే సరస్వతి పుష్కరాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా,కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో నేటి నుండి ప్రారంభం అయిన నేపథ్యంలో సరస్వతి ఘాట్ వద్ద బంధుమిత్రులతో కలిసి త్రివేణి సంగమంలో పూజ కార్యక్రమం నిర్వహించి పుష్కర స్నానాలు చేసి, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు.

## కాళేశ్వరం త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్ దంపతులు

మహదేవపూర్ మే 15

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచ్ఛారణలతో మారుమోగుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగంమంలో ఉదయం 5.44 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. కాగా, ఈరోజు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు - పద్మ దంపతులు వేకువ జామునే త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేశారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటి వరకూ సనీప్రదాయానికే పరిమితమైన సరస్వతి పుష్కరాలు ఈ సారి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతీ నది ఉద్భవించిన ప్రాంతంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఆయన సతీమణీ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతీ పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

## అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని సందర్శించిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ మే 15

అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అఫ్జల్గంజ్ పిఎస్ పరిధిలో ఓ భవనంలో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. గోల్ మసీదు సమీపంలోని ఓ భవనంలో మూడవ అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. మంటల్లో చిక్కుకున్న ఒక చిన్నారిని మరి కొంతమందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు.

## గ్రీవెన్స్ కార్యాక్రమంలో పాల్గోన్న మంత్రి ఆనం

మంగళగిరి మే 15

తెలుగుదేశం పార్టీ తలపెట్టిన "గ్రీవెన్స్ కార్యక్రమం"లో గురువారం నాడు మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గోన్నారు. ప్రజల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులపై సమస్యలు పరిష్కారం దిశగా అక్కడక్కడే అధికారులతో మాట్లాడారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో పాటు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ఉన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ కూడా పాల్గొన్నారు

# క్లైమాక్స్ కు చేరిన లడ్డూ కల్తీ కేసు

విజయవాడ, మే 15

లడ్డూ ప్రసాదం కల్తీ కేసు దర్యాప్తులో సిట్ దూకుడు పెంచింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి మరీ దర్యాప్తు చేస్తున్న సంగతితెలిసిందే. సిట్ దర్యాప్తులో భాగంగా నెయ్యి సరఫరాకు తిరుమల తిరుపతి దేవస్థానం టెండర్ దక్కించుకున్న తమిళనాడు రాష్ట్రం దిండుగల్ కు చెందిన ఏఆర్ డైరీ నెయ్యి సరఫరా చేయలేదని తేలింది. మరి ఏం జరిగింది అంటే.. నెయ్యి ని ఉత్తరాఖండ్ రూర్కీలోని బోలేబాబ డైరీ నుంచి కొనుగోలు చేసి తిరుపతి జిల్లా లోని వైష్ణవి డైరీకి తరలించారు. అక్కడ ఏఆర్ డైరీ సీల్ వేసి టీటీడీకి సరఫరా చేశారు. ఈ విషయం దర్యాప్తులో తేలడంతో సిట్ అధికారులు నెల్లూరులోని ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అసలు శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలుత ప్రకటించారు. ఒక సభలో ఆయన జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం జరిగిందని ప్రకటించారు. హిందువులు ఆరాధ్యదైవం అయిన తిరుమల వేంకటేశ్వరస్వామి. ఈ శ్రీవారి దర్శన భాగ్యం అదృష్టంగా భక్తులు భావిస్తారు. అంతే అదృష్టంగా తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. అందుకే స్వామి వారి లడ్డూ ప్రసాదం భక్తులకు అత్యంత ప్రీతిపాత్రం అయ్యింది. స్వామి వారి దర్శనం లేకపోయినా లడ్డూ ప్రసాదం లభిస్తే స్వామి వారి దయ ఉన్నట్లేనని భావిస్తారు. అలాంటి ప్రసాదం అపవిత్రం చేస్తూ జగన్ హయాంలో లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీ అయిందని? రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సభా ముఖంగా ప్రకటించారు. చంద్రబాబు ప్రకటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తెలుగుదశం కూటమి పార్టీలూ, వైసీపీల మధ్య మాటల యుద్ధమే జరిగింది. ఈ నేపథ్యంలోనే



రాష్ట్ర ప్రభుత్వం లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేసింది.అయితే ఈ కేసులో సిట్ దర్యాప్తుపై సందేహాలు వ్యక్తమౌతూ దాఖలైన పిటిషన్ ను విచారణకు స్వీకరించి.. ప్రత్యేక దర్యాప్తు బృందం సీబీఐ ఆధ్వర్యంలో జరగాల్సిందేనని ఆదేశించిన సుప్రీం కోర్టు కొత్త సిట్ ను ఏర్పాటు చేసింది. ఇప్పుడా ప్రత్యేక సిట్ ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. సిట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ లో 12 మంది పేర్లు ఉన్నాయని చెబుతున్నారు. ఏ1 గా ఏఆర్ డైరీ, ఏ2 గా ఆ సంస్థ ఎండీ రాజు రాజశేఖరన్, ఏ3గా పొమిల్ జైన్, ఏ4గా విపిన్ జైన్, ఏ5 అపూర్వ చవాడాలను చేర్చింది. ఈ ఆరుగురినీ సిట్ పలుమార్లు విచారించింది. సిట్ అరెస్ చేసి పలు దఫాలు విచారణ చేశారు. ఏ6 బోలేబాబ డైరీ, ఏ7 వైష్ణవి డైరీని చేర్చారు. ఏ8 వైష్ణవి డైరీ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షబిల్ కలీముల్లాఖాన్ తో పాటు టీటీడీ ప్రొక్యూర్ మెంట్ ఉద్యోగి, బోలేబాబ సీజీఎం, నెయ్యి ముడిపదార్థాలు సరఫరా చేసే వారిని ఛార్జ్ షీట్ లో పొందుపరిచారు. త్వరలో మరింత మందిని విచారణ చేసే అవకాశం ఉంది.

# వైజాగ్ లో హోం స్టే

విశాఖపట్టణం, మే 15,

విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు హోమ్ స్టే సౌకర్యాన్ని కల్పించాలని అధికారులు నిర్ణయించారు. కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకూ అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు.

విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు 'ఇంటిలో ఆతిథ్యం' ఇవ్వాలనుకునేవారు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పర్యాటక శాఖ అధికారులు పిలుపునిచ్చారు. ఎవరికైనా సొంత ఇల్లు/విల్లా/ అపార్టుమెంట్ ఫ్లాట్ ఉండి, వాటిని పర్యాటకులకు రోజువారీ పద్ధతిలో అద్దెకు ఇవ్వడానికి ఆసక్తి ఉంటే పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖాధికారిణి జె.మాధవి సూచించారు. పర్యాటకులకు అన్ని ప్రాంతాల్లోను హోటళ్లలో గదులు లభించవు. అలాగే తినడానికి ఆహారం కూడా దొరకదు. చాలామంది పర్యాటకులు స్థానికంగా లభించే ఆహార పదార్థాలను రుచి చూడాలనుకుంటారు. అక్కడి మనుషులతో మాట్లాడి, సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, దుస్తులు, స్థానిక కళల గురించి తెలుసుకోవాలనుకుంటారు. ఇవన్నీ సాధారణ హోటళ్లలో లభించవు. అటువంటి అభిరుచి కలిగిన వారికి స్థానిక విధానంలో 'వసతి సౌకర్యాలు' కల్పించడాన్ని 'హోమ్ స్టే'గా వ్యవహరిస్తున్నారు.కేరళతో పాటు కశ్మీర్, పంజాబ్ వంటి రాష్ట్రాలతో పాటు మలేషియా వంటి దేశాల్లో, గిరిజన ప్రాంతాల్లో ఈ హోమ్ స్టే బాగా ఆదరణ పొందింది. దీనివల్ల స్థానికులకు కూడా ఉపాధి లభిస్తోంది. వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రచారం పెరుగుతోంది. ప్రభుత్వాలపై ఒత్తిడి తగ్గుతోంది. రాష్ట్రాలకు వచ్చే పర్యాటకులకు అవసమైనన్ని గదులు పర్యాటక, ప్రైవేటు సంస్థలు సమకూర్చలేకపోతున్నాయి. ఈ హోమ్ స్టే వల్ల పర్యాటకంగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో స్థానికులే వారి గృహాలను అందంగా అలంకరించి, వాణిజ్య ధరల కంటే తక్కువకే వసతి కల్పించడం, ఇంట్లో వండిన ఆహార పదార్థాలను ఆప్యాయంగా వడ్డించడం వల్ల పర్యాటకుల సంతృప్తి శాతం పెరుగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం దీనిని నూతన పర్యాటక పాలసీలో చేర్చింది. కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకు అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు పేర్లు నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ (ఏపీటీఏ) వెబ్సైట్లో ఎవరికి వారే వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 0891-2754716 నంబరులో సంప్రతించాలని జె.మాధవి సూచించారు. కొద్ది రోజులు గడిచాక ఆసక్తి కలిగిన వారిని పిలిచి అవగాహన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విధి విధానాలు తెలియజేస్తామని, పర్యాటకులే నేరుగా ఎవరికి ఎక్కడ నచ్చితే అక్కడి హోమ్ స్టేను ఎంపిక చేసుకుంటారని వివరించారు.

# స్విమ్స్‌కు పూర్తి స్థాయి సౌకర్యాలు

తిరుపతి, మే 15,

తిరుపతి స్విమ్స్‌లో వైద్య సేవలను మరింత ఉన్నతంగా అందించేందుకు టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు నేతృత్వంలో చర్యలు చేపట్టారు. బుధవారం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో, మాజీ టిటిడి ఈవో ఐవి సుబ్బరావు అధ్యక్షతన ఏర్పాటైన ఎక్స్‌పర్ట్ కమిటీ సమర్పించిన నివేదికపై చర్చించారు. ఈ నివేదికలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు, నిధుల సేకరణ, వైద్య నిపుణుల సేవలు వంటి అంశాలపై సిఫార్సులు ఉన్నాయి. ఈ నివేదికను టిటిడి బోర్డులో చర్చించి, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఛైర్మెన్ తెలిపారు.శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్), తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతిలో నడిచే ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థ. స్విమ్స్ ఆస్పత్రి ద్వారా ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. 2021లో స్విమ్స్ ఆస్పత్రిని టీటీడీ తన నియంత్రణలోకి తీసుకుంది. మరోవైపు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన బుధవారం స్విమ్స్ సమావేశ మందిరంలో జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన టీటీడీ ఛైర్మన్ స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఇందుకోసం మాజీ టీటీడీ ఈవో ఐవీ సుబ్బారావు నేతృత్వంలో నిపుణుల కమిటీ వేశామని.. ఈ నిపుణుల కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించిందని బీఆర్ నాయుడు తెలిపారు.నిపుణుల కమిటీ అందించిన నివేదిక ఆధారంగా స్విమ్స్ ఆస్పత్రిలో మౌళిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు చేపట్టనున్నట్లు టీటీడీ ఛైర్మన్ వెల్లడించారు. మరింత ఉన్నతంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణుల సేవలు, నిధుల సేకరణ అంశాల గురించి కూడా నిపుణుల కమిటీ పలు సూచనలు చేసిందని.. ఈ నివేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మరోవైపు స్విమ్స్ ఆసుపత్రికి టీటీడీ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఏటా టీటీడీ నుంచి స్విమ్స్ ఆస్పత్రికి రూ. 60 కోట్ల గ్రాంట్ అందించటంతో పాటుగా.. ఎంప్లాయిస్ హెల్క్ స్కీం, ప్రాణదాన ట్రస్ట్ , వివిధ రకాల ట్రస్టుల ద్వారా రూ. 100 కోట్లకుపైగా మద్దతుగా అందిస్తున్నామని వివరించారు.స్విమ్స్ ఆస్పత్రిలో ఏడాదికి 18,000 సర్జరీలు జరుగుతుంటాయని.. 4.50 లక్షల మందికి పైగా ఔట్ పేషంట్లు, 47 వేలమంది ఇన్‌పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని టీటీడీ ఈవో శ్యామలరావు వివరించారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పేదలే అత్యధికంగా ఉన్నారని.. భవిష్యత్ తరాలకు సరిపడేలా ప్లాన్ ప్రకారం స్విమ్స్ ఆస్పత్రిలో నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అంకాలజీ , చిన్న పిల్లల ఆరోగ్యం కోసం నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు.మరోవైపు స్విమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్మితమవుతున్న క్యాన్సర్ భవనాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అంతకుముందు పరిశీలించారు. 391 పడకల సామర్థ్యంతో ఈ క్యాన్సర్ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 5 ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న పలువురు రోగులతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ముచ్చటించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు

## జవాబుదారీతనాన్ని పెంచాలి మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ మే 15,

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటై విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, సిబ్బందితో వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

రాష్ట్రంలో ఆరోగ్య, సంక్షేమ పథకాల పురోగతి, ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. పనితీరును సమీక్షించుకుని, లోపాలను సరిచేసుకోవాలి. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. జవాబుదారీతనాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగాన్ని పెంచాలి. కొత్త ఆలోచనలకు, పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

## అకాల వర్షంతో నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకుంటాం

### - తక్షణ సహాయంగా రూ. 21,500
### - ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు కృషి
### - ఎమ్మెల్యే విజయరమణ రావు

పెద్దపల్లి ప్రతినిధి: మే 15,

ఓదెల మండలం మడక గ్రామం లో రాజ కొమురయ్యకు చెందిన 26 మేకలు, గొర్రెలు వర్షం కారణంగా కరెంట్ షాక్ తో మరణించడంతో గురువారం బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబనికి ఎమ్మెల్యే విజయరమణ రావు రూ. 21,500 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గొర్రెల పెంపకం పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కుటుంబం ఈ ప్రమాదం వల్ల ఎంతో నష్టపోయిందన్నారు. ఈ కుటుంబానికి తాము అండగా ఉంటామని చెప్పారు. సీఎండీ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారు లతో మాట్లాడి అవసరమైన సహకారాన్ని బాధిత కుటుంబానికి అందించాలని కోరినట్లు వారు తెలిపారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రభుత్వ పరంగా కూడా సహాయాన్ని అందిస్తామన్నా రు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎ.డి.ఈ, ఎ.ఈ, స్థానిక తహసిల్దార్, సి.ఐ సుబ్బా రెడ్డి, మడక గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పాలిట శాపం కాంగ్రెస్ ప్రభుత్వం

### - తడిసిన దాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి
### - బిజెపి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణ రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి: మే 15,

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిం దని, అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనలు చేసే పరిస్తితికి తీసుకువచ్చిందని భారతీయ జనతా పార్టీ మాజీ ఎమ్మెల్యే, జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెటు యార్డులో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని గురువారం పరిశీలించిన గుజ్జుల అనంతరం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెటుయార్డు నిర్వహణ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇష్టానుసారం గా కాంక్రీటు నిర్మాణపనులు చేయడం వల్ల వర్షపు నీరు నిలిచి ధాన్యం పెద్దమొత్తంలో నాశనం అయ్యిందన్నారు. ధాన్యాన్ని నిలవ చేసే ప్లాట్ ఫాములను అడ్డదిడ్డంగా నిర్మించడాన్ని తప్పుబట్టారు. ప్లాట్ ఫాములను నిర్మించిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే స్పందించి మార్కెటుయార్డుతో పాటు జిల్లాలోని కొనుగోలు సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని తూకంపెట్టి కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టరు చొరవ చూపాలని సూచించారు. అదేవిధంగా అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మొక్కజొన్న, మామిడి రైతుల వివరాలను సేకరించి వారికి సైతం నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని మొక్కజొన్న, మామిడిరైతుల వివరాలను ప్రభుత్వానికి అందించాలని అధికారులకు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని రైతులకు భరోసా కల్పించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, ఠాకూర్ రాంసింగ్, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, జంగ చక్రధరరెడ్డి, గనవేన రాజేందర్, బెజ్జంకి దిలీప్ కుమార్, శివంగారి సతీష్, పెండ్యాల కుమార్, మోర మనోహర్, చాతరాజు రమేష్, రాజం కొమురయ్య, మేరుగు రవీందర్, ఎండి ఫహీం, చాతరాజు నరేష్, పిట్ట భాస్కర్, అభి, రేవెల్లి సందీప్, తూడి రవీందర్, కోల హిమగిరి, బొడ్డు మల్లయ్య, వేల్పుల వెంకటేష్, దూలం సతీష్ తదితరులు ఉన్నారు.

## గిరిజనులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఆదివాసి సంఘాల దీక్షలు

ఏలూరుపశ్చిమ ఏజెన్సీ ప్రాంతాలైన బుట్టాయిగూడెం జీలుగుమిల్లి పోలవరం మండలాల్లో గిరిజనుల కోసం షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియమకాలు జరగాలని ఆదివాసి సంఘాలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఏజెన్సీలోని గిరిజనులకు మామూలు ప్రజలతో సంక్షేమలు అందిస్తే ఆ సంక్షేమాలు గిరిజనులకు అందవు. వారికి ప్రత్యేకమైన ఒక సంస్థను ఏర్పాటు చేసి తద్వారా అట్టడుగున ఉన్న గిరిజనులకు న్యాయం చేకూర్చే విధంగా ఆనాటి ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ నందమూరి తారకరామారావు ఐటీడీఏ ని స్థాపించి తద్వారా గిరిజనులకు ఉపాధి ఆరోగ్య విద్య అభివృద్ధి పథకాలనుఅందించే విధంగా ఏర్పాటు చేశారు. దానిని గత పాలక ప్రభుత్వాలు తుంగలో తొక్కే విధంగా ఉన్నాయని గిరిజన సంఘాలు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పుడు ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్ గిరిజనులకు అన్యాయం చేసే విధంగా ఉందని దానిని పునరుద్ధించి గిరిజనులకు న్యాయం చేసే విధంగా డీఎస్సీను ప్రకటించాలని షెడ్యూల్ ప్రాంత గిరిజనులకు ఉద్యోగ భద్రత కోసం ప్రత్యేక చట్టాలని రూపొందించాలని ఎన్నికల ముందు పార్టీలు తమకు మద్దతుగా గిరిజనుల కోసం ప్రత్యేక చట్టాలు చేస్తామని నమ్మగలుగుతున్నాయని గద్దెనెక్కిన తరువాత ఆ భాషలను మరిచిపోతున్నాయని 2023 సంవత్సరంలో నారా లోకేష్ గారు గిరిజనులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని హామీని నెరవేర్చాలని ఇది ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమం కాదని మా గిరిజన బిడ్డల భవిష్యత్తు కోసం మా తాపత్రయమని దీనిని నెరవేర్చడం కోసం మా కోరికలు నెరవేర్చే వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామని గిరిజన సంఘాలు తెలియజేశాయి.

# నేడు జాతీయ డెంగ్యూ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని.ప్రతి సంవత్సరం, మే 16న ఈ వ్యాధి గురించి మరియు దానిని నివారించే మార్గాల గురించి అవగాహన కల్పించడానికి జరుపుకుంటారు.

ఇది ఏడిస్ దోమలు పగటిపూట కుట్టడం వల్ల వచ్చే వెక్టర్ ద్వారా సంతానోత్పత్తి చేసే వైరల్ వ్యాధి.ఇది దోమల నుండి మానవులకు వ్యాపిస్తుంది. ఉష్ణమండల మరియు ఉపఉష్ణమండల ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తుంది. అధిక జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, కీళ్ల మరియు కండరాల నొప్పి, వికారం మరియు దద్దుర్లు డెంగ్యూ యొక్క సాధారణ లక్షణాలు. డెంగ్యూ ఉన్న చాలా మంది 1-2 వారాలలోపు కోలుకుంటారు. అయితే, తీవ్రమైన సందర్భాల్లో, డెంగ్యూ కూడా ప్రాణాంతకంగా మారవచ్చు. డెంగ్యూ వ్యాప్తిని నియంత్రించడానికి దోమ కాటును నివారించడం అత్యంత ప్రభావవంతమైన మార్గం.

తీవ్రమైన డెంగ్యూను డెంగ్యూ హెమరేజిక్ జ్వరం అని కూడా పిలుస్తారు, ఇది కొన్ని తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది ప్రాణాంతకంగా కూడా మారుతుంది. తీవ్రమైన డెంగ్యూలో, ఒక వ్యక్తి యొక్క రక్త నాళాలు దెబ్బతింటాయి మరియు లీక్ అవుతాయి. ఒకరి ప్లేట్లెట్లు కూడా బాగా పడిపోతాయి.

తీవ్రమైన డెంగ్యూ తీవ్రమైన వైద్య అత్యవసర పరిస్థితి. అంతర్గత రక్తస్రావం, అవయవ వైఫల్యం, మరణానికి కూడా దారితీస్తుంది.

రక్తపోటు గణనీయంగా పడిపోతుంది. ప్లేట్లెట్ కౌంట్ తక్కువగా ఉండటం వల్ల అంతర్గత రక్తస్రావం జరుగుతుంది..అందువల్ల, తీవ్రమైన డెంగ్యూ సంకేతాలు మరియు లక్షణాలపై శ్రద్ధ వహించడం చాలా అవసరం. తక్షణ వైద్య సహాయం తీసుకుంటే అది ప్రాణాంతకంగా మారకుండా నిరోధించవచ్చు.

భారత ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ వ్యాధి గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జాతీయ డెంగ్యూ దినోత్సవం అనే దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. ఈ రోజున, వ్యాధి విస్తృతంగా వ్యాపించకముందే దానిని నియంత్రించడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాన్ని మరియు అంటువ్యాధిని నివారించడానికి తీసుకున్న చర్యలను సమీక్షిస్తారు.

100 కంటే ఎక్కువ దేశాలు డెంగ్యూ వ్యాధిని ఇప్పటికీ అనుభవిస్తున్నాయి, దీని వలన ప్రజలు వ్యాధి ప్రభావాలను గ్రహించి దాని వ్యాప్తిని ఆపడానికి జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. వ్యాధి లక్షణాలు, కారణాలు నివారణపై ప్రజలకు సరైన సమాచారం అందించబడిందని నిర్ధారించుకోవడానికి, ప్రభుత్వం ప్రజా విద్య మరియు వ్యాధి పర్యవేక్షణ కోసం వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

# రైలు లో మంటలు. ప్రయాణికులు సురక్షితం


యాదాద్రి

యాదాద్రి జిల్లా బీబీనగర్ వద్ద రైలులో మంటలు చెలరేగాయి. మిర్యాలగూడ నుంచి కాచిగూడ వెళుతున్న రైలు భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి దాటుతుండగా పొగలు అలుముకున్నాయి. గమనించిన ప్రయాణికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బీబీనగర్ రైల్వే స్టేషన్లో రైలును ఆపిన సిబ్బంది ఫైరింజన్ సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి అపాయం జరగలేదన్నారు.

# ప్రమాదకరంగా ఉన్న జి ఎం. ఆఫీస్ టర్నింగ్ పాయింట్ ను పరిశీలించిన ఖని ఏసీపీ

గోదావరిఖని :

రామగుండం పోలీస్ కమిషనరేట్ గోదావరిఖని పట్టణం లోని సింగరేణి బి గెస్ట్ హౌస్ వద్ద గల మూల మలుపు పాయింట్ వద్ద తరుచు ప్రమాదాలు జరుగడం వలన వాహనాల దారులు ప్రాణాలు కోల్పోవడం, గాయల పాలుకావడం,వాహనాలు దెబ్బతినడం జరుగుతుంది కావున రామగుండం పోలీస్ కమిషనర్



అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు మరియు రామగుండం ఎ మ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆలోచనల ప్రకారం ప్రమాదాల నివారణ ప్రజల వాహనదారుల రక్షణ, సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేరేలాగా చేయడం లో భాగంగా మూల మలుపు వద్ద చేయవలసిన మార్పులు, మరమ్మత్తులు, నిర్మాణం ల గురించి గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, మరియు ఆర్ అండ్ బి అధికారులతో చర్చించి ఒక నివేదిక ఉన్నత అధికారులకు ఇవ్వడం జరుగుతుంది అని ఏసీపీ గారు తెలిపారు.

# భూకంపాలు రావద్దని భూమాతకు బూరెలు నైవేద్యం

జగిత్యాలజగిత్యాల జిల్లా కోరుట్ల మండలం పైడిమడుగులో మహిళలు భూమాతకు బూరెలు నైవేద్యంగా పెట్టారు. భూమాత శాంతించాలని పూజలు నిర్వహించారు. ఇటీవల ఉత్తర తెలంగాణలో భూ ప్రకంపనలు రావడంతో భూమాతకు బూరెలు నైవేద్యంగా సమర్పిస్తే శాంతిస్తుందని గ్రామస్థుల నమ్మకం. అనుకున్నదే తడవుగా గ్రామస్తులు బూరెలు తయారు చేసి గ్రామ శివారులో ఓ చెట్టు కింద గుంత తీశారు. ఆ గుంతలో ముగ్గు వేసి, పసుపు కుంకుమతో అలంకరించి అందులో బూరెలను పెట్టి పూజలు చేశారు. అనంతరం మట్టి కప్పారు. మిగిలిన బూరెలను తిని ఇంటికి తిరుగుముఖం పట్టారు. పూర్వం నుండి ఎప్పుడైన భూమి కంపిస్తే భూమాతకు బూరెలు నైవేద్యంగా పెట్టడం జరుగుతుందని తెలిపారు.

# లోకేశ్ కు పగ్గాలు...

విజయవాడ, మే 15,

నారా లోకేశ్ కు కీలక పదవి లభించనుంది. పార్టీ నేతల డిమాండ్ కు చంద్రబాబు ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ నెలలో టీడీపీ మహానాడు జరగనుంది. కడప జిల్లాలో నిర్వహించనున్న ఈ మహానాడులో అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పనుంది. ఇప్పటి వరకూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేశ్ అంతకంటే కీలకమైన పదవిని చేపట్టబోతున్నారన్న టాక్ పార్టీలో వినపడుతుంది. కార్యకర్తలు కూడా నారా లోకేశ్ నాయకత్వం కావాలని బలంగా కోరుకుంటుండటంతో ఈ మేరకు లోకేశ్ కు కీలకమైన పదవి కట్టబెట్టే అవకాశముందని తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే కొందరు నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆయన నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాకపోయినా ఖచ్చితంగా అంగీకరిస్తారన్న నమ్మకంతో పసుపు పార్టీ నేతలున్నారు. ఈరోజు జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో లోకేశ్ పదవి పై చర్చించనున్నారుఎవరు అవునన్నా.. కాదన్నా నారా లోకేశ్ ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకం. ఆయన తన ముద్రను అన్ని రకాలుగా చూపించుకుంటున్నారు. దీంతో పాటు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. నారా లోకేశ్ ఈ తరం నాయకుడు కావడంతో యూత్ కు కనెక్ట్ కావడంతో ఆయన ఇమేజ్ ను మరింత పార్టీ పరంగా పెంచాలన్న ప్రయత్నంలో పార్టీ నేతలున్నారు. చంద్రబాబు నాయుడు కూడా ముఖ్యమంత్రిగా బాధ్యతలను నిర్వహిస్తూ ఇటు పార్టీ కార్యక్రమాలను చక్కబెట్టలేకపోతున్నారు. చంద్రబాబుకూడా వీలయినంత వరకూ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు నియోజకవర్గాల్లోనూ ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతున్నప్పటికీ లోకేశ్ అయితే బాగుంటుందన్న సూచనలు బలంగా వినిపిస్తున్నాయి. పొలిట్ బ్యూరోతో పాటు పార్టీలోనూ యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనిభావిస్తున్నారు. సీనియర్లకు మాత్రం సలహాలు, సూచనలు అందించేలా ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేయనున్నారు.అయితే మొన్నటి వరకూ ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలంటూ డిమాండ్లు బాగానే వినిపించాయి. అయితే ఆ సౌండ్ ను మాత్రం చంద్రబాబు సమర్థవంతంగా కొంత అణిచి వేయగలిగారు. కొందరు ఒక



అడుగుముందుకు వేసి కాబోయే ముఖ్యమంత్రి అని సంబోధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేత చీవాట్లు కూడా తిన్నారు. అయితే పార్టీలో భవిష్యత్ అంతా లోకేశ్ దే ఉంటుందని భావించిన నేతలు ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. డిప్యూటీ సీఎం అంటే కొన్నిఆటంకాలు ఉండవచ్చని, కానీ పార్టీ విషయంలో మాత్రం లోకేశ్ కు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని అంటున్నారు. నిత్యంకార్యకర్తలకు అందుబాటులో ఉండే లోకేశ్ కు కీలక పదవి ఇస్తేనే పార్టీ మరింత బలోపేతమవుతుందని చంద్రబాబు చెవిలో మరీ చెప్పే వారి సంఖ్య ఎక్కువవుతుంది.మహానాడులో పార్టీ పగ్గాలు ఇక లోకేశ్ చేతికి అందేలా పదవిని రెడీ చేస్తున్నారట. ఇప్పటికే పార్టీ అంతా లోకేశ్ కనుసన్నల్లోనే నడుస్తుంది. అయితే అధికారికంగా దానికి ముద్ర పడాలంటే కీలకమైన పదవి అప్పగించాలన్న డిమాండ్ ఊపందుకోవడంతో పాటు లోకేశ్ అయితేనే కార్యకర్తలు కూడా హ్యాపీగా ఫీలవుతారన్న అభిప్రాయం పార్టీలో బలంగా వినిపిస్తుంది. అందుకే కడప జిల్లాలో ఈ నెలలో జరిగే మహానాడులో లోకేశ్ కు కీలక పదవిని అప్పగించే యోచనలో చంద్రబాబు కూడా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఇక అధికారికంగా లోకేశ్ పార్టీలో మరింత కీలకంగా నిర్ణయాత్మక శక్తిగా చినబాబు మారనున్నారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఈరోజు జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో దీనిపై చర్చించి ఆమోద ముద్ర వేసే అవకాశాలున్నాయి.

# గాలి జాతకం అలా అయిపోయిందే..?

హైదరాబాద్, మే 15,

కోట్లు ఉన్నప్పటికీ ప్రయోజనం ఏముంది? జీవితంలో ఎక్కువ భాగం జైలుకే పరిమితమయితే ఇక సంపాదించింది అనుభవించడం కూడా లేని అది దరిద్రమైన జాతకం గాలి జనార్థన్ రెడ్డిది. అక్రమంగానో.. ఎలాగోనో గాలి జనార్థన్ రెడ్డి కోట్లాది రూపాయలు కూడబెట్టారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన గాలి కుటుంబం కర్ణాటకు వెళ్లి సెటిలయింది. కర్ణాటకలో అనేక వ్యాపారాలు చేసి కోట్లాది రూపాయలను కూడబెట్టింది. గాలి జనార్థన్ రెడ్డికి ఎన్ని కోట్ల రూపాయలు ఉన్నాయో ఆయన కుమార్తెకు చేసిన వివాహంలో చేసిన హంగూ ఆర్భాటాలు చూస్తేనే అర్థమవుతుంది. బంగారు పళ్లేలు, నగలు, నట్రా.. ఇలా ఒకటేమిటి.. బంగారంతో పొదిగిన అన్నీ విలువైన వస్తువులు.కాలుకదిపితే ఏ కారు వస్తుందో ఆయనకు కూడా తెలియదు. ఇక ఇంట్లో ఉన్నా బయట ఉన్నా ఏసీల్లోనే గాలి సేదతీరతారు. అలాంటి గాలి జనార్థన్ రెడ్డి ఇప్పుడు చంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు గాలి జనార్థన్ రెడ్డితో పాటు మరో నలుగురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. వీరిపై ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానాను కూడా విధించింది. గతంలోనూ కొన్నేళ్ల పాటు గాలి జనార్థన్ రెడ్డి శిక్ష అనుభవిస్తూ జైలు జీవితం గడిపారు. అయితే ఆ శిక్షను మినహాయించాలని కోరినా న్యాయస్థానం ఒప్పుకోలేదు. దీంతో గాలి జనార్థన్ రెడ్డి చంచల్ గూడ జైలులో నిందితుడిగా ఉంటూ ఉన్నారుఇంట్లోనే మనం ఉండలేకపోతున్నాం. ఇక బిజినెస్ మాగ్నెట్ అయిన గాలి జనార్థన్ రెడ్డి జైల్లో ఉక్కపోతకు మగ్గిపోతున్నారట. తనకు జైల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలంటూ గాలి జనార్థన్ రెడ్డి పిటీషన్ వేశారు. అయితే గాలి పిటీషన్ ప్రస్తుతం రిజిస్ట్రీ పరిశీలనలో ఉ ంది. ఈ కేసులో విచారించి ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియదు కానీ గాలి జనార్థన్ రెడ్డి జైలు జీవితం గడపలేకపోతున్నారని అర్థమవుతుంది. తనకు ఇంటి నుంచి భోజనంతో పాటు నిద్రించడానికి బెడ్, ఫ్యాన్ తో పాటు మరికొన్ని సౌకర్యాలు కోరుతున్నారు. పాపం చేసిన గాలికి ఈ శిక్ష సరిపోతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అక్రమాలకు అనుభవించాల్సిందేనంటూ కామెంట్స్ వినపడుతున్నాయి.



రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం కూడా లేనట్లే.అందుకు జనార్దన్ రెడ్డి స్పందిస్తూ.. తన వయసును, తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి, శిక్షను తగ్గించాలని కోరారు. ఆయన విన్నపై జడ్జి స్పందిస్తూ..'ఈ కేసులో పదేళ్ల శిక్ష ఎందుకు వేయకూడదు' అని ప్రశ్నించారు. తాను ఇప్పటికే నాలుగేండ్లకు పైగా సామాజిక సేవ చేస్తున్నానని.. బళ్లారితో పాటు గంగావతిలో కూడా ప్రజలు తనను అఖండ మెజారిటీతో గెలిపించారని ఈ సందర్భంగా గాలి జనార్దన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. తన సేవలను గుర్తించినందుకే ప్రజలు గెలిపించారని చెప్పారు. ఆయన వాదనలు విన్న న్యాయస్థానం.. చివరకు ఆయనకు ఏడేళ్ల శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించింది.ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో.. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమ తవ్వకాల కేసు సంచలనం సృష్టించింది. ఏపీ అనంతపురం జిల్లాలోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో అక్రమ తవ్వకాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. సీబీఐ ఈ కేసును విచారించి.. పలువురిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసింది.విచారణలో భాగంగా గాలి జనార్థన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, వీడీ రాజగోపాల్, మెఫజ్ అలీ ఖాన్, ఓఎంసీ కంపెనీని దోషులుగా నిర్ధారించింది. వీరికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధించింది. అలానే ఈ కేసుకలో ఆరోపణలు ఎదుర్కొన్న సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలను నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని హైకోర్టు నిర్దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే.

# ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో జిల్లాకు ర్యాంకుల పంట

పెద్దపల్లి గత ఏప్రిల్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్ కార్యాలయా లకు, ఉద్యోగులు, జిల్లాలకు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి పూర్వపు జిల్లాల వారిగా ర్యాంకులను ప్రకటించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు అత్యధిక ర్యాంకులు పొందిన పలువురికి ఎస్ ఈ మాధవరావు అభినందనలు తెలిపారు. ఈ విజయం అందరి సమష్టి కృషితోనే సాధ్య మైనదని కంపెనీలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. రూరల్ సెక్షన్ విభాగంలో 1, 2, 3, 4, 5 వ ర్యాంక్స్ ను పెద్దపల్లి జిల్లా సెక్షన్ లు కైవసం చేసుకున్నాయని, వాటిలో కాట్నపల్లి 1 వ, బసంత్ నగర్ 2వ, అంతర్గం 3వ, ఖిలావనపర్తి 4వ ఎలిగేడు 5వ ర్యాంక్స్ ను సాధించినట్లు తెలిపారు. అర్బన్ సెక్షన్స్ లో పెద్దపల్లి టౌన్ 5వ ర్యాంక్ సాధించిందని, సబ్ డివిజన్ రూరల్ విభాగంలో సుల్తానాబాద్ ఏడిఈ శ్రీనివాస్ కి 1వ ర్యాంక్, ధర్మారం ఏడిఈ విజయ్ గోపాల్ సింగ్ కు 5వ ర్యాంక్ దక్కగా, డివిజన్ లలో పెద్దపల్లి డిఈ అదనపు ఇన్చార్జి రవి 1 వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ఏఈ, ఏడిఈ, సబ్ ఇంజనీర్స్, అకౌంట్స్ స్టాఫ్ అందరి కృషితోనే పెద్దపల్లి డివిజన్ డిఈ టెక్నికల్ బి. రవి కి 1 వ ర్యాంక్ వచ్చిందన్నారు. 16 జిల్లాలలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ రావడానికి కృషి చేసిన ప్రతీ ఉద్యోగికి సర్కిల్ తరుపున సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పూర్వపు కరీంనగర్ జిల్లాలో రూరల్ సబ్ డివిజన్ లలో శ్రీరాంపూర్ ఎడిఈ మధుకర్ కు ర్యాంక్ దక్కింది. పూర్వపు కరీంనగర్ జిల్లాలో సబ్ డివిజన్ అర్బన్ లో రామగుండం ఎడిఈ రమేష్ కి ర్యాంక్ దక్కింది. మున్ముందు అందరూ కష్టపడి పెద్దపల్లి జిల్లాకు ఇంకా మంచి ర్యాంక్ లు తీసుకురావాలని, మన సంస్థను అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్దామని పెద్దపల్లి సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు విద్యుత్ సంస్థ లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని కోరారు. జిల్లాలో ర్యాంకులు సాధించిన అందరికీ పేరు పేరున శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళా సంఘాల ద్వారా వృద్ధాశ్రమం నిర్వహణ

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

# 70 లక్షల రూపాయలతో వృద్ధాశ్రమం నిర్మాణం

పెద్దపల్లి

మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్దపల్లి జిల్లాలో వృద్ధాశ్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వృద్ధాశ్రమం నిర్వహణ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళా సంఘాలు పొదుపు తదితర విషయాలే కాకుండా సామాజిక సేవకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమై న విషయమని జిల్లా కలెక్టర్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం 70 లక్షల రూపాయల ఖర్చుతో వృద్ధాశ్రమాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. వృద్ధాశ్ర మంలో నిరాదరణలో ఉన్న 50 వయోవృద్ధులు మందికి ఆశ్రయం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

అయితే ఈ ఆశ్రమాన్ని నిర్వహించటానికి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు కోరగా అర్హతగల సంస్థలు ఏవీ రాకపోవడంతో జిల్లా మహిళా సమాఖ్య వారికి ఈ బాధ్యత ను అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. వృద్ధాశ్రమాన్ని నిర్వహించడమే కాకుండా సంవత్సరానికి సుమారు ఆరు లక్షలు వృద్ధుల కోసం మహిళా సంఘం ఖర్చు చేయడానికి ముందుకు రావడం వారి సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుందని కలెక్టర్ అన్నారు. అనంతరం వృద్ధాశ్రమం నిర్వహణ విషయమై జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాలరావుతో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్నేహ కార్యదర్శి శోభ, కోశాధికారి స్వప్న అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

=================================

# ట్రంప్ టవర్స్ కు ఎసరు...

హైదరాబాద్, మే 15,

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్లో గ్లోబల్ బ్రాండ్గా పేరొందిన ట్రంప్ రియాల్టీ సంస్థ కోకాపేటలో అత్యంత విలాసవంతమైన టవర్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాకముందే స్థల యాజమాన్య వివాదంలో చిక్కుకుంది. ఈ వివాదం ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్కు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భారతదేశంలో ఇప్పటికే ముంబై, కోల్కతా, గుర్గావ్, పుణెలలో విలాసవంతమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్మించింది. ఇప్పుడు హైదరాబాద్లోని కోకాపేట గోల్డెన్ మైల్ ప్రాంతంలో రూ3,500 కోట్ల విలువైన ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టులో మూడు టవర్లు, 66 అంతస్తులు, 243 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టుకు భారతీయ భాగస్వామిగా ఐరా రియాల్టీని ఎంచుకున్నారు. కోకాపేటలోని గోల్డెన్ మైల్ ప్రాంతంలో ఐరా రియాల్టీకి చెందిన స్థలంలో ఈ టవర్ల నిర్మాణం జరగనుంది. అనుమతుల ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు ప్రచారం జరిగింది, మరియు ఈ ఏడాది చివరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ఈ భారీ ప్రాజెక్ట్ మొదలు కాకముందే స్థల యాజమాన్య వివాదం తలెత్తింది. నాందెల రామ్రెడ్డి అనే వ్యక్తి తాను కూడా ఈ స్థలంలో సహ యజమాని అని, తనకు తెలియకుండానే ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రకటనలు జరిగాయని ఆరోపిస్తూ బహిరంగ లీగల్ నోటీసు జారీ చేశారు. రామ్రెడ్డి తరపు న్యాయవాది జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, గోల్డెన్ మైల్ ప్రాంతంలోని 12,602 గజాల స్థలంలో రామ్రెడ్డికి 425 గజాల వాటా ఉంది. ఈ స్థలాన్ని ఐరా రియాల్టీతోపాటు పది మందికి పైగా వ్యక్తులు కలిసి కొనుగోలు చేశారని, అందులో రామ్రెడ్డి ఒకరని వారు పేర్కొన్నారు.రామ్రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా ఈ స్థలంపై ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం తన హక్కులను కాలరాసినట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో తాను ఊరుకునేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.ఈ స్థల యాజమాన్య వివాదం ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి చట్టపరమైన సమస్యలు పరిష్కారం కాకపోతే, ప్రాజెక్ట్ ఆలస్యం కావచ్చు లేదా పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉంది. గతంలో కూడా హైదరాబాద్లోని కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు స్థల వివాదాల కారణంగా ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ఐరా రియాల్టీ, ట్రంప్ ఆర్గనైజేషన్ ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తాయనేది ఇప్పుడు కీలకం. ఒకవేళ రామ్రెడ్డితో చర్చలు జరిపి, ఆయన వాటాను కొనుగోలు చేయడం లేదా ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించగలిగితే, ప్రాజెక్ట్ పురోగతిలోకి వెళ్లే అవకాశం ఉంది. అలా కాకపోతే, ఈ వివాదం చట్టపరమైన పోరాటంగా మారి, ప్రాజెక్ట్ను వెనక్కి నెట్టవచ్చు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ గత కొన్నేళ్లుగా వేగంగా వృద్ధి చెందుతోంది. కోకాపేట, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాలు విలాసవంతమైన నివాస ప్రాజెక్టులకు కేంద్రంగా మారాయి. ట్రంప్ టవర్స్ వంటి గ్లోబల్ బ్రాండ్ ప్రాజెక్ట్ హైదరాబాద్కు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టే అవకాశం ఉ ంది. అయితే, స్థల వివాదాలు వంటి సమస్యలు ఈ అవకాశాలను అడ్డుకోవచ్చు. రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ వివాదం ఇతర డెవలపర్లకు కూడా ఒక హెచ్చరికగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. స్థల కొనుగోళ్లలో సహ యజమానులతో స్పష్టమైన ఒప్పందాలు, అనుమతులు, మరియు చట్టపరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ ఘటన తెలియజేస్తోంది.

# పచ్చదనం పరిశుభ్రత పై కమిషనర్ ప్రత్యేక దృష్టి

హుజురాబాద్: మే 15,

హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో పచ్చదనంపై కమిషనర్ కే సమ్మయ్య ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిరోజు తెల్లవారుజామునే వార్డుల్లో తిరుగుతూ పర్యవేక్షిస్తున్నారు. కార్మికులు, సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలిస్తూ సూచనలు చేస్తున్నారు. మునిసిపల్ పన్నుల వసూళ్ల విషయంలో కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని సిబ్బంది సహకారంతో 100% వసూళ్లను రాబట్టారు. రాష్ట్రంలోనే హుజూరాబాద్ మునిసిపాలిటీని మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నుండి మునిసిపాలిటీకి వచ్చే 15 వ ఆర్థిక సంఘం, కేంద్ర నిధులు రావడానికి మార్గం సుగమమైంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా తడి-పొడి చెత్త పై అవగాహన కోసం పట్టణం లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి పట్టణంలోని మహిళ గ్రూపు లు, ప్రజలు, విద్యార్థుల తో సెమినార్ ద్వారా చైతన్యం కలిగించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూలు మైదానంలో నెల రోజులపాటు పిల్లల కోసం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారు. నిత్యం ఒక దాత ద్వారా గుడ్డు, అరటిపండు పిల్లలకు అందజేస్తూ క్యారమ్, చెస్, హాకీ, కబడ్డీ,



వాలీబాల్ ఇతర క్రీడల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు హుజురాబాద్ పట్టణాన్ని హరితహారం, పరిశుభ్రత లో అగ్రభాగాన నిలపాలనే సంకల్పంతో నిత్యం వార్డుల్లో తెల్లవారుజామున సందర్శిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం గా ఉంచడం, గతంలో రోడ్లపై పెట్టిన మొక్కలను వేసవిలో నీళ్లు పెట్టి రక్షించడం ద్వారా పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీళ్లు పడుతూ అన్ని వార్డుల్లో వేసవి కాలంలో చెట్లను కాపాడుతున్నారు. గురువారం పోలీస్ స్టేషన్ ఏరియా, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏరియా తదితర ప్రధాన వీధుల్లో సిబ్బంది తో కలసి పర్యవేక్షణ చేశారు. స్వయంగా రోడ్లపై ఉన్న చెట్లను ట్రిమ్మింగ్ చేశారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం పై సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణం లో మోడల్ చెరువు, గుండ్ల చెరువులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

# పౌర సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి. మంత్రి సీతక్క

హైదరాబాద్

సికింద్రాబాద్లోని హరిహర కళాభవన్లో ఏపీ, తెలంగాణ పాస్టర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హజర్యారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఒక మంచి కాస్ కోసం పాస్టర్లంతా ఇక్కడ భేటీ కావడం అభినందనీయం. మతానికి మానవత్వం జోడిస్తేనే లోక కళ్యాణం సాకారం అవుతుంది. మతాలు, వేరైనా దేవుళ్ళు వేరైనా, ఎవరి విశ్వాసాలు వారివి. మతాన్ని రాజకీయాల కోసం వాడుకోవద్దు. ఎవరి విశ్వాసాలు వారు నమ్ముతూ.. సాటి మనిషిని ప్రేమించాలి. ఫలానా మతాన్ని ప్రేమించాలని చెప్పడం మూర్ఖత్వం అవుతుంది. మన దేశాన్ని లౌకిక రాజ్యాంగ మన పూర్వీకులు నిర్మించారు. ఇక్కడ అన్ని మతాల పట్ల సమాన గౌరవం ఉంటుంది. ఎవరికి నచ్చిన దైవాన్ని.. వారు నచ్చినట్లుగా పూజించుకునే వెసులుబాటు ఉంటుంది. మతం వేరు కాదు మానవత్వం వేరు కాదు. మానవత్వంతో కూడిన మతాన్ని ప్రజలు ఇష్టపడతారు. మత ప్రచారానికి పరిమితమవ్వకుండా మానవసేవయే మాధవసేవ అన్న సూత్రాన్ని అందరూ పాటించాలి. ప్రజల సౌఖ్యం కోసం, ఆరోగ్యం కోసం మతాలు పాటుపడాలి. దేవుడి ప్రార్థనలు చేస్తూనే పేదల కోసం డాక్టర్ థామస్ పనిచేస్తున్నారు . మనం చేసే సేవ.. వేయిండ్లు ప్రజలు గుర్తుంచుకోవాలి. మాత్మ గాంధీ, అంబేద్కర్ ని మన ప్రత్యక్షంగా కలవలేకపోయినా.. వారి బోధనలు సేవలు చిరస్మరణీయంగా నిలిచాయి. పౌర సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి. సమాజం కోసం మన ప్రాణాలు ఇవ్వలేకపోయినా.. తోటి ప్రజల కోసం సేవ చేయాలని అన్నారు.

# కేంద్రం ఆధీనంలోకి ఉపాధి

హైదరాబాద్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇక పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లిపోనుంది. రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ సైతం ఉండకుండా కేంద్రం అంతా తానై పథకాన్ని నడపనుంది. ఉపాధి హామీ పథకానికి ఏటా కేంద్రం బడ్జెట్లో నిధులను కేటాయిస్తోంది. అయితే, నిధుల ఖర్చు, పనుల గుర్తింపు తదితర వాటిని అమలు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేది. దీంతో పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో అక్రమాలు అరికట్టి పారదర్శకంగా పథకాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా యుక్తధార్, పేరిట యాప్ తీసుకొచ్చింది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 31 మండలాల్లో మండలానికి ఒక పంచాయతీ చొప్పున 31 చోట్ల యుక్తధార్ పోర్టల్ ద్వారా ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. యాప్పై అవగాహన కల్పించేందుకు ఉపాధి హామీ సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నారు. సర్వం యాప్ ద్వారానే: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి పనుల గుర్తింపు దగ్గర నుంచి పనులకు వచ్చే కూలీల వివరాలు, బిల్లుల చెల్లింపులు తదితరాలన్నీ యుక్తధార్ యాప్ ఆధారంగానే జరగనున్నాయి. జియోస్పేషియల్ ప్లానింగ్ పోర్టల్కు అనుగుణంగా యుక్తధార్ పనిచేస్తుంది. ఈ క్రమంలో ఉపాధి పనులను గుర్తించిన అనంతరం వాటిని జియోట్యాగ్ ద్వారా యాప్లో నమోదు చేయాల్సి ఉంటుంది. పనులకు వచ్చే కూలీల వివరాలు సైతం పొందుపరచాలి. జియోట్యాగ్ చేసిన పనుల వద్దే కూలీలఫొటోలను తీసి యాప్లో అప్లోడ్ చేయాలి.

# గులాబీలో కుర్చీలాట

హైదరాబాద్, మే 15,

భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు. 2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు. ఇంత కాలం ఆయన రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకున్నారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడిప్పుడే పార్టీ వర్గాలలో కూడా ఆయన తీసుకున్నది తాత్కాలిక విరామం కాదనీ,రాజకీయ విరమణేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు పూర్తిగా పగ్గాలు అప్పగించేయడమే తరువాయి అన్న వార్తలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అందుకు అనుగుణంగా కేసీఆర్ నెమ్మదిగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన పార్టీ పాతికేళ్ల సభలో హరీష్ రావు ప్రస్తావన, ప్రాముఖ్యత ఇసుమంతైనా లేకుండా అంతా కేటీఆరే అన్నట్లుగా నిర్వహించారంటున్నారు. అదే సమయంలో విషయాన్ని గుర్తించిన హరీష్ రావు తన దారి తాను చూసుకునేందుకు నిర్ణయించుకున్నారన్న వార్తలూ జోరుగా వినిపించాయి. అదే సమయంలో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కూడా తన సంగతేంటంటూ గొంతెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ఆమె రామానుజపురంలో నాంచారమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోది చెప్పే నాంచారమ్మలు కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. వారి మాటలను చిరునగవుతో విన్న కవిత జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సంఘటన యథాలాపంగా జరిగింది కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలే ఉందంటూ చేసిన వ్యాఖ్యకు దీనిని జోడించి సొంత సోదరుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారంటున్నారు. అది పక్కన పెడితే.. సందర్భంతో సంబంధం లేకుండా తాను కేసీఆర్ ఎవరికి పగ్గాలు అప్పగించినా స్వాగతిస్తానంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయనలోని అసంతృప్తికి,అసహనానికీ తార్కానంగా చెబుతున్నారు. అదే సమయంలో హరీష్ పార్టీ తదుపరి అధ్యక్షుడి విషయం లేవనెత్తడాన్ని కేసీఆర్ పొలిటికల్ రిటైర్మెంట్ కు రెడీ అయిపోయారన్న సంకేతాన్ని ఇవ్వడమేనని చెబుతున్నారు. పార్టీ శాసనసభా పక్ష నేతగా కేటీఆర్ అంగీకరించని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు.. ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్ష పగ్గాలనే అప్పగిస్తానని కేసీఆర్ అంటే అంగీక రిస్తారా అన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పార్టీ అధినేతగా కేసీఆర్ ఉన్నంత వరకూ ఆయన అభిప్రాయాన్ని కాదని ఎవరూ అనరు కానీ, ఒక సారి ఆయన ఆ స్థానం నుంచి తప్పుకుంటే మాత్రం కేసీఆర్ మాట ఇక పార్టీలో ఎంత మాత్రం శిలాశాసనం అన్న పరిస్థితి ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశీలకులు బీఆర్ఎస్ చీలిక అంచున ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

======================

# కాంటాక్ట్ లెక్చరర్లు తొలగింపేనా

హైదరాబాద్, మే 15, (

తెలంగాణలోని విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపుపై నిర్ణయం ఆయా విశ్వవిద్యాలయాలకే ప్రభుత్వం వదిలేసింది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ పేర్కొంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తుది నిర్ణయాన్నివిశ్వవిద్యాలయాలకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగిస్తారా లేదా తొలగిస్తారా అనే అంశం ఇప్పుడు విశ్వవిద్యాలయాల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ విషయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ సూచించినట్లు సమాచారం. ఈసీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తుండటంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని విశ్వవిద్యాలయాలకు వదిలివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించడం లేదా వారిని తొలగించి రెగ్యులర్ సిబ్బందిని నియమించడం అనేది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన విషయం. అయితే విద్యాశాఖ ఈ విషయంలో విశ్వవిద్యాలయాల నిర్ణయానికి వదిలివేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వారిని తొలగిస్తే ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఈ విషయంపై విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ మాత్రం కాంట్రాక్టు లెక్చరర్ల అంశంపై ఈసీలో చర్చించి ప్రతిపాదనలు పంపాలని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దీనివల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టు లెక్చరర్లు చెబుతున్నారువిద్యాశాఖలో అవగాహన లేని కొందరు అధికారుల కారణంగా అనవసర సమస్యలు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే ముందు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయివిశ్వవిద్యాలయాల్లో దాదాపు 1500 మంది కాంట్రాక్టు.. అవుట్ సోర్సింగ్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే అధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లకుండా.. ఖాళీలన్నింటినీ భర్తీ చేయవచ్చని వివరించినట్లు తెలుస్తోంది. దీనితో ఆయన వెంటనే ఖాళీల భర్తీకి ఆమోదం తెలిపారు. ఆ తరువాతే కాంట్రాక్టు లెక్చరర్లు తమను క్రమబద్ధీకరించాలని.. లేకపోతే టైమ్ స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు.

# రేషన్ కార్డుల ఏరివేత

హైదరాబాద్, మే 15, (

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యల్లో నిజముంది. ఎందుకంటే రెండు రాష్ట్రాల్లో పథకాలను పొందుతూ, రెండు రాష్ట్రాల రేషన్ కార్డులు ఉన్న వారు అనేక మంది ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చి స్థిరపడినా అక్కడ సొంత ఇల్లు.. ఇక్కడ ఉపాధి కోసం వచ్చిన వారు రెండు చోట్ల రేషన్ కార్డులు తీసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అందించే పథకాలు అందుకుంటున్నారు. నిజంగా ఇది దురదృష్టకరమే. ప్రజాధనం పక్కదోవపట్టడమే అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. దీనిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకుని కేవలం ఒక రాష్ట్రంలోనే రేషన్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఉచిత పథకాలు అందాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలకు సార్థకత చేకూరతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం అమ్ముకునే వారికి ఎందుకు ఇవ్వాలని ఆయన వేసిన ప్రశ్నలో కూడా అర్థం ఉంది. తెలంగాణలో కోటి పది లక్షల కుటుంబాలు ఉంటే పొరుగు రాష్ట్రానికి చెందని వారికి కూడా ఇక్కడ రేషన్ కార్డులన్నాయన్నారు. దీనివల్ల అక్కడా, ఇక్కడా బియ్యం తీసుకోవడంతో అవి పక్కదారి పట్టే అవకాశముంది. అదే సమయంలో రెండు చోట్ల పథకాలను అందుకుంటుంటే ప్రభుత్వ ఖజానాపై కూడా భారం పడే అవకాశముంటుంది. ఒకరు ఒక రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలను పేదలు అందుకోవాల్సి ఉంటుందికానీ అర్హతలులేని వారు కూడా అనేక మంది ఉచితాలు పొందుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రెండుచోట్ల రెండు ఓట్లు ఉన్నాయి. వేర్వేరు సార్లు ఎన్నికలు జరుగుతుండటంతో అక్కడకు వెళ్లి ఓటేస్తారు. ఇక్కడా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఎన్నికల కమిషన్ ఒకే రాష్ట్రంలో ఒకేచోట మాత్రమే ఓటు హక్కు ఉండాలన్ననిబంధన పెట్టింది. ఇప్పుడు అలాగే పథకాలను కూడా ఎక్కడో ఒకచోట మాత్రమే తీసుకునే అవకాశం కల్పిస్తే నిజమైన పేదలకు పథకాలు అందుతాయి. ప్రభుత్వాలకు కూడా కొంత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని



విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండేలా చర్యలు తీసుకుంటే చాలా వరకూ ఖజానా పై భారం తగ్గుతుందని ఉన్నతాధికారులు కూడా చెబుతున్నారు.

# హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ సీరియస్

హైదరాబాద్ హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఆగ్రహం తెప్పించారు హయత్ నగర్ సీఐ. వివాదాస్పద భూముల విషయంపై బాధితులు ఫిర్యాదు చేసినా ఎందుకు కేసు నమోదు చేయలేదని సీరియస్ అయ్యారు. పోలీసులు ఉన్నది బాధితుల కోసమే కదా, మరెందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. కోహెడలో తమ ప్లాట్లను కబ్జా చేశారని బాధితులు ప్రజావాణిలో భాగంగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రంగనాథ్ ను కలిసి వివరించారు. ఈ క్రమంలోనే ఆ వివాదాస్పద స్థలాన్ని రంగనాథ్ పరిశీలించారు. అయితే ఆ ల్యాండ్ లో మారణాయుధాలు ఉండటం చూసి రంగనాథ్ అవాక్కయ్యారు. మరోసారి

విషయం పూర్తిగా తెలుసుకొని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులపై దాడి జరిగినా, మారణాయుధాలు ల్యాండ్ లో ఉన్నా ఎందుకు కేసులు నమోదు చేయలేదని హయత్ నగర్ సీఐని ప్రశ్నించారు.

# మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

నర్సంపేట మే 14

మే 20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని నర్సంపేటలో అన్ని కార్మికసంగాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలి నిర్వహించారు. అనంతరం ఏఐఎఫ్టి యు న్యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మోడెమ్ మల్లేశ్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు గోనె యువరాజు,కొల్లూరి లక్ష్మీనారాయణ, ఎలకంటి రాజేందర్,మునేశ్వర్,సాగర్,రైతుకూలీ సంఘం నాయకులు,ఈర్ల పైడి,భూమా అశోక్, బొర్రా ఆనంద్, కడారి సురేష్,ఏఐఎఫ్టియు న్యూ నర్సంపేట పట్టణ నాయకులు మంద మల్లన్న,మెరుగు జనార్ధన్, బొల్లెన రమేష్ లు మాటడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కాలరాయడంతో పాటు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# జెఎన్టీయూ విద్యార్థులకు విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్

జేఎన్టీయూ యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థులకు నైపుణ్యం తో కూడిన విద్య తో పాటు అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని జేఎన్టీయూ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రో. కిషన్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు జేఎన్టీయూ గోల్డెన్ జూబ్లీ సెమినార్ హాల్ లో . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత విద్యార్థుల భవిష్యత్తుపైనే దృష్టి సారించామని అన్నారు. అదేవిధంగా జేఎన్టీయూ యూనివర్సిటీ కి సంబంధించిన 89 ఎకరాల హౌసింగ్ బోర్డ్ స్థలాన్ని ఇప్పటికీ యూనివర్సిటీ లిజ్ లోనే నడుస్తుందని సాధ్యమైనంత త్వరగా వర్సిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే హౌసింగ్ బోర్డు 90 కోట్లు రూపాయలకు పైగా లీజ్ కి చెల్లించమని తెలిపారు . రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు త్వరగా వస్తే మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.

# తడిసిన ప్రతీ గింజా కొంటామని రైతులకు భరోసా ఇవ్వండి:

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడంతో వర్షానికి పంట తడిసి ముద్ద అవుతున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. రాష్ట్రంలో ఏ కొనుగోలు కేంద్రం వద్ద చూసినా తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ లో ఆయన పోస్ట్ పెట్టారు. తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇవ్వాలని, కొనుగోళ్ళు వేగంగా జరిపి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసు పహారా మధ్య, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సమీక్షలు చేసే సీఎం రేవంత్ రెడ్డి ఇకనైనా కండ్లు తెరవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వర్షం కారణంగా తడిసిన ధాన్యం ఫొటోలు, వీడియోలను జతచేసి పోస్టు చేశారు. కొత్త ఉద్యోగులను సీఎం భయ పెడుతున్నరు. ఉద్యోగాల్లో చేరుతున్న కొత్త ఏఈల్లో సీఎం రేవంత్ రెడ్డి ఉత్సాహాన్ని నింపకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ కు నియామక పత్రాలు అందించి అది వారి ఘనతగా చెప్పుకునేందు ప్రయత్నిస్తున్నానన్నారు.

# లయన్స్ క్లబ్ కాకినాడ శరవణ్ సంస్థ ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ థామస్ కాటన్ జయంతి వేడుకలు

అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ్ కాకినాడలోని బాపన దోర కాలనీలోని శ్రీ దుర్గా ఇండస్ట్రీస్లో సర్ ఆర్థర్ థామస్ కాటన్ జయంతి వేడుకలను నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు అలై. యాళ్ళ రత్నారావు మరియు సీనియర్ సభ్యుడు అలై. డి.ఎల్. శాస్త్రి సర్ ఆర్థర్ కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆ తరువాత క్లబ్ సభ్యుల నుండి పుష్పలు సమర్పించారు. ఈ సందర్భంగా, క్లబ్ అధ్యక్షుడు అలై. యాళ్ళ రత్నారావు, ఆంధ్రప్రదేశ్లో నీటిపారుదల మరియు వ్యవసాయానికి సర్ ఆర్థర్ కాటన్ చేసిన విశేష కృషి గురించి మాట్లాడారు. సీనియర్ సభ్యుడు అలై. డి.ఎల్. శాస్త్రి మాట్లాడుతూ, "సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణం వెనుక ఉన్న దార్శనికుడు. ఆయన ఇంజనీరింగ్ అద్భుతం బంజరు భూములను సారవంతమైన పొలాలుగా మార్చింది, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రకృతి దృశ్యాన్ని మార్చింది. రైతులకు ఆయన చేసిన అమూల్యమైన సేవకు, నేటికీ ఆయనను చాలా మంది దేవుడిగా గౌరవిస్తారు మరియు పూజిస్తారు." మరియు క్లబ్ వ్యవస్థాపకుడు అలై. దిలీప్ కుమార్ సధనాని కూడా సమావేశంలో ప్రసంగించారు, సర్ కాటన్ దార్శనికత మరియు వారసత్వాన్ని హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గోవింద్ మరియు బి. రవి, అనేక మంది ఉత్సాహభరితమైన సభ్యులతో పాటు చురుకుగా పాల్గొన్నారు.

# శాతవాహనలో లా కోర్సు...

కరీంనగర్, మే 15 (

కరీంనగర్‌లోని శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా అనుమతి కోసం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన కృషి ఫలించింది. లా కళాశాల అనుమతికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి.మంది విద్యార్థులతో(రెండు సెక్షన్లు) ఎల్ఎల్ బి కోర్సు ప్రారంభం కానుంది. శాతవాహన వర్సిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. ఈ నేపథ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లారు.సంబంధిత శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఈ ఏడాది నుండే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. మొత్తం 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై వర్చువల్ గా శాతవాహన వర్సిటీని వర్చువల్ గా తనఖీ చేయడంతోపాటు వివరణలతో కూడిన నివేదిక కోరిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపినట్లు తెలిపారు. కాలేజీ అనుమతికి ఆమోదం తెలపడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరం నుండే ఎల్ ఎల్ బీ కోర్సును ప్రారంభానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. మూడేళ్ల లా డిగ్రీకి అనుమతులు లభించింది. 2025-26 అకాడమిక్ ఇయర్ నుండి తరగతులు ప్రారంభంఅవుతాయి., కొత్త కోర్సుల మౌలిక ఏర్పాటులో విశ్వవి ద్యాలయం ముందుకు సాగు తుంది. తొడ్పా టు అందించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్ కి, కేంద్ర మంత్రి బండి సంజయకుమార్‌కి కేంద్ర చట్ట,న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కి కృతజ్ఞతలు తెలిపారు

# వీరయ్య చౌదరీకి మంత్రి లోకేష్ నివాళులు

ఒంగోలు మే 15, (

ఇటీవల దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని లోకేష్ గుర్తుచేసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహ రెడ్డి, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు..

# వ్యభిచారం ముఠా గుట్టు రట్టు నిందితుల్లో బంగ్లా దేశీయులు

సికింద్రాబాద్ మే 15, (

గోపాలపురంలో నార్కోన్ టాస్కోర్స్ పోలీసుల దాడులు జరిగాయి. వ్యభిచారం చేయిస్తున్న ముఠా గుట్టును టాస్కోర్స్ పోలీసులు రట్టు చేసారు. ఇద్దరు బంగ్లాదేశీయులతో పాటు మొత్తం ఐదుమందిని అరెస్ట్ చేసారు. బంగ్లాదేశ్ కు చెందిన అమ్మాయిలతో సాకిన్ ఓసేన్, విమల్ సేన్ వ్యభిచారం చేయిస్తున్నారు.పోలీసుల అదుపులో ఇద్దరు యువతులు ఒకరు బంగ్లాదేశ్, మరొక్కరు పశ్చిమ బెంగాల్ చెందిన వారిగా గుర్తించారు. ముగ్గురు యువకుల్లో ఒకరు బంగ్లాదేశీయుడు. అక్రమంగా బంగ్లాదేశ్ నుంచి భారత్ వచ్చినట్లు గుర్తించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ లో నిందితులను అప్పగించారు.

# మంటల్లో బస్సు దగ్ధం

మేడ్చల్ మే 15, (

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రైవేటు బస్సు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మేడ్చల్ మండలంలోని బండ మైలారం నుండి కొంపల్లికి వెళ్తుండగా మేడ్చల్ ఐటిఐ వద్ద రాగానే ఓ ప్రైవేట్ బస్సు లో మంటలు ఒకసారిగా చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపాడు. క్షణాల్లో బస్సు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ద్వారానే బస్సు దగ్ధమైందని డ్రైవర్ తెలిపారు. సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్ నీ చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని పూర్తి వివరాలను సేకరించారు.

# నకిలీ ఆధార్ కార్డుతో ప్లాట్ రిజిస్ట్రేషన్ కు యత్నం పోలీసుల అదుపులో ఇద్దరు

హయత్ నగర్‌నకిలీ ఆధార్ కార్డ్ తో ప్లాట్స్ రిజిస్ట్రేషన్ కు యత్నించిన ఆర్టీసీ కండక్టర్ ను అబ్దుల్లాపూర్ మెట్ సబ్ రిజిస్టర్ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం మజీద్ పూర్ కు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న ప్లాట్లను నకిలీ డాక్యుమెంట్స్ తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సబ్ రిజిస్ట్రర్ కార్యాలయానికి భాస్కర్ రెడ్డి,శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. ప్రభుత్వ గుర్తింపు కార్డు గా నకిలీ ఆధార్ కార్డ్ ఇవ్వడం జరిగింది.

# 19 వేల కోట్లతో మెట్రో సెకండ్ ఫేజ్

హైదరాబాద్, మే 15,

హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) 86.5 కిలోమీటర్ల మేర మూడు మార్గాల్లో విస్తరించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ను హెచ్ఏఎంఎల్ ఆమోదించింది. త్వరలో మంత్రివర్గ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బ్యాంకుల రుణాలు, పీపీపీ విధానం ద్వారా కూడా నిధులు సేకరించనున్నారు. మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) విస్తరణ ప్రణాళిక దాదాపు 19 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించబడింది. ఈ ప్రతిపాదిత విస్తరణలో భాగంగా, మూడు ప్రత్యేక మార్గాల్లో మొత్తం 86.5 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలను విస్తరించనున్నారు. ఈ కొత్త మార్గాల్లో జేబీఎస్ నుండి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు, అలాగే శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించింది, దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహిస్తున్నారు. ఆమోదం పొందిన నివేదికను ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తోంది, మరియు త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత, ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన మూడు మార్గాల కోసం ప్రత్యేక డీపీఆర్ లను రూపొందించారు. మునుపటి ప్రణాళికల్లో జేబీఎస్-శామీర్‌పేట , జేబీఎస్-మేడ్చల్ మార్గాల్లో డబుల్ డెక్ నిర్మాణాన్నిచేపట్టాలని భావించారు, ఇక్కడ ఒకే స్తంభంపై రెండు అంతస్తుల్లో రవాణా సౌకర్యాలు ఉండేలా డిజైన్ చేయాలనుకున్నారు..ఒక అంతస్తులో రహదారి, మరొకటి మెట్రో రైలు కోసం. అయితే, స్టేషన్లు అధిక ఎత్తులో ఉండటం వలన ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని భావించి, హెచ్ఏఎంఎల్ ఈ ప్రతిపాదనను విరమించుకుంది. కొత్త ప్రతిపాదనల ప్రకారం, జేబీఎస్ నుండి కార్ఖానా, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇక్కడ.. హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రన్‌వే రహదారికి సమీపంలో ఉండటంతో.. భద్రతా కారణాల దృష్ట్యా ఎలివేటెడ్ మార్గానికి రక్షణ సంస్థలు అభ్యంతరం తెలిపాయి. దీని కారణంగా.. ఈ మార్గంలో దాదాపు కిలోమీటరున్నర దూరం వరకు భూగర్భ మార్గంలో మెట్రో రైలును నిర్మించాలని నిర్ణయించారు. రన్‌వే కింద నుండి మెట్రో రైలు వెళ్లేలా తుది డిజైన్‌ను రూపొందించారు. జేబీఎస్ నుండి తాడ్ బండ్, బోయిన్ పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ కొన్ని ఆంక్షలు విధించడంతో, ఈ మార్గంతో పాటు శామీర్‌పేట మార్గం కూడా జేబీఎస్ నుండి ప్రస్తుతం ఉన్న మెట్రో మార్గం కంటే తక్కువ ఎత్తులో వెళ్లేలా ప్రణాళిక చేశారు. జేబీఎస్ ను మూడు మార్గాలకు అనుసంధానం చేస్తూ ఒక ప్రధాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్గాలను రూపొందించారు. శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ విమానాశ్రయంలోని టెర్మినల్ స్టేషన్ భూగర్భంలో ఉంటుంది. ఈ మార్గంలో, రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ మార్గంలో మెట్రో రైలు వెళ్తుంది. అక్కడి నుండి, ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 18 కిలోమీటర్ల మేర భూగర్భ మార్గంలో వెళ్లేలా డీపీఆర్ ను రూపొందించారు. ఈ ప్రతిష్టాత్మక రెండవ దశలోని రెండవ భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా డీపీఆర్ ను రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర ప్రభుత్వం 18 శాతం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన 48 శాతం నిధులను బ్యాంకుల నుండి రుణాలుగా సేకరిస్తారు. మరో 4 శాతం నిధులను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో సేకరించాలని యోచిస్తున్నారు.

# గిగ్ వర్కర్ల కోసం చట్టం సిద్ధం

హైదరాబాద్, మే 15, (

గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక బిల్లును తీసుకొస్తున్నట్లు ప్రతిపాదించింది తెలంగాణ ప్రభుత్వం.ముసాయిదా బిల్లును విడుదల చేసి, దానిపై అభ్యంతరాలు తీసుకుంటోంది.వీటి ఆధారంగా తుది బిల్లును తయారు చేసి అమల్లోకి తీసుకువస్తామని చెబుతోంది ప్రభుత్వం.అయితే, తాము ఆశించిన మేరకు బిల్లు తీసుకురాలేదంటున్నారు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు.2022 జూన్‌లో నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం... 2020-21 నాటికే భారత్‌లో 77లక్షల మంది గిగ్ రంగంలో ఉపాధి పొందుతున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం ఈ సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చని అంచనా.దేశ శ్రామిక రంగంలో గిగ్ వర్కర్ల వాటా 1.5 శాతంగా ఉందని నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది.2029-30 నాటికి గిగ్ వర్కర్లు సుమారు 2.35 కోట్లకు చేరుతారని, శ్రామిక రంగంలో వీరి వాటా 6.7శాతానికి చేరుకుంటుందని అంచనా.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్‌కు సామాజిక భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది నీతి ఆయోగ్.తెలంగాణలో 4.20 లక్షల మంది గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ ఉన్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ బీబీసీతో చెప్పారు.స్విగ్గీ, జొమాటో, ర్యాపిడో, ఓలా లాంటి యాప్ బేస్డ్ ట్యాక్సీ డ్రైవర్స్ లేదా మోటార్ సైకిల్ రైడర్స్, డెలివరీ ఏజెంట్స్‌తో పాటు గిగ్ అండ్ మార్కెట్ ప్లాట్‌ఫాంలలో పనిచేసే ఫ్రీలాన్స్ లేదా పార్ట్ టైం వర్కర్లందరూ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ కిందకు వస్తారు.తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్,2025 పేరుతో ముసాయిదా బిల్లు ఉంది.ప్రస్తుతం ఈ ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు తీసుకుంటోంది తెలంగాణ కార్మిక శాఖ.ప్రత్యేకంగా తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది చట్టం ద్వారా ఏర్పాటు చేసే తేదీ నుంచి అందుబాటులోకి వస్తుంది. బోర్డు ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటుంది.బోర్డులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఎక్స్-అఫీషియో ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించే అధికారి కార్యదర్శిగా ఉంటారు.కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు, రాష్ట్ర కార్మిక శాఖ, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి లేదా కార్యదర్శి, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కార్మిక శాఖ కమిషనర్ ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉంటారు.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ తరఫున నలుగురు సభ్యులు (ఒక మహిళ),అగ్రిగేటర్స్ నుంచి నలుగురు సభ్యులు (ఒక మహిళ), పౌర సమాజం నుంచి ఇద్దరు ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.వీరిని రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. డాటా కలెక్షన్, ఐటీ సిస్టమ్స్ పరంగా సాంకేతిక నిపుణుడు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉంటారు. వీరి పదవీకాలం మూడేళ్లు ఉంటుంది.గిగ్ వర్కర్లుగా పనిచేసే వ్యక్తులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకుంటే ప్రతి కార్మికుడికీ ఓ యూనిక్ ఐడీ ఇస్తారు.అగ్రిగేటర్లు లేదా ప్లాట్‌ఫాంలు ఈ చట్టం అమల్లోకి వచ్చిన 45 రోజులలోగా వెల్ఫేర్ బోర్డులో తమ సంస్థలు లేదా కంపెనీలను రిజిస్టర్ చేసుకోవాలి.ఆయా సంస్థలు వర్కర్స్ విషయంలో మతం, జాతి, కులం, లింగం పుట్టిన స్థలం, వైకల్యం ఆధారంగా ఎలాంటి వివక్ష చూపించకూడదు.ఎవరైనా వర్కర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలంటే ఏడు రోజుల ముందుగా రాతపూర్వక నోటీసు ఇవ్వాలి.కానీ, వినియోగదారుడు (కస్టమర్)కి హాని జరిగిందని గుర్తిస్తే వెంటనే తొలగించే

అధికారం ఆయా సంస్థలకు ఉంటుంది.వర్కర్స్‌కు ఇచ్చే వేతనాల్లో కోత పెడితే, వాటిని వారికి చేసే పేమెంట్స్ ఇన్వాయిస్‌లో చూపించాలి.గిగ్ వర్కర్స్ చేసే ఫిర్యాదులు లేదా సందేహాలు నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని ప్రతి ప్లాట్‌ఫాం నియమించుకోవాలి. సదరు వ్యక్తి వివరాలు వర్కర్‌కు తెలిసేలా ప్లాట్‌ఫాం అప్లికేషన్‌లో ఉండాలి.రాష్ట్ర ప్రభుత్వం గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక నిధి (తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ ఫండ్) ఏర్పాటు చేయనుంది.నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో ఇవ్వడంతోపాటు సంస్థలు, గిగ్ వర్కర్స్ ఇచ్చే మొత్తాన్ని ఫండ్‌లో జమచేస్తారు.తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ ఫీజును అగ్రిగేటర్స్ లేదా ప్లాట్‌ఫామ్స్ నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్లకు చెల్లింపుల్లో ఒకశాతం తక్కువ కాకుండా, రెండు శాతానికి మించకుండా ఫీజు ఉంటుంది.

'సంస్థల తరఫున జరిగే లావాదేవీలన్నీ వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ (డబ్ల్యూఎఫ్‌వీఎస్)' తో మ్యాప్ చేసి ఉంటుంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం, బోర్డు పర్యవేక్షిస్తుంది'' అని బిల్లులో ప్రతిపాదించింది తెలంగాణ ప్రభుత్వం.'సంస్థలు వెల్ఫేర్ ఫండ్ ఫీజు చెల్లించని పక్షంలో ఏడాది జైలు లేదా రెండు లక్షల రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించే వీలుంటుంది. ఆయా సంస్థలు సమాచారం, స్టేట్‌మెంట్, రిపోర్టులు ఇచ్చేందుకు నిరాకరిస్తే, రూ.50 వేల వరకు జరిమానా విధించే వీలుంటుంది'' అని ప్రభుత్వం చెబుతోంది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేస్తానని చెబుతున్నప్పటికీ,అది ఎంత అనేది చట్టంలో ప్రస్తావించలేదని చెబుతున్నారు గిగ్ వర్కర్లు."కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత హక్కులు చట్టంలో పెట్టాలి. వీటిని నిబంధనలకే పరిమితం చేయకూడదు'' అని బీబీసీతో చెప్పారు సలావుద్దీన్. అయితే, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల పాలసీని తీసుకువస్తున్నామని, మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి.అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామని ఆయన చెప్పారు.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ నుంచి వచ్చే విజ్ఞప్తులు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమిస్తుందని బిల్లులో ప్రభుత్వం ప్రతిపాదించింది.మరోవైపు, "ప్రభుత్వం ప్రతిపాదించిన బోర్డులో వర్కర్స్, ప్లాట్ ఫాంలు, ప్రభుత్వం నుంచి సమాన ప్రాతినిధ్యం ఉండాలి. బోర్డ్ కేవలం సలహాలివ్వడానికే పరిమితం కాకుండా జరిమానాలు విధించడం, కంపెనీలపై పర్యవేక్షణ, విచారణ నిర్వహించే అధికారం ఉండాలి'' అని సలావుద్దీన్ సూచించారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 నవంబరులో గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్లతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సమావేశమయ్యారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకువస్తామని అప్పట్లో ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరులో సీఎం రేవంత్ రెడ్డి.. గిగ్ వర్కర్లతో సమావేశయ్యారు."రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోనూ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తాం'' అని చెప్పారు. ఇందులో భాగంగా తెలంగాణలో ప్రత్యేక చట్టం తీసుకువచ్చేందుకు ముసాయిదా బిల్లును తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది. ఇప్పటికే దేశంలో రాజస్థాన్, కర్ణాటకలో గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకువచ్చాయి.బీమా సదుపాయం కల్పించడంతో పాటు ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ వంటివి కల్పించాలని కోరారు.ప్రస్తుతం ముసాయిదా బిల్లు విడుదల చేసిన నేపథ్యంలో అభ్యంతరాలు స్వీకరణకు ప్రభుత్వం ఏప్రిల్ 29 నుంచి మూడు వారాల గడువు ఇచ్చింది."ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలను బిఐ.ఐఐఐ.శ్రీజీవిసీఓవీఏజీఓశ్రీ.ఇవీఏ కు మెయిల్ చేయవచ్చు లేదా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మికశాఖ భవన్‌లో రాతపూర్వకంగా ఇవ్వచ్చు'' అని కార్మిక శాఖ ప్రకటించింది.

# మహారాజ్ గంజ్ లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్ మే 15,

అఫ్జల్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహరాజ్ గంజ్ లో గోల్ మసీదు సమీపంలో ఓ భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. మూడో అంతస్తులో మొదలైన మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. మూడో అంతస్తులో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆరు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి తెచ్చారు అగ్నిమాపక సిబ్బంది. కింద ఉన్న షాపు లలోకి మంటలు వ్యాపించకుండా మంటలను ఆర్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# రేషన్ బియ్యం పట్టివేత

కరీంనగర్ మే 15,

ధర్మారం మండలం ఎర్రగుట్టపల్లి వద్ద లారీలో అక్రమంగా తరలిస్తున్న 211 క్వింటాళ్ల రేషన్ నన్నబియ్యాన్ని సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టి పేట నుంచి హుజురాబాద్ కు తరలిస్తుండగా పట్టుకున్నారు. లక్షెట్టిపేటకు చెందిన సంపత్, ఉమామహేశ్వర్ పై కేసు నమోదు చేసారు. లారీ తోపాటు రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు.

# సంగారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాలు పలు చోట్ల ధాన్యం నీటిపాలు

సంగారెడ్డి మే 15,

ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం సంగారెడ్డి జిల్లాలో నమోదు అయింది. సంగారెడ్డి జిల్లా కోహిర్ 9.5, పుల్కల్ 7.5, లక్ష్మి సాగర్ లో 5.5 సెం. మీ వర్షపాతం నమోదయింది. మెదక్ జిల్లా టేక్మాల్ 8.4, లింగంపల్లిలో 3.8 సెం. మీ వాన కురిసింది. భారీ వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. జోగిపేట, మెదక్, తూప్రాన్ ప్రాంతంలో ధాన్యం తడిసింది.

# పల్లప్రోలు గ్రామం లో మల్లికార్జున రెడ్డి అనే వ్యక్తి అనుమానస్పద మృతి

నెల్లూరు మే 15,

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పల్లప్రోలు గ్రామం గోపాలపురంలో దారుణం చోటు చేసుకుంది. గ్రామంలోని పోలం వద్ద మల్లికార్జున రెడ్డి అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నారు. సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లిన మల్లికార్జున రెడ్డి రాత్రి 8 అయిన ఇంటికి రాకపోవడంతో అతని భార్య వెతుక్కుంటూ పొలం వద్దకు వెళ్ళింది. పొలం వద్ద ఆయన భర్త విగత జీవిగా పడి ఉన్నారు. తలకు బలమైన గాయం తగిలి ఉండడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ తో పాటు డాగ్ స్క్వాడ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. అన్నదమ్ముల పొలం వివాదమే హత్యకు కారణంగా అనుమానిస్తున్నామని ఇన్చార్జి కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. విచారణ పూర్తయిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

# వల్లభనేని వంశీకి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు

అమరావతి మే 15,

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని జైలు నుంచి ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. శ్వాస తీసుకోవడంతో ఆయన ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని జైలు సిబ్బందికి చెప్పడంతో వెంటనే ఆయన్ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.వల్లభనేనికి ప్రస్తుతం వైద్యం అందిస్తున్నారు. ఈ విషయం బయటకు తెలియడంతో ఆస్పత్రి వద్దకు వైకాపా వర్గీయులు భారీగా చేరుకున్నారు. వల్లభనేని వంశీ ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు.

# పది కోట్ల బంగారం వ్యాపారి పరారీ

బాచుపల్లి

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. గత 15 సంవత్సరాలుగా చేతన్ జువెలర్స్ పేరిట ప్రగతి నగర్‌లో నితీష్ జైన్ అనే వ్యక్తి బంగారం వ్యాపారం చేస్తున్నాడు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే బంగారం, ఆభరణాలతో నితీష్ జైన్ పరారయ్యాడు. దీంతో.. అతని బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దుకాణం తెరవకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది.

స్థానికంగా ఉన్న బంగారం దుకాణాల వద్ద బంగారాన్ని తీసుకు వచ్చి ఆభరణాలు చేయడంతో పాటు కన్నమర్లకు అమ్ముతూ దుకాణదారులకు జైన్ దగ్గరయ్యాడు. తన నెట్‌వర్క్‌ను పెంచుకుంటూ అందరికీ నమ్మకం కలిగించి ఒక్కసారిగా భారీగా బంగారు ఆభరణాలతో జంప్ అయ్యాడు.

భారీ మొత్తంలో అతనికి బంగారం ఇచ్చిన నగల దుకాణదారులు లబోదిబోమంటున్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టుకుని మరీ వడ్డీలకు ఇస్తుండే వాడని బాధితులు తెలిపారు. స్నేహితులు కూడా పెట్టి బాధితులను నితీష్ జైన్ ఆకర్షించాడు. కేపీహెచ్‌బీ, బాచుపల్లి పరిధిలో తన వ్యాపారాన్ని నితీష్ జైన్ సాగించాడు.

# సూర్యాపేటజిల్లాలో 12 ఆసుపత్రులకు నోటీసులు, 7 ఆసుపత్రి లకు షో కాజ్ నోటీసులు జారీ

## -ఆపిల్ స్కానింగ్ సెంటర్,శరత్ కార్డియాక్ సెంటర్ సీజ్

## -సూర్యాపేట డివిజన్ లో 2 బృందలు తనిఖీలు





సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) మే 15:సూర్యాపేట జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సూర్యాపేట జిల్లా వైద్య శాఖ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న ఆసుపత్రుల పై, నకిలీ వైద్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాలకు భద్రత కల్పించటం మన భాద్యత అని, కలెక్టర్ సూచనల మేరకు జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ మరియు లాబ్స్, స్కానింగ్ సెంటర్ లను పర్యవేక్షించుటకు జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటి క్రింద క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం సమర్థవంతంగా అమలు పరుచటకు 3 ప్రత్యేక బృందలను ఏర్పాటు చేయటం జరిగింది.

కోదాడ డివిజన్ లో ఒక బృందం, సూర్యాపేట డివిజన్ లో 2 బృందలు తనిఖీలు చేపడుతున్నాయి. ఇప్పటి వరకు చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 12 ఆసుపత్రి లకు నోటీసులు, 7 ఆసుపత్రి లకు షో కాజ్ నోటీసులు జారీ చేయటం జరిగింది. 2 స్కానింగ్ సెంటర్లు సీజ్ చేయబడ్డాయని భవిష్యత్ కార్యాచరణలో భాగంగా క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం అమలుపరుచటకు జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కి అనుసంధానంగా 2 వైద్యులతో కూడిన ఒక ప్రత్యేక సెల్ ని ఏర్పాటు చేయటం జరిగిందని జిల్లా వైద్యాధికారి కోటాచలం ప్రకటన విడుదల చేశారు .

సూర్యాపేట డివిజన్

1. శ్రీ సూర్య హాస్పిటల్ సూర్యపేట
2. చిన్నారి పిల్లల హాస్పిటల్ సూర్యాపేట.
3. శ్రీ భవాని మల్టీ స్పెషల్టి హాస్పిటల్, సూర్యాపేట.
4. అను హాస్పిటల్ సూర్యాపేట
5. రోహిణి హాస్పిటల్, సూర్యాపేట
6. రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సూర్యాపేట
7. సాయి రామ్ హాస్పిటల్, సూర్యాపేట
8. సాయి గణేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సూర్యాపేట్
9. శ్రీ సాయి మరుతి హాస్పిటల్.
10. శ్రీ రుద్ర హాస్పిటల్
11. యూనిక్ రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్

కోదాడ డివిజన్

12. చందన హాస్పిటల్ హుజూర్నగర్
13. గాంధీ హాస్పిటల్ హుజూర్నగర్.
14. లక్ష్మీ నవీన్ హాస్పిటల్ కోదాడ.
15. శ్రీ సురక్ష హాస్పిటల్, కోదాడ

జిల్లాలోని 15 హాస్పిటలకు నోటీసులు జారీ చేయగా1.ఆపిల్ స్కానింగ్ సెంటర్

2. శరత్ కార్డియాక్ సెంటర్ చేయడం జరిగిందని జిల్లా వైద్యాధికారి ప్రకటనలో తెలియజేశారు

# మద్యం అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించండి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వైయస్సార్ జిల్లా, మే 15(భారత శక్తి): మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా శ్రీధర్ చెరుకూరి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో కేర్ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్)కార్యక్రమం పై జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...ఆల్కహాల్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కేర్ కమిటీ ఏర్పాటయిందన్నారు.ప్రతి మద్యపాన వినియోగదారునికి వాటి వలన కలిగే అనారోగ్య సమస్యలను తెలియజేసే విధంగా మద్యం షాపుల్లో పంప్లేట్లు అందజేయాలని అధికారులకు సూచించారు. బాధ్యతాయుతమైన మద్యపాన వినియోగంపై అవగాహన సదస్సులు, చర్చా గోష్టులు,మాబ్లు, ప్రదర్శనలు, మద్యపానం లేని జీవిత ప్రయోజనాలను తెలిపే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆల్కహాల్ సంబంధిత చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని డిపార్ట్మెంట్ల సమన్వయంతో మద్యపాన వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. మైనర్లకు మద్యం విక్రయిస్తే మద్యం షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులలో ఆల్కహాల్ సంబంధిత ఆరోగ్య సమస్యలపై జిల్లా ఆరోగ్యశాఖ అవగాహన సెమినార్లు నిర్వహించాలన్నారు. డి అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సిలింగ్ తో పాటు వారిలో మార్పు తేవాలన్నారు.పాఠశాల కళాశాలలో ఆల్కహాల్ వ్యతిరేక అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. యువతలో ఆల్కహాల్ దుష్ప్రభాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వెనుకబడిన వర్గాల్లో పద్యపాన వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు యువత లో నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే విదంగా కృషి చేయాలన్నారు.ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ... గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మద్యపాన వినియోగం వల్ల కలిగే ఆనారోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్ర భావాలను వివరించాలని అన్నారు. మద్యపానం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా కమిట్మెంట్ తో అధికారులు పనిచేయాలన్నారు.గ్రామాల్లో బెల్ట్ షాపులపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.ముఖ్యంగా యువతలో మద్యాపాన వినియోగంపై కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరియు కేర్ కమిటీ సభ్యుల సూచించిన సలహాలు తీసుకొని మద్యపాన వినియోగంపై గట్టి చర్యలు చేపడతామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్, డిఇఓ శంషూద్దీన్, జిల్లా విద్యా ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డా.హిమాదేవి, సూపర్డెంట్ ఆఫ్ సైక్రియాటిస్ట్ డా.వెంకట రాముడు,జనరల్ హాస్పిటల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జమున, మనబంధు ఫౌండేషన్ శివారెడ్డి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రామచంద్రారెడ్డి,ఎక్సైజ్ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఫైనాన్స్, చిట్స్ నిర్వహిస్తున్న వ్యాపారుల ఇండ్లలో సోదాలు

## -62 ఖాళీ బ్యాంక్ చెక్స్, 82 ప్రాంసరీ నోట్లు స్వాధీనం ఆరుగురిపై కేసు నమోదు: ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే15:నిబంధనలకు విరుద్ధంగా చిటీలు, ఫైనాన్స్/ గిరిగిరి వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇండ్లలో ఖమ్మం టౌన్ డివిజన్ పోలీసులు సోదాలు నిర్వహించినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని పాకబండ బజార్, టిన్జీవోస్ కాలనీ,వేణుగోపాలనగర్, పంపింగ్ వెల్ రోడ్డు,గాంధీనగర్, ఆల్లీపూరం, కొత్తగూడెం, మంచుకొండ ప్రాంతాలలో నిబంధనలు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆనాధికార చిట్స్, అధిక వడ్డీలతో ప్రజలను పీడిస్తున్న ఫైనాన్స్/ గిరిగిరి వ్యాపారుల ఇండ్లలో ఏకకాలంలో 8 చోట్ల దాడులు నిర్వహించి తనిఖీలు చేసినట్లు తెలిపారు లక్షల విలువ చేసే 62 ఖాళీ బ్యాంక్ చెక్స్, 82 ప్రాంసరీ నోట్లు, 12 చిట్టి బుక్స్ లభ్యమయ్యాయినట్లు తెలిపారు. చిట్ నిర్వహుకులు తమ కస్టమర్ల నుండి సేకరించిన డబ్బును చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న చిట్స్, ఫైనాన్స్ వ్యాపారుల ఇండ్లలో తనిఖీ చేసి ఆరుగురిలో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించి వారిపై ఖమ్మం వన్ టౌన్ ,టూ టౌన్, ఖ?నపూరం హవేలీ,రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలను అసరగా తీసుకొని గిరిగిరి పేరుతో అధిక వడ్డీ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. ఎవరైనా ఆనాధికార చిట్టిలు, అక్రమ ఫైనాన్స్ /గిరిగిరి నిర్వహిస్తే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర రెవెన్యూ మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 15: నేడు నిర్మల్ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కుంటాల మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్లో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ అవినాష్ కుమార్లతో కలిసి పరిశీలించారు. మంత్రి పర్యటన సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులతో సమీక్షించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

# వరి ధాన్యం పంటను త్వరితగతిన తూకం వేసి మిల్లులకు తరలించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే15: వరి ధాన్యం పంటను త్వరితగతిన తూకం వేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం సదాశివ నగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి పాక్స్ ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యం సేకరణ త్వరగా చేపట్టాలని అన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టాలని తెలిపారు.

అకాల వర్షాల వలన ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు టార్పాలిన్ లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆరబెట్టిన ధాన్యం ను త్వరగా తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ సదాశివ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదోడి సొంత ఇంటి కల నెరవేరిన వేళ,ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్





(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే15: గత 20 సంవత్సరాల నుండి ఎల్లారెడ్డి నియోజకవర్గ పేదలు సొంత ఇంటి కల కలగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వ పాలకుల అసమర్థ పాలన వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలోనే నియోజకవర్గానికి 3500 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యాయి.

అందులో భాగంగా గురువారం తాడ్వాయి మండలం ఎర్రపహడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి చేసిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్. పేదల ఇంటి కలను సాకారం చేసే దిశగా ముందడుగు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, ప్రజలకు సొంత ఇల్లు ఉండడం ఒక కల. ప్రజలు అందరు తమకు సొంత ఇల్లు ఉండాలని కోరుకుంటారు. సొంత ఇంటి నిర్మాణం కొరకు భూమి పూజ చేసినందుకు చాల సంతోషంగా ఉంది అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు.

# మే,20, న దేశ వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు సమ్మె చేయాలి : బహుజన వామపక్ష కార్మిక సంఘాల పిలుపు



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే15: మే 20 దేశవ్యాప్తంగా జరిగే జాతీయ సమ్మె కు మద్దతు గా తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమ బంద్ చేయాలని,తెలంగాణ బీడీ యాజమాన్యం సంఘంకు సమ్మె నోటిసు నేపథ్యంలో కేంద్రం లో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మే,20,మంగళవారం రోజు న దేశ వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు సమ్మె చేయాలని,బహుజన వామపక్ష కార్మిక సంఘాల జెఎసి, బాగ సామ్య కార్మిక సంఘాలు ,ఎఐసిటియు, బిఎల్టియు,ఎఐఎఫ్టియు,ఎఫ్టియు, టిఎఫ్టియు,టిబిఎన్ సికెయు,టిఎస్ కెపిఎస్,టియుసిఐ,బిఎఫ్ టియు, తదితర కార్మిక సంఘాలు,జాతీయ సమ్మెలో తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమలో పనిచేయు, బీడీ కార్మికులు,ప్యాకర్లు,బట్టి, చటన్,టేకేదార్లు,సమ్మెలో పాల్గొంటారు, అందువల్ల తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమ మే,20,న బంద్,చేసి మా కార్మిక సంఘాల పోరాటం కు మద్దతు ఇవ్వాలని, గురువారం తెలంగాణ బీడీ యాజమాన్య సంఘం ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రీ, దర్మెంద్ర గాంధీకి, సమ్మె నోటీసు ను,తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బిఎల్ టీయూ, రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్ది రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, బి,జగదీష్, అందజేశారు.

# అయిదుగురు బాలురు మృతిపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి



అమరావతి, మే 15(భారత శక్తి) : ఈత కోసం చెరువులు దిగి అయిదుగురు బాలురు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి వ్యక్తంచేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి సవిత వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లెలో చెరువులో ఈతకు దిగి తరుణ్, చరణ్, పార్థు, హర్ష, దీక్షిత్, తరుణ్ యాదవ్ మృత్యువాతపడడంపై మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు.

సెలవులకు వచ్చిన బాలురు ఇలా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు మంత్రి సానుభూతి వ్యక్తంచేశారు. బాలుర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళు లర్పించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉ ంటామని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవులు కావడంతో, విద్యార్థులు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ పిల్లలను చెరువులు, నీటి గుంతలు, నదులు, ఇతర నీటి ప్రవాహాలకు దూరంగా ఉండేటట్లు చూడాలని మంత్రి సవిత సూచించారు.

# ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు: డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

**-22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం**

**-9 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం పథకం అమలు**

**-22 వేల 500 కోట్ల రూపాయలతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**-11 వేల 600 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం**

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 15:మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాల్లో



పర్యటించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్, వివిధ రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ సి.ఎం.శంకుస్థాపన చేశారు.ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మధిర నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రజల ఆకాంక్ష మేరకు ఎర్రుపాలెం మండల హెడ్ క్వార్టర్ లో 22 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రిని ప్రజా ప్రభుత్వం మంజూరు చేసి నేడు శంకుస్థాపన చేసుకుంటున్నామని అన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి వేగవంతంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.గత సంవత్సర కాలంలో వైద్యశాఖ ద్వారా ప్రజా ప్రభుత్వం 11 వేల 600 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిందని అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన దాదాపు 90 లక్షల కుటుంబాలకు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి రావద్దని ఆరోగ్య శ్రీ పథకం క్రింద కార్పొరేట్ ఆసుపత్రులలో 10 లక్షల వరకు వైద్యం చేయించుకునేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని అన్నారు.పేదలకు 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పేదల పిల్లల చదువు కునేందుకు వీలుగా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నూతనంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు 11 వేల 600 కోట్లతో ప్రారంభించామని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న 90 లక్షలకు పైగా కుటుంబాలకు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ వంటి పెద్ద పెద్ద కోర్సులు చదివేందుకు ఫీజు రీయంబర్స్మెంట్ పథకం అమలు చేస్తున్నామని, రేషన్ ద్వారా ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, అర్హులకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ పరిధిలో ఉన్న ఖాళీలను పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా పరీక్షలు నిర్వహించి భర్తీ చేస్తున్నామని, ప్రైవేట్ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించి ఉద్యోగ అవకాశాలను సృష్టించామని, స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన క్రింద యువతను ప్రోత్సహించేందుకు 9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం జూన్ రెండున రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రారంభిస్తున్నా మని అన్నారు. పేదలు చాలా రోజులుగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రజా ప్రభుత్వం రాగానే ప్రారంభించిందని, 22 వేల 500 కోట్ల రూపాయలతో ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు చొప్పున మంజూరు చేసి ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామని, రాబోయే ఐదు సంవత్సరాలలో ఇండ్లు లేని అందరికీ ఇండ్లు వచ్చేలా చూస్తామని అన్నారు.ఆర్.ఓ.ఎఫ్.ఆర్. పట్టాలు ఉన్న గిరిజన, ఆదివాసి రైతులకు ఇందిర సౌర గిరి జల వికాస పథకం క్రింద 12 వేల 500 కోట్ల రూపాయలతో సోలార్ పంపు, మోటార్ డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి పథకాలు అమలు చేశామని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించామని తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన



తర్వాత జరిగిన లబ్ధి వివరాలను తయారుచేసి వివరాలు వెల్లడిస్తామని అన్నారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని అన్నారు. గత పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కష్టపడి బయట పడేస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేస్తున్నామని అన్నారు.మహిళలకు గతంలో పావలా వడ్డీ రుణాలు ఇచ్చామని, గత పాలకులు వీటిని విస్మరిస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సంవత్సరం 21 వేల కోట్ల రూపాయలను మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించామని అన్నారు. మహిళా సంఘాలకు మొత్తం లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించేలా ప్రణాళిక తయారు చేశామని అన్నారు.మహిళా సంఘాల ద్వారా వెయ్యి మెగా వాట్ల సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఆర్టిసి అద్దె బస్సులు, పెట్రోల్ పంపు, రైస్ మిల్ ఏర్పాటు వంటి వాణిజ్య యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని



అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఖమ్మం జిల్లాకు 3 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటి నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి చేశామని, మరో 6 నుంచి 8 నెలల కాలంలో వాటి నిర్మాణం పూర్తి చేసి అంతర్జాతీయ స్థాయిలో మన విద్యార్థులకు విద్యాబోధన అందిస్తామని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల కంటే అధికంగా వరి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర క్రింద 200 కోట్లకు పైగా, బోనస్ ద్వారా 30 కోట్లకు పైగా రూపాయలను రైతులకు చెల్లింపులు చేశామని అన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ద్వారా రైతులకు అధిక లాభాలు అందించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఎర్రుపాలెం మండలంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించడం ద్వారా ఇక్కడి ప్రజలకు అనారోగ్యం సమయాలలో ప్రైవేటు వైద్యశాలలకు పోవాల్సిన అవసరం ఉండదని అన్నారు. జిల్లా పెద్ద ఆసుపత్రి అభివృద్ధికి 30 కోట్ల రూపాయల నిధులను డిప్యూటీ సీఎం కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా ప్రజల ఆదాయం కాపాడటంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా 34 మంది కళ్యాణలక్ష్మి పథక లబ్ధిదారులకు రూ. 34,03,944 విలువ గల చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం ఎర్రుపాలెం మండలం కండ్రిక గ్రామంలో 2 కోట్ల 62 లక్షలతో కండ్రిక నుండి పెద్ద గోపవరం వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, బనిగండ్లపాడు గ్రామంలో బనిగండ్లపాడు నుండి బంజర రోడ్డు వరకు 5 కోట్ల 74 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, బోనకల్ మండలం కలకోట గ్రామంలో కలకోట నుండి మోటమర్రి వరకు 20 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు, 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు, 12 లక్షల రూపాయలతో నిర్మించనున్న మత్స్య సంఘు భవన నిర్మాణ పనులకు, రావినూతల గ్రామంలో 280 లక్షల రూపాయలతో రావినూతల నుండి ఆళ్లపాడు వరకు రోడ్డు నిర్మాణ పనులకు, 800 లక్షల రూపాయలతో రావినూతల నుండి గోవిందాపురం వరకు బిటి రోడ్ రెనివల్ పనులకు డిప్యూటీ సి.ఎం. శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఏడిఏ విజయ్ చందర్, తహాశీల్దార్లు ఉషా శారద, పున్నంచందర్, ఎంపిడివో లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం మాస్టర్ ప్లాన్ త్వరలో ఆమోదం : రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 15:నగరం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఫైనల్ చేసి ప్రభుత్వంచే ఆమోదింప చేసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.గురువారం మంత్రి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ రామచంద్రయ్య నగర్ లో టి.యు.ఎఫ్.ఐ. డి.సి. నిధులు 72 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ సంబంధించిన భూ సమస్యల అంశాలను అదనపు కలెక్టర్, మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలను కమీషనర్ బాధ్యత తీసుకొని పరిష్కరించాలని అన్నారు.ఖమ్మం నగర అభివృద్ధి మాస్టర్ ప్లాన్ త్వరలోనే ఆమోదించడం జరుగుతుందని, ఫైనల్ చేసే ముందు ప్రజాప్రతినిధులను సంప్రదిస్తామని అన్నారు. ఖమ్మం మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందిన తర్వాత పెండింగ్ భవన నిర్మాణాలు అనుమతులు త్వరగా జారీ చేయాలని అన్నారు.ప్రభుత్వ భూములను రక్షించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని అదనపు కలెక్టర్ కు సూచించారు. నగర అభివృద్ధికి మనమంతా సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. నగరంలో పేద ప్రజలకు మధ్య తరగతి వారికి ఏం కావాలో ఒక్కొక్కటిగా పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని, ప్రశాంతమైన ప్రగతి సాధించిన ఖమ్మంను తయారు చేస్తామని అన్నారు. పేదలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేస్తూ అభివృద్ధి పనులను కూడా ఎక్కడ వెనకాడకుండా పూర్తి చేస్తామని అన్నారు.ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామని, వచ్చే వారం నాటికి డ్రాఫ్ట్



నోటిఫికేషన్ వెలువడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 58 ప్రకారం పట్టాలు సంబంధించి రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటూ వెరిఫికేషన్ చేస్తున్నామని, ఇది పూర్తయిన తర్వాత ప్రత్యేక రెవెన్యూ క్యాంపెయిన్ నిర్వహించి అర్హులకు ఇంటి పట్టాలు, హౌస్ నెంబర్ కేటాయిస్తామని అన్నారు.ప్రభుత్వ భూముల సంరక్షణకు కూడా కోర్టు ఆదేశాల ప్రకారం ఏడి సర్వే అండ్ ల్యాండ్ అధికారులతో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురైనట్లు సమాచారం అందిందని, రేపటి వరకు దానిని స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పూనుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతీమా జోహారా, స్థానిక కార్పొరేటర్ ప్రశాంతి లక్ష్మి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యను పరిష్కరిస్తాం: జెడ్పీ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి

వైయస్సార్ కడప జిల్లా, మే 15(భారత శక్తి) : గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తామని జెడ్పి చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి అన్నారు.గురువారం ఉదయం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పి చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి అధ్యక్షతన వైఎస్ఆర్ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల జడ్పి సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి,ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పీ.రామసుబ్బా రెడ్డి,ఎమ్మెల్యేలు డా. సుధ, వరదరాజు రెడ్డి,అన్నమయ్య జిల్లా డిఆర్వో మధుసూదన్,జెడ్పి సీఈవో ఓబులమ్మ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు,ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.సమావేశం ప్రారంభంలో తొలుత ఉగ్రదాడి లో మరణించిన జవాన్ మురళి నాయక్,ఇటీవల మరణించిన మాజీ జెడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి లకు నివాళులు అర్పించాలని జడ్పీ చైర్మన్ కోరగా సభ్యులందరూ మౌనం పాటించి నివాళులు తెలిపారు.జెడ్పీ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మొదటిసారి అధ్యక్షత వహించడం సంతోషంగా ఉందని తెలిపారు.జిల్లా పరిషత్ నిధులను అన్ని నియోజకవర్గాల సభ్యులందరికీ సమానంగా ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు.వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని సభ్యులు లేవనెత్తిన సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని, ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఎండాకాలంలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు.జిల్లా ప్రజాపరిషత్ అధికార యంత్రాంగం, ప్రజా పరిషత్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళతామన్నారు. ఉమ్మడి జిల్లాల పరిషత్ పరిధిలో అన్ని రకాల అభివృద్ధి కార్యాచరణ జరుగుతోందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి జిల్లాలో దాదాపు 2.10లక్షల మంది అర్హులైన రైతులను పరిశీలిస్తున్నామని తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులు పైపుల కోసం చెల్లించిన నగదుకు సంబంధించి పాడా రద్దయిన నేపథ్యంలో ఏపీఎంఐపి ద్వారా రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు.అలాగే జిల్లాలో ప్రకటించిన పది కరువు మండలాలలో రైతులను ఆదుకోవడానికి దెబ్బతిన్న పంటల కింద రూ 16 కోట్ల అంచనా తో ప్రభుత్వానికి నివేదికను అందజేసినట్లు తెలిపారు. జిల్లాను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దడానికి లక్ష ఎకరాలను హార్టికల్చర్ కింద సాగు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని




తెలిపారు. ఇందులో దాదాపు 60 వేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద బహు వార్షిక పద్ధతిలో పండ్ల తోటల పెంపకం,40 వేల ఎకరాల్లో వార్షిక పద్ధతిలో ఉద్యాన సహాయ అభివృద్ధి పథకం కింద పూలు, కూరగాయల సాగుకు సుముఖంగా ఉన్న రైతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద ఏపీఎంఐపీ ద్వారా రైతులకు ఎన్ని ఎకరాల కైనా 70 నుంచి 90 శాతం సబ్సిడీతో సాగు చేయడానికి అవకాశం ఉందని వీటిపై ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో రైతులు పేర్లను నమోదు చేసుకుంటే వాటికి సంబంధించి ప్లాంట్ మెటీరియల్ అన్నిటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో మార్కెటింగ్ సంబంధించి ఇతర రాష్ట్రాల మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ రైతులు పంటను అమ్మేటప్పుడు మోసపోకుండా అవగాహన పెంచుతామన్నారు. అలాగే రైతులకు పట్టీలు కూడా అందజేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్ కాలంలో వ్యవసాయానికి సంబంధించి నాలుగు ప్రాధాన్యత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతులకు లాభదాయకంగా ఉండే విధంగా సీడ్ ఉత్పత్తి విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.సజ్జలు, కొర్రలు వంటి మిల్లెట్ పంటలను ఉత్పాదకతను పెంచే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. అన్నదాతలకు యాంత్రీకరణ పరికరాలు అందజేస్తామని తెలిపారు.ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయానికి వైపు రైతులు మొగ్గు చూపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో తాగునీటి కి ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. గ్రామాల్లో బోర్ వేల్ వేసిన వెంటనే పవర్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలలో మోడల్ స్కూల్ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తామని పై విధంగా సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు విపులంగా వివరించారు.అలాగే జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలపై అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లా అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం అజెండా అంశాల వారీగా వ్యవసాయ శాఖా,హారికల్చర్, ఆర్డబ్ల్యూఎస్,పంచాయతీ రాజ్, విద్యాశాఖ, ఆర్ అండ్ బి, డ్వామా తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదికను సమర్పించారు.పలువురు ప్రజా ప్రతినిధులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసీ సభ్యులు లేవనెత్తిన అనేక అంశాల పైన సుదీర్ఘంగా సర్వసభ్య సమావేశంలో చర్చించారు.ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... పావలా వడ్డీ కింద రైతులు తీసుకున్న క్రాప్ లోన్లను ఇంతవరకు ఏపీజీబీ బ్యాంక్ అధికారులు జమ చేయలేదని వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెటింగ్ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని అన్నారు. మార్కెటింగ్ అధికారులు ఇతర జిల్లాలో మార్కెట్ రేట్లను గమనిస్తూ రైతులు నష్టపోకుండా మంచి ధరలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.ఎమ్మెల్సీ పి.రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు పూర్తిగా నష్టపోయారని గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే నకిలీ విత్తనాలపై గట్టి చర్యలు చేపట్టి నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు విత్తనాలు సకాలంలో అందేలాగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు సోలార్ సంస్థ వారు రైతుల అనుమతి లేకుండా వారి భూముల్లో దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని రైతులపై కేసులు పెడుతున్నారని వాస్తవాలను వెలికి తీసి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక, పశువుల మేత వంటి అవసరాల కోసం గ్రామాల్లో ఉన్న భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని కోరారు.ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులు రావాలని క్వాలిఫైడ్ టీచర్లు ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉన్నారని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి మంచి ఫలితాలు రాబట్టాలని కోరారు. జడ్పీ నిధుల్లో కొంత నియోజకవర్గాలకు కేటాయించాలని కోరారు.బద్వేల్ ఎమ్మెల్యే సుధా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ కాలనీలలో నీటి కొరతను తీర్చాలని కలెక్టర్ ను కోరారు.వేముల జెడ్పీటీసీ మాట్లాడుతూ చక్రాయ పేటలో సరైన సాగునీటి వసతులు లేవని మా మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చాలని కోరారు.గాలీ వాన బీభత్సం వలన చీనీ, మామిడి తోటల రైతులకు పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలి కోరారు.భూములపై లోన్ తీసుకోవడానికి రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వన్ బి ఒరిజినల్ డాక్యుమెంట్ ఇస్తే రైతులకు మరింత లోన్ ఎక్కువ లోన్ పొందే సౌకర్యం కలుగుతుందని అన్నారు. కొంతమంది రైతులు పాడా ద్వారా వ్యవసాయం పైపుల కోసం నగదు చెల్లించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి పరిష్కారం చూపాలని కోరారు.గండి క్షేత్రం లో నీటి కొరత ఎక్కువగా ఉందని ట్యాంకు నిర్మించాలని కోరగా జడ్పీ చైర్మన్ వెంటనే రూ 25 లక్షలు ఇస్తామని తెలుపగా కలెక్టర్ మిగతా నగదును తాము చెల్లిస్తామని తెలిపారు.వేంపల్లి జెడ్పీటీసీ మాట్లాడుతూ...మా మండలంలో డికెటి భూములు ఉన్న రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని కోరారు. అలాగే అరటి రైతులు బాగా నష్టపోయారని గిట్టు వారు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని ఎక్స్పోర్ట్ చేసేందుకు వీలు కల్పించాలని కోరారు. ప్యాక్ హౌస్ల నిర్మాణ రేటు పెంచాలని కోరారు. వేంపల్లిలో రైతు బజారు నిరుపయోగంగా ఉందని వినియోగం లోకి తీసుకురావాలని కోరారు.వి.ఎన్ పల్లి జెడ్పీటీసీ మాట్లాడుతూ... దోసకాయ, కర్బుజా,మిరప రైతులకు గిట్టుబాటు ధరలు లేవని ,కూలి డబ్బులు కూడా రావడం లేదని వారికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. గాలి వానకు అరటి పంటలు వేల ఎకరాలలో నష్టం వాటిల్లిందని అరటి రైతులను ఆదుకోవాలని కోరారు.సికె దిన్నె జడ్పీటీసీ మాట్లాడుతూ జిల్లాలో గాలి వాన కారణంగా నష్టపోయిన పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన అరటి రైతులకు హెక్టారుకు ఎంత పరిహారం ప్రభుత్వం అందజేస్తుందో తెలుపాలని కోరగా సమగ్ర ఉద్యాన మిషన్ స్కీం కింద తిరిగి పంట వేసుకోవడానికి హెక్టారుకు రూ 70 వేలు ప్రోత్సాహకంగా నమోదు చేసుకున్న అరటి రైతులకు ప్రభుత్వం అందించనుందని హార్టికల్చర్ అధికారిని తెలిపారు.ఖాజీపేట మండల కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో సరఫరా అవుతున్న నకిలీ విత్తనాలపై చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే జిల్లా కడప కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు కనీస వసతులు లేవని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పసుపు రైతుల కోసం మార్కెట్ యార్డ్లో అదనపు గోడౌన్ నిర్మించాలని కోరారు. బి మఠం లో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షాప్ లు ఏర్పాటు చేసుకొని నడుపుతున్నారని వాటిపై చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. చెరువుల్లో అనధికారికంగా ఎక్కువ లోతు గుంతలు తీయడం వల్ల ఇటీవల దాదాపు 5 మంది పిల్లలు చనిపోయారని వారికి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే కొన్ని చోట్ల జెడ్పీ భూములను ఆక్రమించుకున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఇంకా పలువురు జెడ్పిటీసిలు స్థానికంగా ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.సమావేశంలో అజెండాలోని అంశాలను, సభ్యులు లేవనెత్తిన అంశాలను నమోదుచేసిన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని జడ్పీ చైర్మన్ తెలిపారు.ఈ సమావేశానికి వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

# ‘సూర్యఘర్’తో ఏడాదికి 32 వేలు ఆదా.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి?



ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకునేందుకు ‘ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన’పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా కోటి మంది ప్రజలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలోవాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ ఇస్తోంది. అయితే, తెలుగు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు ఆశించిన మేరకు రాలేదని కేంద్రం ఇటీవల ఓ నివేదికలో వెల్లడైంది. ఈ పథకం గురించి సరైన అవగాహన లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఇంతకీ ఈ పథకం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి?పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం రాయితీ కింద ఒక్కో కిలోవాట్‌కు రూ.30వేలు సబ్సిడీని కేంద్రం అందిస్తుంది. రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు అయితే రూ.78 వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. అంటే మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయడానికి రూ.1.45 లక్షలు ఖర్చయితే అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78 వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు అవసరం లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణాలు పొందొచ్చు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి. ఎవరికి ఎంత కెపాసిటీనెలకు 0-150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని సూర్యఘర్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. 150-300 యూనిట్లు చొప్పున వినియోగించే వారు 2-3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు పైబడి విద్యుత్‌ను వినియోగించే వారు 3 కిలోవాట్, ఆ పైబడి సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. 3 కిలోవాట్లకు మించి సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా గరిష్ఠంగా రూ.78 వేలు మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తారు. మిగులు విద్యుత్‌ను కావాలంటే నెట్‌మీటరింగ్ ద్వారా విక్రయించుకోవచ్చు.ఆదా ఎంత..?సూర్యఘర్ వెబ్‌సైట్ ప్రకారం 1 కిలోవాట్‌కు సుమారు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రస్తుత వినియోగం ప్రకారం నెలకు రూ.1000 విద్యుత్ బిల్లు వస్తుంది. అదే సోలార్ ఏర్పాటు వల్ల అయ్యే ఖర్చు రూ.338 మాత్రమే అవుతుంది. దీంతో ఏటా రూ.8వేలు ఆదా అవుతుంది. అదే నెలకు 240 యూనిట్లు వినియోగించే వారికైతే నెలకు రూ.2 వేల వరకు బిల్లు వస్తుందనుకుంటే.. సోలార్ వ్యవస్థ ఏర్పాటు వల్ల రూ.333 మాత్రమే ఖర్చవుతుంది. 360 యూనిట్లు వినియోగించే వారికి ఏటా రూ.32వేల వరకు ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ తాజాగా ‘ఎక్స్’లో పోస్ట్ చేసింది. మీ వినియోగానికి ఎన్ని కిలోవాట్ల వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందో ఈ కాలిక్యులేటర్‌ను ఉపయోగించండి.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..1: ముందుగా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో పేరును రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం మీ రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి. మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నంబరు, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీని ఎంటర్ చేయాలి.2: కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అక్కడ ‘రూఫ్‌టాప్ సోలార్’ కోసం అప్లయ్ చేసుకోవాలి. 3: దరఖాస్తు పూర్తి చేసి డిస్కమ్ నుంచి అనుమతులు వచ్చేవరకు వేచి చూడాలి. అనుమతి వచ్చిన తర్వాత మీ డిస్కమ్‌లోని నమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.4: ఇన్‌స్టలేషన్ పూర్తయిన తర్వాత, ఆ ప్లాంట్ వివరాలను పోర్టల్‌లో సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.5: నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేశాక, డిస్కమ్ అధికారులు తనిఖీలు చేస్తారు. అనంతరం పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికేట్ ఇస్తారు. 6: ఈ రిపోర్ట్ పొందిన తర్వాత మీ బ్యాంకు ఖాతా వివరాలతో పాటు క్యాన్సిల్డ్ చెక్‌ను పోర్టల్‌లో సబ్మిట్ చేయాలి. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.

# క్షిపణి వేగంతో బీడీఎల్, మిధానీ షేర్లు

, హైదరాబాద్

పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధానికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం విజయవంతంగా దాడులు నిర్వహించి, వాటిని నేలమట్టం చేయడమే కాదు.. ముష్కరులనూ అంతమొందించింది. ఈ దాడుల్లో దేశీయంగా ఉత్పత్తి చేసిన ఆయుధాలు, ఆయుధ సామగ్రిని అధికంగా వినియోగించారు. బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులతో పాటు రష్యా నుంచి తెచ్చుకున్న ఎస్ 400 రక్షణ వ్యవస్థతో పాటు సొంతంగా అభివృద్ధి చేసిన ఆకాశ క్షిపణి రక్షణ వ్యవస్థలూ సమర్థంగా వ్యవహరించడంతో.. పొరుగుదేశం కాళ్లబేరానికి రాక తప్పలేదు.




దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తిని మరింత పెంపొందిస్తామని ప్రధానమంత్రి పేర్కొన్న అనంతరం, స్టాక్‌మార్కెట్లో రక్షణ రంగ కంపెనీల షేర్లకు మదుపర్ల నుంచి భారీ మద్దతు లభించింది.

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ) షేర్ల ధరలకు రెక్కలు వచ్చాయి. మంగళవారం స్టాక్‌మార్కెట్లో బీడీఎల్ షేరు 11%, మిధానీ షేరు 4% పెరిగాయి. బీడీఎల్ షేరు 4 రోజుల్లోనే దాదాపు రూ.300 పెరిగి, రూ.1,750 స్థాయికి వచ్చింది. బీఎస్ఈలో మంగళవారం గరిష్ఠంగా రూ.1768 ధర పలికినా, చివరికి రూ.175 (11.16%) లాభంతో రూ.1745 ముగింపు ధర నమోదు చేసింది.

మిధానీ షేరు కూడా రూ.11.35 (3.44%) లాభంతో రూ.341.30 ముగింపు ధర పలికింది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, కొచ్చిన్ షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ రక్షణ ఉత్పత్తి సంస్థల షేర్లతోపాటు ప్రైవేటు రంగ రక్షణ సంస్థల షేర్లూ లాభపడ్డాయి.

ఎగుమతులు పెరిగే అవకాశం

కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం దిగుమతులను తగ్గించి, దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి భారీగా పెంచాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ముందుకు సాగుతోంది. అందుకే దేశీయ రక్షణ సంస్థలకు కాంట్రాక్టులు, ఆర్డర్లు భారీగా పెరుగుతున్నాయి. హెచ్ఏఎల్, బీడీఎల్, బీఈఎల్ వంటి సంస్థలకు వచ్చే రెండు, మూడేళ్ల కాలానికి సరిపడా ఆర్డర్లు చేతిలో ఉన్నాయి. దేశీయ అవసరాలు తీర్చడంతో పాటు రక్షణ పరికరాలను మన కంపెనీలు ఎగుమతి చేస్తున్నాయి కూడా. యుద్ధ విమానాలను ఇతర దేశాల నుంచి కొనుగోలు చేస్తున్నా.. క్షిపణులు, మిగతా ఆయుధాలు, ఆయుధ సామగ్రి, రక్షణ వ్యవస్థలను సొంతంగా అభివృద్ధి, ఉత్పత్తి చేయడంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేయడంపై దృష్టి సారించడం వల్లే ఈ మార్పు వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.23,633 కోట్ల రక్షణ ఎగుమతులను మనదేశం నమోదు చేసింది. ఇందులో ప్రైవేటు సంస్థల వాటా రూ.15,233 కోట్లు. 2029 నాటికి 50 దేశాలకు రక్షణ ఎగుమతులు చేయాలని, రూ.50,000 కోట్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. అందువల్ల కొన్నేళ్ల పాటు రక్షణ రంగ కంపెనీల ఆదాయాలకు కొదవ ఉండకపోవచ్చు. అందుకే స్టాక్‌మార్కెట్లో రక్షణ రంగ కంపెనీల షేర్ల ధరలు ఆకర్షణీయంగా పెరుగుతున్నాయి.

సొంతంగా ఉత్పత్తి చేసిన ఆయుధాలే

భారత్ డైనమిక్స్ ఉత్పత్తి చేస్తున్న ఆకాశ్ క్షిపణులను పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల శిబిరాలపైకి భారత సైన్యం, వాయుసేన పెద్దఎత్తున ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ క్షిపణులు భారీ విధ్వంసం సృష్టించినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

భారత్ ఎలక్ట్రానిక్స్ అభివృద్ధి చేసిన ఆకాశ క్షిపణి రక్షణ వ్యవస్థ వల్ల, పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణులను ముందుగానే గుర్తించి.. ఆకాశంలోనే వాటి పనిపట్టేందుకు వీలుకలిగింది. తద్వారా మనవైపు ఎటువంటి ఆస్తి - ప్రాణనష్టం సంభవించకుండా చూశారు.

యుద్ధ విమానాలను అందించడంలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. సుఖోయ్ (ఎస్‌యూ30), తేజస్ యుద్ధ విమానాలను ఈ సంస్థ అసెంబుల్ చేస్తోంది. కొన్ని ఇతర యుద్ధ విమానాల నిర్వహణ బాధ్యతా ఈ సంస్థదే.

# అదానీ వారసులొచ్చేస్తున్నారు.. 70 ఏళ్లకు గౌతమ్ అదానీ రిటైర్

అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీతన వారసత్వ ప్రణాళికను ప్రకటించారు. 70 ఏళ్ల వయసులో బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన వయసు 62 సంవత్సరాలు. 2030లో తన కుమారులకు వ్యాపారాలను అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ విషయాలను ఆయన తాజాగా బ్లూమ్‌బెర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. బాధ్యతల బదిలీ ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా, సజావుగా జరగాలని రెండో తరానికి సూచించినట్లు అదానీ పేర్కొన్నారు.ప్రస్తుతం అదానీ గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు 213 బిలియన్ డాలర్లు. మొత్తం 10 నమోదిత సంస్థలు ఉన్నాయి. మౌలికం, పోర్టులు, షిప్పింగ్, సిమెంట్, స్వచ్ఛ ఇంధనం, విమానాశ్రయాలు, మీడియా సహా పలు రంగాల్లోకి అదానీ గ్రూప్ విస్తరించింది.తన తర్వాత వ్యాపారాలను ఉమ్మడిగా నిర్వహిస్తారా లేక ఎవరికివారు వేరుగా ఉంటారా అని కుమారులు కరణ్, జీత్‌లతో పాటు సోదరుల వారసులు ప్రణవ్, సాగర్‌లను ప్రశ్నించినట్లు ఈ ఇంటర్వ్యూలో గౌతమ్ అదానీ వెల్లడించారు. నిర్ణయించుకోవడానికి వారికి మూడు నెలల సమయం ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తిరిగొచ్చిన వాళ్లు.. కలిసికట్టుగానే ముందుకెళ్తామని సమాధానమిచ్చినట్లు తెలిపారు. వ్యాపారాలన్నింటినీ వీరు ఒక కుటుంబ ట్రస్ట్ కింద నిర్వహిస్తున్నారు. ఈ ట్రస్ట్‌లో వీరు నలుగురూ సమాన



వాటాదారులని గౌతమ్ అదానీ వెల్లడించారు.వీరే అదానీ వారసులు..గౌతమ్ అదానీకి ఇద్దరు సోదరులున్నారు. వినోద్ అదానీ అందరిలోకెల్లా పెద్దవారు. ఆయనకు అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో వాటాలున్నాయి. ఈయన వారసుడు ప్రణవ్. అదానీ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్‌గా, అగ్రో ఆయిల్, గ్యాస్ వ్యాపారాలకు ఎండీగా ఉన్నారు. మరోవైపు రాజేశ్ అదానీ అందరికంటే చిన్నవాడు. ఆయన ప్రస్తుతం అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎండీగా ఉన్నారు. ఈయన కుమారుడు సాగర్ అదానీ.. గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక గౌతమ్ అదానీ కుమారులైన కరణ్.. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌కు ఎండీగా, జీత్.. అదానీ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపారానికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

# బంగ్లా ప్రభావం మన వాణిజ్యంపై ఎంత?



బంగ్లాదేశ్‌లో తలెత్తిన రాజకీయ సంక్షోభ ప్రభావం మనదేశ వాణిజ్యంపై ఎంత ఉంటుందనే అంశాన్ని వాణిజ్య వర్గాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. మన వస్తువుల ఎగుమతుల వ్యాపారం గత ఆర్థిక సంవత్సరంలో 437 బిలియన్ డాలర్ల (సుమారు రూ.36.27 లక్షల కోట్ల) మేర ఉండగా, ఇందులో బంగ్లాదేశ్‌కు జరుగుతోంది రూ.91,300 కోట్లే. పొరుగుదేశం కావడం, మన జౌళి కంపెనీలకు అక్కడ తయారీ యూనిట్లు ఉండటమే కాస్త ఇబ్బంది పెట్టే అంశం అవుతుంది. అక్కడ అనిశ్చితి కొనసాగితే మాత్రం రెడిమేడ్ దుస్తుల యూనిట్లు మనదేశానికి తరలి వచ్చే అవకాశమూ ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి.బంగ్లా సంక్షోభం వల్ల భారత వాణిజ్యంపై అంతగా ప్రభావం ఉండకపోవచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు ఎగుమతులు స్వల్పంగా ఉండటం ఇందుకు కారణంగా తెలిపింది. ‘బంగ్లాదేశ్‌లో గిరాకీ తక్కువగా ఉండొచ్చు. అందువల్ల భారత్ సహా ఇతర దేశాల నుంచి బంగ్లాదేశ్‌కు ఎగుమతులు తగ్గొచ్చ’ని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ డైరెక్టర్ (ఆసియా పసిఫిక్) ఆండ్రూ వుడ్ తెలిపారు. బంగ్లాదేశ్‌తో భారత్ వాణిజ్యమిలా. ప్రధాన ఎగుమతులు: కూరగాయలు, కాఫీ, తేయాకు, సుగంధ ద్రవ్యాలు, చక్కెర, మిఠాయిలు, శుద్ధిచేసిన పెట్రోలియమ్ ఉత్పత్తులు, రసాయనాలు, పత్తి, ఇనుము, ఉక్కు, వాహనాలు.ప్రధాన దిగుమతులు: చేపలు, ప్లాస్టిక్, తోలు, వస్త్రాలు దక్షిణాసియాలో భారత్‌కు బంగ్లాదేశ్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి.ఆసియాలో బంగ్లాదేశ్‌కు భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. జౌళి, వస్త్ర పరిశ్రమకు ఆందోళనకరమే: సీఐటీఐబంగ్లాదేశ్ ఎదుర్కొంటున్న అత్యంత దారుణ రాజకీయ సంక్షోభ స్థితి.. జౌళి, వస్త్ర పరిశ్రమకు ఆందోళనకర పరిణామమేనని భారత జౌళి పరిశ్రమ సమాఖ్య (సీఐటీఐ) అభిప్రాయపడింది. ఆ దేశంలో రెడిమేడ్ దుస్తుల తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపింది. బంగ్లాదేశ్‌లో సరఫరాపరంగా ఏవైనా అవరోధాలు ఏర్పడితే, భారత సంస్థల ఉత్పత్తి, డెలివరీల్లో జాప్యం ఏర్పడొచ్చని సీఐటీఐ ప్రధాన కార్యదర్శి చంద్రిమ ఛటర్జీ తెలిపారు. బంగ్లాదేశ్‌లో అనిశ్చితుల కారణంగా అక్కడి నుంచి తయారీ కేంద్రాలను ప్రత్యామ్నాయ విపణులకు మార్చడంపై కంపెనీలు దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. భారత జౌళి పరిశ్రమకు ప్రధాన కేంద్రమైన తిరుపూర్ దీనివల్ల లబ్ధి పొందే అవకాశం ఉందని వివరించింది. స్వల్పకాలం పాటు వస్త్రాల ఆర్డర్లు భారత్‌కు మళ్లే అవకాశం ఉందని మన వాణిజ్య సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో సుమారు 25 శాతం వరకు జౌళి ప్లాంట్లు భారత కంపెనీలకు చెందినవే. ఇందులో షాహీ ఎక్స్‌పోర్ట్స్, హౌస్ ఆఫ్ పెరల్ ఫ్యాషన్స్, టీసీఎన్ఎస్, గోకల్‌దాస్ ఇమేజెస్, అంబత్తూర్ క్లోతింగ్ లాంటి కంపెనీలు ఉన్నాయి.

# క్రెడిట్ కార్డు మోసాలు ఎలా జరుగుతాయి.. నివారణ ఎలా?

క్రెడిట్ కార్డులను వినియోగించేవారి సంఖ్యతో పాటు వాటి మోసాలూ అదే స్థాయిలో పెరుగుతూనే ఉన్నాయి. ఇది వినియోగదారులనే కాకుండా కార్డు జారీ చేసే బ్యాంకులను కూడా ప్రభావితం చేస్తుంది. క్రెడిట్ కార్డు మోసాలు అసాధారణం కాదు. 2019 ఆగస్టులో నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి 2023 వరకు 13 లక్షల స్కామ్ ఫిర్యాదులు నమోదయ్యాయి. అందువల్ల వినియోగదారులు ఎలాంటి క్రెడిట్ కార్డు మోసాలకు గురవుతారో, వాటి నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవచ్చో తప్పక తెలుసుకోవాలి.ఫిషింగ్ స్కాంఎవరైనా మీ క్రెడిట్ కార్డు సమాచారాన్ని చోరీకి ప్రయత్నించడాన్ని ఫిషింగ్ అంటారు. నేరగాళ్లు విశ్వసనీయ సంస్థలా నమ్మించి ఇ-మెయిల్స్, టెక్స్ట్ మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ ద్వారా కార్డుదారులను సంప్రదిస్తారు. ఇ-మెయిల్ లింక్స్‌పై క్లిక్ చేసినప్పుడు అది మీ వ్యక్తిగత సమాచారాన్ని అడిగే వెబ్‌సైట్‌కు తీసుకెళుతుంది. సాధ్యమైనంత ఎక్కువగా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేలా వినియోగదారులను ప్రేరేపిస్తారు. అందుచేత తెలియని ఇ-మెయిల్/మెసేజ్/ఫోన్ కాల్ ద్వారా మీ క్రెడిట్ కార్డు వివరాలను షేర్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. అధికారిక ప్రభుత్వ సంస్థలు/బ్యాంకులు ఎప్పుడూ పై మార్గాల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని అడగవని గుర్తుంచుకోవాలి. మీరు ఎప్పుడైనా అలాంటి ఇ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్‌ను స్వీకరించినట్లయితే మీ క్రెడిట్ కార్డు జారీచేసిన సంస్థనే స్వయంగా సంప్రదించండి.కార్డు స్కిమ్మింగ్, నకిలీ ఆఫర్లునేరగాళ్లు.. మీ క్రెడిట్ కార్డు సమాచారాన్ని చోరీ చేయడానికి ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఉపయోగించడాన్ని స్కిమ్మింగ్ అంటారు. కార్డు డేటాను చోరీ చేయడానికి ఈ పరికరాలను సాధారణంగా ఏటీఎంలు, పెట్రోల్ బంకులు, ఎంచుకున్న వ్యాపార సంస్థల వద్ద ఇన్‌స్టాల్ చేస్తారు. నేరగాళ్లు ఇలా చోరీ చేసిన సమాచారాన్ని ఉపయోగించి నకిలీ క్రెడిట్ కార్డులను సృష్టించి, వాటితో అధిక మొత్తంలో కొనుగోళ్లు చేస్తారు. అందుచేత కార్డులను ఉపయోగించేటప్పుడు అనుమానాస్పదంగా కనిపించే మెషీన్ ద్వారా స్వైప్ చేయకపోవడమే మంచిది. మాగ్నెటిక్ స్ట్రిప్ ఉన్న కార్డులకంటే చిప్ ఆధారిత క్రెడిట్ కార్డులు సురక్షితమైనవి. ఇంకా, తక్కువ వడ్డీకి రుణాలు లేదా నకిలీ లాటరీ పథకాలను అందించడం ద్వారా నేరగాళ్లు క్రెడిట్ కార్డు వినియోగదారులను సంప్రదిస్తారు. ఇలాంటి ఆఫర్లు సాధారణంగా డబ్బు కోసం ఆశపడే వారిని లక్ష్యంగా చేసుకుంటాయి.కీస్ట్రోక్ క్యాప్చరింగ్

హ్యాకర్లు మీ క్రెడిట్ కార్డు వివరాలను కనుగొనడానికి నిర్దిష్ట సాఫ్ట్‌వేర్ ద్వారా కీస్ట్రోక్ లాగింగ్‌ను ఎక్కువగా ఉపయోగిస్తారు. మీ సిస్టంలోకి హ్యాకర్లు ఏదైనా లింక్ ద్వారా మాల్‌వేర్ (వైరస్)ను పంపినప్పుడు మీరు నొక్కిన ప్రతి కీని అది రికార్డు చేస్తుంది. అటువంటప్పుడు మీ ఐడీలు, పాస్‌వర్డ్‌లు కూడా హాకర్లు రికార్డు చేయొచ్చు. ఇటువంటి పరిస్థితిని నివారించడానికి, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకపోవడమే మంచిది. పాస్‌వర్డ్‌లు, ఐడీ వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని అందించేటప్పుడు వర్చువల్ కీబోర్డ్‌ను ఉపయోగించడం మేలు. ముఖ్యంగా మీ సిస్టంను రక్షించడానికి ప్రామాణికమైన యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను కలిగి ఉండాలి.హ్యాకింగ్‌టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో హ్యాకర్లు కూడా తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. వారు మీ



సాంకేతిక పరికరాల్లో దేనినైనా హ్యాక్ చేసి, వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేయొచ్చు. ముఖ్యంగా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏదైనా వెబ్‌సైట్ అనుమానాస్పదంగా అనిపిస్తే, మీ వ్యక్తిగత వివరాలను అందించవద్దు. మీకు వచ్చిన ప్రతి లింక్‌పై క్లిక్ చేయొద్దు. క్లిక్ చేస్తే హ్యాకర్లు మీ సిస్టంలోకి ప్రవేశించి స్కాంలను నిర్వహించడానికి అవసరమైన డేటాను పొందొచ్చు.సిమ్ స్వాప్‌సైబర్ నేరగాళ్లు క్రెడిట్ కార్డుదారుడిగా నమ్మించి, మొబైల్ ఆపరేటర్‌కు కాల్ చేసి డూప్లికేట్ సిమ్ కార్డును కోరతారు. వారు అసలు క్రెడిట్ కార్డుదారుడి ఫోన్ నంబర్‌ను డీయాక్టివేట్ చేయమని అపరేటర్‌ను అడుగుతారు. ఇక్కడ స్కామర్ కొత్త ఐడీలను సృష్టించి ఓటీపీలను స్వీకరించి ఆ క్రెడిట్ కార్డుతో ఆన్‌లైన్ లావాదేవీలు చేస్తారు. అందుచేత మీరు ఎప్పుడైనా డూప్లికేట్ సిమ్ అభ్యర్థనకు సంబంధించి హెచ్చరికను స్వీకరిస్తే లేదా మీ ఫోన్ నెంబర్ బ్లాక్ అయితే, తక్షణమే మీ మొబైల్ సర్వీస్ అపరేటర్‌కు తెలియజేసి ఆ మోసాన్ని నిరోధించండి.అప్లికేషన్ మోసంమీ విలువైన పత్రాలు (పాన్, ఆధార్, వేతన స్లిప్‌లు) స్కామర్‌కు లభించినప్పుడు ఈ పత్రాలతో క్రెడిట్ కార్డును పొందొచ్చు. ఇక్కడ నేరగాళ్లు ఈ కార్డులతో అన్ని రకాల ఆర్థిక కార్యకలాపాలు జరపడానికి అవకాశమేర్పడుతుంది. ఇలాంటి వాటిని నివారించడానికి మీ ఐడీలు, ఇతర విలువైన పత్రాలు ఎక్కడపడితే అక్కడ వదిలేయకుండా జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ఒకవేళ అదనపు కాపీలు మీ వద్ద ఉన్నప్పుడు పారివేయాలనుకుంటే ముక్కలు, ముక్కలుగా చింపేయాలి. కాల్చివేయడం కూడా మంచిదే.డంప్‌స్టర్ డైవింగ్‌క్రెడిట్ కార్డు వినియోగదారులు తమ కార్డు వివరాలు ఉన్న బిల్లులు లేదా పత్రాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తుంటారు. ఎవరైనా వారి బ్యాంకు వివరాలను తిరిగి పొందడానికి, వాటిని స్కామింగ్ కోసం ఉపయోగించుకోవడానికి సేకరించొచ్చు. హ్యాకర్లు దుర్వినియోగం చేయడం కోసం ఇలాంటి సమాచారం ఉన్న పత్రాలను ఉపయోగించవచ్చు. ఈ ప్రక్రియను డంప్‌స్టర్ డైవింగ్ అంటారు. కాబట్టి మీరు పడేయాల్సిన పత్రాలు ఏవైనా ఉంటే, వాటిని ముక్కలు ముక్కలుగా చేయండి. ఇలాంటి కొన్ని ముందు జాగ్రత్త చర్యలను అనుసరించడం ద్వారా క్రెడిట్ కార్డు స్కామ్‌లలో చిక్కుకోకుండా నిరోధించవచ్చు.గుర్తుంచుకోవాల్సినవిప్రస్తుతం క్రెడిట్ కార్డులను వినియోగించేవారి సంఖ్యతో పాటు స్కాంలు కూడా పెరిగాయి. అందువల్ల ఇలాంటి నేరాలను అదుపులో ఉంచడానికి మిమ్మల్ని మీరు అప్‌డేట్‌గా ఉండడం అవసరం. మోసాలకు గురికాకుండా ఉండేందుకు అందుబాటులో ఉన్న వివిధ భద్రతాపరమైన అంశాలను వినియోగదారులు తప్పక గుర్తించాలి.మీ కార్డును ఇతరులు ఉపయోగించకుండా సురక్షితమైన స్థలంలో ఉంచడం మంచిది.




# ఫ్రాంచైజీలకు విదేశీ కష్టం

ముంబయి

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా అర్ధంతరంగా ఆగిన ఐపీఎల్.. పది రోజుల వ్యవధిలోనే మళ్లీ మొదలు కాబోతుండడం అభిమానులకు సంతోషాన్నిచ్చే విషయమే. మిగతా టోర్నీ కొన్ని నెలల తర్వాతే జరుగుతుందని వార్తలు రావడంతో నిరాశ చెందిన అభిమానులకు.. ఈ శనివారమే లీగ్ పునఃప్రారంభమవుతుందని ప్రకటించి ఉత్సాహాన్నిచ్చింది బీసీసీఐ. అయితే లీగ్‌లో మిగతా మ్యాచ్‌లకు పలువురు విదేశీ ఆటగాళ్లు దూరమయ్యేలా కనిపిస్తుండడంతో అది జట్ల ప్రదర్శనపై, ప్లేఆఫ్స్ అవకాశాలపై గట్టిగానే ప్రభావం చూపేలా ఉంది.

వారం కిందట అర్ధంతరంగా ఆగిన ఇండియన్ ప్రిమియర్ లీగ్ 18వ సీజన్.. ఇంకో రెండు రోజుల్లోనే పునఃప్రారంభం కాబోతోంది. ప్లేఆఫ్స్ రేసు ఉత్కంఠభరితంగా మారిన నేపథ్యంలో మిగతా లీగ్ మ్యాచ్‌ల కోసం అభిమానులు అమితాసక్తితో ఎదురు చూస్తున్నారు. కానీ ఈ దశలో కొందరు కీలక ఆటగాళ్ల సేవలను కోల్పోతుండడం ఇటు జట్లకు, అటు అభిమానులకు నిరాశ కలిగిస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25నే ఐపీఎల్ ముగియాలి. జూన్‌లో పలు దేశాల క్రికెటర్లకు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఉండడంతో నెలాఖరుకల్లా స్వదేశాలకు వెళ్లేలా ప్రణాళికలు వేసుకున్నారు. కానీ లీగ్ హఠాత్తుగా ఆగిపోయి, మధ్యలో 9 రోజుల విరామం రావడంతో.. లీగ్‌ను ఆలస్యంగా ముగించక తప్పడం లేదు. శనివారం తిరిగి ఆరంభం కానున్న ఐపీఎల్-18 జూన్ 3 వరకు కొనసాగనుంది. ఈ సీజన్ అర్ధంతరంగా నిలిచిపోగానే.. మెజారిటీ విదేశీ ఆటగాళ్లు స్వదేశాలకు వెళ్లిపోయారు. చాలా కొద్ది మంది మాత్రమే భారత్‌లో ఉండిపోయారు. వెళ్లిన వాళ్లలో తిరిగి వచ్చే వారి సంఖ్య తక్కువగానే ఉంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు వచ్చే నెల 11 నుంచి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్స్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆడాల్సి ఉండగా.. ఇంగ్లాండ్, వెస్టిండీస్ జట్లకు అంతర్జాతీయ సిరీస్‌లు ఉన్నాయి. దీంతో ఈ దేశాల ఆటగాళ్లలో చాలామంది మిగతా ఐపీఎల్‌కు అందుబాటులో లేకుండా పోయారు. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం జట్టులోకి ఎంపికైనా ఆటగాళ్లెవ్వరూ ఐపీఎల్ కోసం వెళ్లడానికి వీల్లేదని దక్షిణాఫ్రికా బోర్డు స్పష్టం చేసింది. మిగతా బోర్డులు కూడా తమ ఆటగాళ్లకు అనధికారిక అల్టిమేటం విధించాయి. ప్లేఆఫ్స్ రేసులో దూసుకెళ్తున్న గుజరాత్ టైటాన్స్.. కాగిసో రబాడ (దక్షిణాఫ్రికా), షెఫానీ రూథర్‌ఫర్డ్ (వెస్టిండీస్) లాంటి కీలక ఆటగాళ్ల సేవలు కోల్పోనుంది. జోస్ బట్లర్ (ఇంగ్లాండ్), కూడా అనుమానంగా మారాడు. ఈ సీజన్లో గుజరాత్ సాధించిన విజయాల్లో బట్లర్, రూథర్‌ఫర్డ్‌ల పాత్ర ఎంతో కీలకం. ముంబయికి ఓపెనింగ్‌లో అద్భుత ఆరంభాలందించిన రికిల్‌టన్ (దక్షిణాఫ్రికా) సైతం మిగతా ఐపీఎల్‌కు దూరం కానున్నాడు. మరో సఫారీ ఆటగాడు కార్బిన్ బోష్, ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ (ఇంగ్లాండ్) లీగ్ దశకు మాత్రమే అందుబాటులో ఉంటారని సమాచారం. ఈ సీజన్లో ఇప్పటిదాకా అదరగొట్టిన బెంగళూరు.. కీలక దశలో హేజిల్‌వుడ్ (ఆస్ట్రేలియా), బెతెల్ (ఇంగ్లాండ్), ఎంగిడి (దక్షిణాఫ్రికా), రొమారియో షెఫర్డ్ (వెస్టిండీస్)ల గైర్హాజరీతో ఇబ్బంది పడేలా ఉంది. ఇక మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా), ట్రిస్టన్ స్టబ్స్ (దక్షిణాఫ్రికా) దూరం కానుండడం దిల్లీకి పెద్ద దెబ్బే. లఖ్‌నవూకు కీలక ఆటగాడైన మార్‌క్రమ్ (దక్షిణాఫ్రికా).. ఆ జట్టుకు దూరమవుతున్నాడు. పంజాబ్‌కు యాన్సెన్ (దక్షిణాఫ్రికా) దూరం కానుండడం ప్రతికూలతే. సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌కు దూరమైనప్పటికీ కెప్టెన్ కమిన్స్, హెడ్ మిగతా లీగ్ మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారని తెలుస్తోంది.

ఫ్రేజర్ స్థానంలో ముస్తాఫిజుర్: మిగతా ఐపీఎల్ మ్యాచ్‌లకు పలువురు విదేశీ ఆటగాళ్ల సేవలను కోల్పోతున్న ఫ్రాంఛైజీలు.. వారి స్థానంలో తాత్కాలికంగా కొందరు ఆటగాళ్లను జట్టులోకి తీసుకునే పనిలో పడ్డాయి. స్వదేశానికి వెళ్లిపోయిన ఆస్ట్రేలియా ఓపెనర్ జేక్ ఫ్రేజర్, తిరిగి భారత్‌కు రానని తేల్చేయంతో అతడి స్థానంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్‌ను దిల్లీ జట్టు ఎంచుకుంది. స్టార్క్ దూరం కానున్న నేపథ్యంలో అతడి స్థానంలో ముస్తాఫిజుర్‌కు డీసీ పేస్ బాధ్యతలను అప్పగించే అవకాశముంది. అయితే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అతడికి ఇంకా నిరభ్యంతర పత్రం ఇవ్వలేదు.

వీళ్లు ఆడతారు

బార్ట్‌లెట్, అజ్మతుల్లా, మిచెల్ ఓవెన్ (పంజాబ్)

లివింగ్‌స్టన్, సాల్ట్ (బెంగళూరు)

బౌల్ట్, ముజీబ్ రెహ్మాన్ (ముంబయి)

కమిన్స్, హెడ్, క్లాసెన్,

రసెల్, నరైన్, రోమన్ పావెల్, డికాక్, గుర్బాజ్ (కోల్‌కతా)

నూర్ అహ్మద్, బ్రెవిస్, పతిరన, కాన్వే, సామ్ కరన్ (చెన్నై)

వీళ్లు అనుమానం

స్టొయినిస్, ఇంగ్లిస్, ఆరోన్ హార్డీ (పంజాబ్)

బట్లర్ (గుజరాత్)

విల్ జాక్స్, కార్బిన్ బోష్ (ముంబయి)

ఇషాన్ మలింగ, కమిందు, ముల్డర్ (సన్‌రైజర్స్)

రచిన్ రవీంద్ర (చెన్నై)

మొయిన్ అలీ, స్పెన్సర్ జాన్సన్ (కోల్‌కతా)

వీళ్లు దూరం

రబాడ, షెఫానీ రూథర్‌ఫర్డ్, కొయెట్జీ (గుజరాత్)

మిచెల్ స్టార్క్, జేక్ ఫ్రేజర్, ట్రిస్టన్ స్టబ్స్ (దిల్లీ)

హేజిల్‌వుడ్, బెతెల్, రొమారియో షెఫర్డ్, ఎంగిడి (బెంగళూరు)

మార్‌క్రమ్ (లఖ్‌నవూ)

మార్కో యాన్సెన్ (పంజాబ్)


రికిల్‌టన్ (ముంబయి)

మారిన నిబంధనలు

ఈసారి ఐపీఎల్ అనూహ్య పరిస్థితుల్లో ఆగి, మళ్లీ మొదలవుతున్న నేపథ్యంలో లీగ్ నిబంధనల్లో బీసీసీఐ కీలక మార్పు చేసింది. సాధారణంగా ఏ ఐపీఎల్ జట్టూ 12వ మ్యాచ్ తర్వాత కొత్త ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవడానికి వీల్లేదు. గాయం లేదా మరేదైనా కారణంతో ఓ ఆటగాడు లీగ్‌కు దూరమైతే 12 మ్యాచ్‌ల్లోపే ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంచుకునే వీలుంటుంది. అయితే ఈసారి ప్రత్యేక పరిస్థితుల కారణంగా 12 మ్యాచ్‌ల తర్వాత కూడా కొత్త ఆటగాళ్లను ఎంచుకునేందుకు అనుమతి లభించింది. పలువురు విదేశీ ఆటగాళ్లు లీగ్ కోసం తిరిగొచ్చే అవకాశం లేకపోవడంతో తాత్కాలిక ఒప్పందాలకు బీసీసీఐ అవకాశమిచ్చింది. అయితే ప్రస్తుతం ఫ్రాంఛైజీలతో ఒప్పందాలు చేసుకుంటున్న ఆటగాళ్లెవ్వరినీ తర్వాతి సీజన్ కోసం అట్టిపెట్టుకునే అవకాశం లేదు. లీగ్ ఆగడానికి ముందు ఎంచుకున్న ఆటగాళ్లను మాత్రం అట్టిపెట్టుకోవచ్చు.

# కోహ్లి వల్లే టెస్టులకు కళ

లండన్: విరాట్ కోహ్లి అకస్మిక టెస్ట్ రిటైర్మెంట్‌పై ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. టెస్టు క్రికెట్‌కు కోహ్లి చేసినంతగా మరే ఆటగాడూ చేయలేదని అన్నాడు. “నన్ను నిజంగా నిరాశకు గురిచేసిన టెస్టు రిటైర్మెంట్లు పెద్దగా లేవు. మళ్లీ టెస్టు క్రికెట్ చూడను అని అనిపించలేదు. కానీ కోహ్లిని మళ్లీ తెల్ల దుస్తుల్లో చూడలేమంటే చాలా బాధగా ఉంది. అతడు ఇప్పుడు రిటైర్ కావడం దిగ్భ్రాంతిని కలిగించింది. విచారంగా కూడా అనిపిస్తోంది. ఆటతో నా అనుబంధం 30 ఏళ్లకుపైనే. నాకు తెలిసి టెస్టు క్రికెట్‌కు కోహ్లి కంటే ఎక్కువ చేసిన క్రికెటర్ లేడు” అని వాన్ చెప్పాడు. “పదేళ్ల కింద కోహ్లి టెస్టు పగ్గాలు అందుకున్న సమయంలో.. టెస్టు క్రికెట్‌పై భారత్ ఆసక్తి కోల్పోతుందేమోనన్న ఆందోళనతో ఉండేవాణ్ని. ధోని పరిమిత ఓవర్ల క్రికెట్లో గొప్ప ఆటగాడు. కానీ టెస్టు ఫార్మాట్‌ను ఇష్టపడని టెస్టు జట్టుకు అతడు సారథ్యం వహించాడని నాకు ఎందుకో అనిపిస్తుంది. టెస్టు క్రికెట్‌ను పిచ్చిగా ఇష్టపడే భారత్.. క్రికెట్‌కు అవసరం. కెప్టెన్‌గా కోహ్లి.. జనాల్లో టెస్టులపై ఇష్టం కలిగేలా చేశాడు. ఆట పట్ల అతడి వ్యామోహం, నైపుణ్యం, టెస్టు క్రికెట్టే అత్యుత్తమమైందని అతడు నిరంతరం మాట్లాడిన తీరు ఆ ఫార్మాట్‌కు గొప్ప మేలు చేశాయి. కోహ్లి లేకుంటే టెస్టు క్రికెట్ చాలా చప్పగా ఉండేది” అని అన్నాడు.



మైకెల్ వాన్

లండన్: స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టుల నుంచి రిటైరైనప్పటికీ భారత జట్టుకు ఇబ్బందేమీ ఉండదని ఇంగ్లాండ్ దిగ్గజ పేసర్ జేమ్స్ అండర్సన్ అభిప్రాయపడ్డాడు. వారి స్థానాలను భర్తీ చేసే ప్రతిభ భారత క్రికెట్లో ఉందని అతనన్నాడు. “కోహ్లి, రోహిత్ ఇద్దరూ గొప్ప ఆటగాళ్లు. కోహ్లి టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడు. అంత పెద్ద ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేయడం సవాలే. కానీ భారత్ దగ్గర కావాల్సినంత ప్రతిభ ఉంది. ఒకసారి ఐపీఎల్‌ను చూడండి. నిర్భీతిగా, దూకుడుగా ఆడే కుర్రాళ్లు చాలామంది ఉన్నారు. వారి నుంచే భారత్ టెస్టు ఆటగాళ్లను తీసుకొస్తోంది” అని అండర్సన్ తెలిపాడు.

# వాళ్లిద్దరూ ఎ+ గ్రేడ్‌లోనే..

ముంబయి: టీ20, టెస్టు క్రికెట్ నుంచి రిటైరైనప్పటికీ సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు గ్రేడ్ ఎం కాంట్రాక్ట్ కొనసాగుతుందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పాడు. ప్రస్తుతం ఈ ఇద్దరితో పాటు బుమ్రా, జడేజా మాత్రమే ఎం గ్రేడ్‌లో ఉన్నారు. “టెస్టు, టీ20 క్రికెట్ నుంచి రిటైరైనా.. కోహ్లి, రోహిత్‌లకు ఎం గ్రేడ్‌లోనే ఉంటారు. వాళ్లిప్పటికీ భారత క్రికెట్ జట్టులో ఉన్నారు. వాళ్లకు గ్రేడ్ ఎం సౌకర్యాలు కొనసాగుతాయి” అని సైకియా అన్నాడు. రోహిత్, కోహ్లి కొన్ని రోజుల వ్యవధిలో టెస్టుల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వీళ్లిద్దరూ నిరుడు టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికారు.

ముంబయిలో బ్యాటింగ్ సాధన చేస్తున్న ముంబయి ఇండియన్స్ బ్యాటర్ రోహిత్ శర్మ. ఐపీఎల్ పునఃప్రారంభంలో ముంబయి తన తొలి మ్యాచ్‌లో బుధవారం వాంఖడేలో దిల్లీని ఢీకొంటుంది.



# రిషిత రెడ్డికి స్వర్ణం



దిల్లీ: ఈ ఏడాది జరిగే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్ కోసం ఫిడే రూ.9.5 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. ఫార్మాట్లోనూ మార్పులు చేసింది. అంతర్జాతీయ చెస్ క్యాలెండర్‌లో ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ఒకటైన ఈ ఛాంపియన్‌షిప్‌కు దోహా ఆతిథ్యమివ్వనుంది. ర్యాపిడ్ టోర్నీ ఫార్మాట్‌ను మార్చలేదు. ఓపెన్ విభాగంలో 13 రౌండ్లు, మహిళల విభాగంలో 11 రౌండ్లు ఉంటాయి. తొలి స్థానం కోసం టై ఏర్పడితే ప్లేఆఫ్ నిర్వహిస్తారు. బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కొత్తగా నాకౌట్ ఫార్మాట్‌ను ప్రవేశపెట్టారు. స్విస్ స్టేజ్ నుంచి నలుగురు క్రీడాకారులు నాకౌట్ సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. ఇంతకుముందు ఎనిమిది మంది ముందంజ వేసేవాళ్లు.

ఆసియాకప్ హాకీలో పాక్ ఆడేది అనుమానమే

దిల్లీ: రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌లో జరిగే హాకీ ఆసియాకప్‌లో పాకిస్థాన్ పాల్గొనేది అనుమానంగా మారింది. ఆసియాకప్ ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్‌లో జరగాల్సివుంది. భారత్‌తో పాటు పాకిస్థాన్, జపాన్, కొరియా, చైనా, మలేసియా, ఒమన్, చైనీస్ తైపీ ఈ టోర్నీలో పోటీపడాల్సిన జట్లు. నెదర్లాండ్స్, బెల్జియంలో జరిగే ప్రపంచకప్‌కు ఇది క్వాలిఫయింగ్ టోర్నమెంట్. “ఇప్పుడే ఏమీ చెప్పలేం. కానీ ఎప్పటిలాగే ఈ విషయంపై ప్రభుత్వ సూచనలను పాటిస్తాం. పహల్గాం, ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ఏమీ ఊహించలేం. టోర్నీకి ఇంకా దాదాపు మూడు నెలల సమయం ఉంది” అని హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్ చెప్పాడు. పాకిస్థాన్ జట్టుకు భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే, ఆ జట్టు భారత్‌కు రాదని హాకీ ఇండియా వర్గాలు చెప్పాయి. పాక్ రాకపోతే.. ఏడు జట్లతో టోర్నీని నిర్వహించాలా లేదా మరో జట్టును తీసుకోవాలా అన్నది పూర్తిగా ఆసియా హాకీ సమాఖ్య చేతుల్లో ఉంటుందని పేర్కొన్నాయి.

దుబాయ్: మహిళల వన్డే క్రికెట్లో భారత జట్టు మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇటీవల ముక్కోణపు సిరీస్ టైటిల్ గెలవడం ద్వారా ఎనిమిది రేటింగ్ పాయింట్లు దక్కించుకున్న భారత్ (121).. రెండో స్థానంలోని ఇంగ్లాండ్ (127)కు చేరువైంది. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్స్ ఆస్ట్రేలియా (167) అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్ (96), దక్షిణాఫ్రికా (90), శ్రీలంక (82) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

# నీరజ్‌కు లెఫ్టినెంట్ కర్నల్ హోదా

దిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రాకు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్‌గా గౌరవపూర్వక హోదాను ప్రదానం చేశారు. ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖ సైనిక వ్యవహారాల విభాగం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. నీరజ్ ఇప్పటివరకు సైన్యంలో సుబేదార్ మేజర్‌గా ఉన్నాడు. 27 ఏళ్ల నీరజ్.. 2020 టోక్యో ఒలింపిక్స్ స్వర్ణం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెలుచుకున్నాడు. 2023 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం సాధించాడు. 2011లో భారత క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనికి లెఫ్టినెంట్ కర్నల్ హోదాను ప్రదానం చేసిన సంగతి తెలిసిందే.



నీరజ్ చోప్రా

పోలెండ్ టోర్నీలో నీరజ్

దిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తల కారణంగా తన సొంత టోర్నీ నీరజ్ చోప్రా క్లాసిక్‌ను వాయిదా వేసిన స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా అదే సమయంలో పోలెండ్ టోర్నీలో ఆడేందుకు సిద్ధమయ్యాడు. మే 23న చోర్జోలో జరిగే జావెలిన్ టోర్నీలో పోటీపడనున్నాడు. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్, ఒలింపిక్ కాంస్య పతక విజేత అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబర్ (జర్మనీ) కూడా ఈ టోర్నీ బరిలో ఉన్నారు. ఈ సీజన్‌లో నీరజ్ పోటీపడనున్న మూడో టోర్నీ ఇది. దక్షిణాఫ్రికాలో ఆడిన అతడు మే 16న దోహా డైమండ్ లీగ్‌లోనూ పోటీలో ఉన్నాడు. షెడ్యూల్ ప్రకారం ఎన్‌సీ క్లాసిక్ మే 24న జరగాల్సింది. ఈ టోర్నీ తిరిగి ఎప్పుడు జరుగుతుందన్న దానిపై స్పష్టత లేదు.



## రాజమౌళిని ఆటపట్టించిన రామ్‌చరణ్- ఎన్టీఆర్: ‘ఆర్‌ఆర్‌ఆర్ 2’పై స్పందించిన దర్శకుడు

హీరోలు రామ్‌చరణ్ ఎన్టీఆర్ , డైరెక్టర్ రాజమౌళి ఎంతో స్నేహంగా ఉ ంటారనే సంగతి తెలిసిందే. వారి అనుబంధాన్ని చాటే ఎన్నో వీడియోలు ఇప్పటికే నెట్టింట సందడి చేయగా.. తాజాగా మరో వీడియో బయటకు వచ్చింది. అందులో.. హీరోలిద్దరూ దర్శకుడిని ఆటపట్టిస్తూ కనిపించారు. ‘ఇప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ 2’ చేస్తారా? అని ఒకరు అడగ్గా ‘ఎస్’ అని రాజమౌళి సమాధానమిచ్చారు. సంబంధిత వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ‘ఆర్‌ఆర్‌ఆర్ లైవ్ కాన్సర్ట్’లో చోటుచేసుకున్న దృశ్యాలవి. ఆ ఈవెంట్ లండన్‌లోని ప్రఖ్యాత రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో కొన్ని రోజుల క్రితం జరిగింది. ఈ ముగ్గురితోపాటు సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి తదితరులు హాజరయ్యారు.

‘ఆర్‌ఆర్‌ఆర్’ సీక్వెల్‌పై ఇప్పటికే పలుమార్లు సానుకూలంగా స్పందించారు రాజమౌళి. మరోవైపు, ఆ మూవీ కథా రచయిత, రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ సైతం ‘ఆర్‌ఆర్‌ఆర్ 2’ తెరకెక్కే అవకాశాలున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

‘బాహుబలి 2’ తర్వాత ‘ఆర్‌ఆర్‌ఆర్’


రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో లైవ్ కాన్సర్ట్ చేసిన తొలి విదేశీ చిత్రంగా ‘బాహుబలి 2’ రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత ‘ఆర్‌ఆర్‌ఆర్’ నిలిచింది. రెండూ రాజమౌళి దర్శకత్వం వహించిన సినిమాలే కావడం విశేషం.

## ఐకానిక్ పాత్రల్ని ప్రతిబింబించే పోలీసు పాత్రతో?



రజనీకాంత్ ‘జైలర్ 2’ చిత్రంలో నందమూరి బాలకృష్ణ ప్రత్యేక పాత్రలో కనువిందు చేయడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. విజయవంతమైన ‘జైలర్’ సినిమాకి కొనసాగింపుగా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఇందులో మలయాళం నుంచి మోహన్‌లాల్, కన్నడ నుంచి శివ రాజ్‌కుమార్ అతిథి పాత్రల్లో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడు తెలుగు నుంచి బాలకృష్ణ రంగంలోకి దిగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు పూర్తయినట్లు తెలిసింది. ఈ చిత్రంలో బాలకృష్ణ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పోలీసు అధికారి పాత్రలో కనిపిస్తారని.. అది తన ‘రౌడీ ఇన్‌స్పెక్టర్’, ‘లక్ష్మీ నరసింహ’ లాంటి ఐకానిక్ పాత్రల్ని ప్రతిబింబించేలా ఉ ండనుందని.. ఫ్లాష్‌బ్యాక్‌లో ఆయనకి రజనీకి మధ్య శక్తిమంతమైన సన్నివేశాలు ఉంటాయని తమిళ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. మరి దీనిపై పూర్తి స్పష్టత రావాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు. ప్రస్తుతం ఈ సినిమా ) కేరళలో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో రమ్యకృష్ణ, మిర్నా మేనన్, ఫహాద్ ఫాజిల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

## ప్రతి సినిమాతో పది మంది ప్రేక్షకులైనా పెరగాలి



“నేనే చాలా థ్రిల్లర్ కథల్లో నటించా. ఇప్పటి వరకూ ఏ కథలో లేని భావోద్వేగం ఇందులో ఉంది. ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని పంచుతుంది’’ అన్నారు నవీన్‌చంద్ర ( ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన ద్విభాషా చిత్రం ‘లెవెన్’ . లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. అజ్మల్‌ఖాన్, రేయా హరి నిర్మాతలు. ఈ చిత్రాన్ని ఈ నెల 16న రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఎన్.సుధాకర్ రెడ్డి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు నవీన్‌చంద్ర.

“చాలా రోజుల తర్వాత థియేట్రికల్‌గా ఓ గొప్ప అనుభవాన్ని పంచే సినిమా చేశానన్న తృప్తిని ఇచ్చింది ‘లెవెన్’. ఇప్పటికే తమిళంలో ప్రత్యేక ప్రదర్శనలు జరిగాయి. ప్రతి చోటా మంచి స్పందన లభించింది. సినిమా పూర్తయ్యాక ప్రేక్షకులు లేచి చప్పట్లు కొట్టారు. మేం అనుకున్న మలుపులు, థ్రిల్లింగ్ అంశాలు అమితంగా ఆకట్టుకున్నాయి. వరుసగా జరిగే హత్యల చుట్టూ ఈ కథ సాగుతుంది. ‘లెవెన్’ (%జుశ్రీవజవఅ%) అనే పేరులోనే కథంతా ఉంటుంది. హత్యలు చేసి నగరం అవతల పడేశారనే మాటల్ని మనం వింటుంటాం. కానీ ఈ కథలో హత్యలు చేసి నగరంలో వేస్తుంటారు. అలాగే హత్యలు చేసినవాళ్లని పట్టుకోవడంతోనే థ్రిల్లర్ సినిమాలు ముగుస్తుంటాయి. కానీ ఈ కథలో ఎనిమిది హత్యల తర్వాత హంతకుడు దొరికిపోతాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నది కీలకం. థ్రిల్లింగ్ అంశాలు, భావోద్వేగ కోణం మేళవింపు ఈ సినిమాని మరింత విభిన్నంగా మార్చేసింది”.

“రచనా బలం ఉన్న చిత్రమిది. ఆరు నెలలపాటు పూర్వ నిర్మాణ పనులు చేశాక చిత్రీకరణని ప్రారంభించాం. తమిళంలో రాసుకున్న సంభాషణల్ని తెలుగులోకి అనువాదం చేసినట్టుగా కాకుండా, తెలుగులో ప్రత్యేకంగా స్క్రిప్ట్ రాసి, రెండు భాషల్లో వేర్వేరుగా చిత్రీకరణ చేశాం. థ్రిల్లర్ సినిమాలు సాంకేతికంగా బలంగా ఉ ంటాయి. నటులు పాత్రలపై బలమైన ప్రభావం చూపిస్తేనే పేరొస్తుంది. దర్శకుడు లోకేశ్ పనితీరు గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. నేను ఎప్పట్నుంచో చేస్తున్న థ్రిల్లర్ సినిమాలు ఈ మధ్య వరుసగా విడుదలైయ్యాయి. అందుకే ఎక్కువగా పోలీసు పాత్రలు, థ్రిల్లర్ కథలతో ప్రయాణం చేస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఈ సినిమా తర్వాత నా ప్రయాణం భిన్నంగా కనిపిస్తుంది”.

“తెలుగు, తమిళ భాషల్లో ప్రయాణం నాకు మేలే చేస్తోంది. కన్నడలోనూ నా పాత్రలకి నేనే డబ్బింగ్ చెప్పుకుంటుంటా. నా తదుపరి సినిమాకి మలయాళంలోనూ నేనే డబ్బింగ్ చెప్పబోతున్నా. నేను ఎనిమిది భాషలు మాట్లాడతాను. చేసే ప్రతి సినిమాతోనూ పది మంది ప్రేక్షకులైనా పెరగాలనేది నా సిద్ధాంతం. అందుకే ఇటు కథానాయకుడిగానూ, అటు సహాయపాత్రల్లోనూ, అప్పుడప్పుడూ ప్రతినాయకుడిగానూ ఇలా అన్ని రకాల పాత్రలు చేస్తూ వచ్చా. ‘అరవింద సమేత’లో నా పాత్ర ఎంతగా ప్రభావం చూపిందో, రవితేజ చిత్రం ‘మాస్ జాతర’లో విలన్‌గా అంతే ప్రభావం చూపిస్తా. ఆ పాత్రకి నేనైతేనే బాగుంటానని రవితేజ చెప్పడంతోనే ఆ అవకాశం నాకు వచ్చింది. అందులో లుక్ కూడా కొత్తగా ఉంటుంది. ఇప్పటిదాకా కామెడీ సినిమా చేయలేదు. హరి ఏలేటి దర్శకత్వంలో సునీల్, నేను కలిసి ఓ కామెడీ సినిమా చేశాం. త్వరలోనే ఆ సినిమా విడుదలవుతుంది. దీంతోపాటు ‘కాళీ’ అనే ఓ యాక్షన్ సినిమా, సితార సంస్థలోనే మరో చిత్రం చేయబోతున్నా. తమిళంలోనూ సినిమాలు చేస్తున్నా”.

## వరుస సినిమాలు.. అరుదైన రికార్డులు: దటీజ్ మోహన్‌లాల్




గతేడాది కమర్షియల్‌గా హిట్ అందుకోలేకపోయిన మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్ ) ఈ ఏడాది ఆ లోటు భర్తీ చేసుకున్నారు. విభిన్న కథా చిత్రాలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని.. కలెక్షన్స్ విషయంలో మలయాళ చిత్ర పరిశ్రమలో రికార్డులు నెలకొల్పారు. అవే ‘ఎల్ 2: ఎంపురాన్’ ‘తుడరుమ్’

%అలా ‘తుడరుమ్’..

కేవలం కేరళ బాక్సాఫీసు వద్దే రూ.100 కోట్లు (గ్రాస్) వసూలు చేసిన తొలి మలయాళ సినిమాగా ‘తుడరుమ్’ నిలిచింది. ‘కేరళ బాక్సాఫీసు చరిత్రలో ఇదో కొత్త అధ్యాయం’ అంటూ మోహన్‌లాల్ సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. ‘మనమంతా కలిసి ఈ మైలురాయిని చేరుకున్నాం’ అంటూ మలయాళ ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ఇప్పటి వరకూ రూ.210o కోట్లు (కేరళతో కలిపి) రాబట్టింది అత్యధిక వసూలు చేసిన మలయాళ చిత్రాల జాబితాలో ప్రస్తుతానికి మూడో స్థానంలో ఉంది. సాఫీగా జీవితాన్ని సాగిస్తున్న ఓ ట్యాక్సీ డ్రైవర్ ఊహించని విధంగా హత్య కేసులో ఇరుక్కోవడం, దాన్నుంచి బయటపడేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశాడనే అంశాలతో దర్శకుడు తరుణ్ మూర్తి తెరకెక్కించారు. మోహన్‌లాల్ సరసన శోభన నటించారు. ఏప్రిల్ 25న సినిమా విడుదలైంది.

ఇలా ‘ఎల్ 2: ఎంపురాన్’

మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన ‘ఎల్ 2: ఎంపురాన్’ ఇప్పటి వరకూ అత్యధిక వసూలు (రూ.268o కోట్లు) చేసిన మలయాళ సినిమాల జాబితాలో తొలిస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. తక్కువ సమయంలోనే (5 రోజులు) రూ.200 కోట్ల క్లబ్‌లో చేరిన ఫస్ట్ మలయాళ మూవీగానూ మరో రికార్డు నెలకొల్పింది. ‘లూసిఫర్’కు సీక్వెల్‌గా రూపొందిన ఈ చిత్రం మార్చి 27న బాక్సాఫీసు ముందుకొచ్చింది. ఇలా నెల వ్యవధిలో రెండు సినిమాలు విడుదల కావడం, భారీ కలెక్షన్స్ రాబట్టిన మూవీస్ లిస్ట్‌లో టాప్ 1, టాప్ 3లో నిలవడంపై అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దటీజ్ మోహన్‌లాల్ అంటూ కొనియాడుతున్నారు.

## కేన్స్‌లో తారలు.. ఊర్వశి హొయలు



తెరపై నటనతో అదరగొట్టే మన సినీతారలు.. అవకాశం వచ్చినప్పుడల్లా ఫ్యాషన్ రంగంలోనూ ప్రపంచ వేదికలపై తళుక్కున మెరుస్తూ సందడి చేస్తుంటారు. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉ ర్రూతలూగించే నాయిక ఊర్వశీ రౌతేలా.. అట్టహాసంగా మొదలైన కేన్స్ చిత్రోత్సవాల్లో పలువురు సినీతారలతో పాటు మెరిసింది. మల్టీకలర్ పొడవాటి గౌను ధరించి రెడ్ కార్పెట్‌పై హొయలొలికించింది. కొన్నేళ్లుగా కేన్స్ ఫెస్టివల్‌లో మెరుస్తూ సందడి చేస్తున్న ఈ భామ.. ఈసారి చిలుక ఆకారంలో ఉన్న క్రిస్టల్ ఎంబెడెడ్ క్లచ్‌ను చేతిలో పట్టుకొని సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. మరోవైపు ఊర్వశీ.. కథానాయిక ఐశ్వర్యరాయ్ లుక్‌ను కాపీ కొట్టిందని నెటిజన్లు ఆమె లుక్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## ‘మార్గన్’.. విడుదల ఖరారు

విజయ్ ఆంటోని హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘మార్గన్’. లియో జాన్ పాల్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాతోనే విజయ్ మేనల్లుడు అజయ్ ధీషన్ ప్రతినాయకుడిగా పరిచయమవుతున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం జూన్ 27న థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం బుధవారం ప్రకటించింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకుంది. ‘‘ఆద్యంతం ఆసక్తిరేకెత్తించే మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే హృద్యమైన కుటుంబ చిత్రంగా ఉంటుంది. ఇందులో విజయ్, అజయ్‌ల మధ్య వచ్చే భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఆకర్షణగా నిలుస్తాయి” అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాలో సముద్రఖని, మహానటి శంకర్, ప్రీతిక, బ్రిగిడా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విజయ్ ఆంటోని, ఛాయాగ్రహణం: యువ ఎస్.

ఈ ఒక్క షాట్‌తో మనం ఆటను గెలవబోతున్నామంటున్నారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు ఆమిర్ ఖాన్. ఇదంతా తన రాబోయే సినిమా ‘సితారే జమీన్ పర్’ చిత్రం కోసమే. ఆయన, జెనీలియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. ఆర్.ఎస్ ప్రసన్న దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో గుల్షన్ అనే బాస్కెట్‌బాల్ కోచ్‌గా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు ఆమిర్.

“నేను మీ కోసం ఎంతో కష్టపడ్డాను. ఇప్పుడు నువ్వు వాళ్ల కోసం పోరాడాలి” లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియుల దృష్టిని ఆకట్టుకుంటోంది. మానసికంగా సవాళ్లు ఎదుర్కొంటున్న కొంతమందిని మంచి ప్లేయర్స్‌గా తీర్చిదిద్దమని కోచ్ గుల్షన్‌కు అప్పగిస్తుంది కోర్ట్. ఈ క్రమంలో ఆయన ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారనే కథాంశంతో వినోదాత్మకంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ట్రైలర్‌తో స్పష్టం అవుతోంది.

# చీటికీ మాటికీ వచ్చే కోపం ఎంత చేటు చేస్తుందంటే..

‘తన కోపమే తన శత్రువు..’ అన్నారు పెద్దలు. ఆవేశానికి పోయి అవకాశాలు కోల్పోతే వచ్చిన ప్రమాదమేం లేదు. కానీ, కోపం కారణంగా ఆరోగ్య నష్టం జరుగుతుందనీ, తీవ్రమైన వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న చిన్న విషయాలకు ఆగ్రహోద్రిక్తులు అవుతున్నారంటే మీ ఆరోగ్యాన్ని చేజేతులా పాడుచేసుకుంటున్నారని గమనించాలి. ఇంతకీ చీటికీ మాటికీ వచ్చే కోపం ఎంత చేటు చేస్తుందంటే

కోపం కారణంగా కడుపులో అల్సర్, గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతాయి. కోపంగా ఉన్న సమయంలో మన మెదడులోని రక్తనాళాలు సంకోచిస్తాయి. ఇలాంటి పరిస్థితులలో కోపం ఒక్కొక్కసారి రక్తనాళాలు దెబ్బతినేలా చేస్తుంది. విపరీతమైన కోపం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దాని కారణంగా అనేక ఇన్ఫెక్షన్లు తలెత్తే ప్రమాదం ఉంది.



అధిక కోపం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మితిమీరిన కోపం తెచ్చుకోవడం ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. కోపం వల్ల తలనొప్పి, అధిక రక్తపోటు, నిద్రలేమి సమస్యలు పెరుగుతాయి. మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది.

ఒక్కొక్కసారి విపరీతమైన కోపం వల్ల బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. చాలా కోపంగా ఉండే వ్యక్తుల్లో కూడా మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. అంతేకాదు చర్మ సంబంధిత సమస్యలు సోరియాసిస్, ఎగ్జిమా వచ్చే అవకాశం ఉంది. అందుకే కోపాన్ని జయించి తన శాంతమే తకు రక్ష సూత్రాన్ని వంటబట్టించుకోవడం అవసరం.

# పంటల సాగులో రసాయనాలు.. ఆరోగ్యానికి హానికరం

పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహారం అందించే క్రమంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు, కలుపు నాశనుల వాడకం పెరిగింది. పంటల దిగుబడులు బాగా పెరిగి ఆహార భద్రత సమకూరినప్పటికీ, ఇలాంటి ఆహారం వల్ల ఎనిమిది రకాలైన ప్రమాదకర రసాయనాలు మన ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పంటలు, కూరగాయలు, పండ్లతోటల్లో తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు మోనోక్రోటోఫాస్, ఆక్సిడెమెటాన్‌మిథైల్, ఏసిఫేట్, ప్రొఫెనోఫాస్, ఎలక్లార్, క్లోరోథాలోనిల్, మిథోమైల్, ట్రగ్లైఫోసేట్ లాంటి క్రిమి సంహారకాలు, శిలీంధ్ర నాశకాలు, కలుపు నాశనులను పిచికారీ చేస్తారు. వీటిలో ఉండే హానికరమైన రసాయనాల వల్ల శ్వాస సమస్యలు, నాడీకణాలు ధ్వంసం కావడం, చర్మ సమస్యలు, జీర్ణవ్యవస్థలో ఇబ్బందులు,



క్యాన్సర్లు అభివృద్ధి చెందడంలాంటి విపరిణామాలు సంభవిస్తాయి.

కాబట్టి, మన ఆరోగ్య సంరక్షణ కోసం తినే ఆహార పదార్థాల్లో దాగి ఉన్న ఈ రసాయనాల గురించి తెలుసుకుని ఉండాలి. మార్కెట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులను ఎంచుకోవడం, పండ్లు, కూరగాయలను బాగా కడిగి తినడం, సుస్థిర వ్యవసాయ విధానాలను అనుసరించడం మొదలైన చర్యల ద్వారా హానికరమైన రసాయనాల ప్రభావాన్ని తప్పించుకోవచ్చు.

# పిల్లల్లో అధిక బరువుకు కారణమేంటి?

మా బాబుకు పదేండ్లు. ఇంతకుముందు బరువు మామూలుగానే ఉండేవాడు. సంవత్సరం నుంచి ఊహించనంతగా బరువు పెరుగుతున్నాడు. నిరుడు సైకిల్ పైనుంచి పడ్డాడు. తలకు గాయమైంది. వైద్యులను సంప్రదిస్తే మెదడులో రక్తస్రావమైందని చెప్పారు.



శస్త్రచికిత్స చేశారు. అప్పట్నుంచి బరువు పెరుగుతున్నాడు. మా బాబుకు ఆటల పట్ల ఆసక్తి లేదు. ఎప్పుడూ ఏదో ఒకటి తింటూ ఉంటాడు. పిల్లల వైద్య నిపుణుడిని సంప్రదిస్తే ప్రవర్తనకు సంబంధించిన సమస్య కాబట్టి చిరుతిళ్లు తగ్గించమని సూచించారు. ఆహారం తగ్గించినా ప్రయోజనం లేదు. కొన్నాళ్లకు అదే తగ్గుతుందిలే అనుకున్నాం. అయితే, మా బిడ్డ బరువు పెరగడానికి హార్మోన్ల సమస్య కారణమేమో అన్న సందేహం కలుగుతున్నది. మా సమస్యకు సరైన పరిష్కారం చూపగలరు.

ఒకే సంవత్సరంలో విపరీతమైన బరువు పెరిగాడని చెప్పారు. కానీ ఎంతన్నది చెప్పలేదు. వాస్తవానికి పిల్లలు ఒక ఏడాది కాలంలో ఒకటీ రెండు కిలోల కన్నా ఎక్కువగా పెరిగే అవకాశం లేదు. మీ బాబు మరీ ఎక్కువగా పెరిగినట్లు మీరు గమనించి ఉంటే, మళ్లీ ఓసారి ఇప్పుడు గ్రోత్ చాట్ సాయంతో అతని బరువుల్ని నమోదు చేయండి. పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదించి, ఈ బరువుకు బలమైన కారణం ఏమై ఉంటుందో నిర్ధారణ చేసుకోవాల్సి ఉంది.

అలాగే మీ బాబు తలకు దెబ్బ తగిలిందని చెప్పారు.

ఒక్కోసారి తలకు గాయమైతే మెదడులోని గ్రంథులపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. మరో విషయం ఏమిటంటే.. ఈ రోజుల్లో పిల్లల్లో ఊబకాయం, స్థూలకాయం, ఒబేసిటీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఆరోగ్యకరమైనది కాకుండా ఎక్కువగా కొవ్వులు ఉన్న ఆహారం తీసుకోవడమే ఇందుకు కారణం. టీవీ, ఫోన్, ఇతర గ్యాడ్జెట్స్‌తో గడుపుతుండటమూ కారణమే. శారీరక శ్రమ లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం లాంటివి కూడా వింత ఆరోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. అయితే మీ బాబుకి హార్మోన్ల లోపం ఉన్నదా.. లేదా? అనేది తెలుసుకునేందుకు కొన్ని పరీక్షలు అవసరం.

మీ బాబు సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి ఔట్‌డోర్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడండి. కొవ్వు పదార్థాలు లేని ఆహారం ఇవ్వండి. ఇంకో విషయం ఏమిటంటే మీ బాబులో మీరు గమనించిన కొన్ని లక్షణాల గురించి చెప్పలేదు. హుషారుగా ఉంటున్నాడా.. లేదా? మలబద్ధక సమస్య ఏమైనా ఉందా? నిస్సత్తువగా, నిద్రమత్తుగా ఉంటున్నాడా? గమనించండి. ఇలాంటి సమస్యలు ఉన్నట్లయితే థైరాయిడ్ లాంటి హార్మోన్ సమస్య ఉండొచ్చు. ఈ విషయాలన్నీ గ్రహించి, సమస్య పరిష్కారం కోసం పీడియాట్రిషన్‌ను లేదా పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది.

# తుంటి తెచ్చే తంటాలు తుంటి నొప్పి...

తుంటి నొప్పి ఈ మధ్యకాలంలో చాలా మందిని వేధిస్తున్న సమస్య. గతంతో పోలిస్తే కరోనా వైరస్ వచ్చిపోయిన తరువాత తుంటి నొప్పి బాధితుల సంఖ్య పెరిగిందంటున్నారు వైద్య నిపుణులు. కారణం వైరస్‌కు గురై, కోలుకున్న తరువాత రక్త సరఫరాలో అవరోధాలు ఏర్పడటమే. ఈ విధంగా రక్త ప్రసరణ మందగించడం వల్ల తలెత్తే తుంటి సమస్యను వైద్య పరిభాషలో ‘ఏవాస్కులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్ జాయింట్’ అంటారు. ఈ వ్యాధి ముందు నుంచే ఉన్నప్పటికీ కరోనాతరువాత బాధితుల సంఖ్య 20 శాతం పెరిగినట్టు చెబుతున్నారు వైద్యులు. ఈవ్యాధి రావడానికి ప్రధాన కారణాలేంటి? దీనివల్ల రోగికి కలిగే ఆరోగ్య సమస్యలు, నిర్ధారించే పద్ధతులు, వ్యాధి లక్షణాలు, చికిత్స తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

సాధారణంగా శరీరంలోని ఏ అవయవానికైనా పైనుంచి కిందికి రక్త సరఫరా జరుగుతుంది. కానీ తుంటి భాగానికి మాత్రం కింది నుంచి పైకి రక్తం సరఫరా జరుగుతుంది. దీనివల్ల ఇతర భాగాలతో పోలిస్తే తుంటి ఎముకకు రక్తం





కనిపిస్తాయి. రెండో దశలో వ్యాధిని గుర్తిస్తే శస్త్రచికిత్స అవసరం లేకుండానే మాత్రలతో వ్యాధిని నయం చేయవచ్చు. మొదటి రెండు దశల్లో వ్యాధిని గుర్తిస్తే సాధారణ చికిత్స ద్వారా ఎముక కుళ్లిపోవడం (బోన్‌డెత్) నుంచి రోగికి విముక్తి కల్పించవచ్చు.

మూడో దశ

మూడో దశను కొలాప్స్ దశ అనికూడా అంటారు. ఈ దశలో తుంటి కీలులోని ఎముక 50 శాతం నుంచి 75



సరఫరా మందగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంటే తుంటి కీలు హిప్ జాయింట్‌కు రక్త ప్రసరణ అనేది తగ్గిపోతుంది. ఫలితంగా తుంటి కీలులోని ఎముక కణాలు క్రమంగా నశిస్తాయి. ఇవి పూర్తిగా నశిస్తే.. అక్కడున్న ఎముక కుళ్లిపోతుంది. ఇలా ఎముక కుళ్లిపోవడాన్నే వైద్య పరిభాషలో ‘ఏవాస్కులర్ నెక్రోసిస్’ అంటారు. దీనివల్ల రోగి తీవ్రమైన తుంటి నొప్పితో బాధపడతాడు. ఈ వ్యాధి సాధారణంగా నాలుగు దశల్లో ఉంటుంది.

మొదటి దశలో

%తొలి దశలో ఎముకలోని కణాలు నశించడం ప్రారంభమవుతుంది. దీంతో తుంటి నొప్పి మొదలవుతుంది. ఆరు వారాల్లో నొప్పి తగ్గకపోతే ఎంఆర్‌ఐ చేయించాల్సి ఉంటుంది. ఈ దశలో ఎంఆర్‌ఐ పరీక్షతో వ్యాధిని నిర్ధారించవచ్చు. మొదటి దశలోనే వ్యాధిని గుర్తించడం వల్ల సాధారణ చికిత్సతోనే రోగికి వ్యాధి ముదరకుండా జాగ్రత్త పడవచ్చు.

రెండో దశ

దీనిని ప్రీ కొలాప్స్ దశ అంటారు. ఈ దశలో కార్టిలేజ్‌కు సపోర్ట్‌గా ఉన్న ఎముక 25 శాతం నుంచి 50 శాతం వరకు దెబ్బతింటుంది. రోగిలో లక్షణాలు స్పష్టంగా

శాతం వరకు అరిగిపోతుంది. ఈ దశలో రోగి భరించలేని నొప్పితో బాధపడతాడు. లేచి నిలబడలేడు. నడవలేడు. నొప్పి కారణంగా నిద్ర పట్టదు.

నాలుగో దశ

ఈ దశలో తుంటి ఎముక పూర్తిగా దెబ్బతిని, కప్ సైడ్ కూడా అరుగుదల మొదలవుతుంది. నాలుగో దశను ఆర్థరైటిస్ స్టేజ్ అంటారు. ఈ దశలో రోగి తుంటి కీలు ఎముక పూర్తిగా కుళ్లిపోతుంది. దీనివల్ల తుంటి కీళ్లు పనిచేయవు. దీంతో రోగి తీవ్రమైన నొప్పితో బాధపడతాడు. ఒకచోటు నుంచి మరోచోటుకు నడవడం సాధ్యపడదు. ఏదైనా వస్తువును తీసుకోవాలంటే వంగలేని పరిస్థితి. వీల్‌చైర్‌పైనే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుంది. మూడు నాలుగు దశల్లో రోగి తుంటి నొప్పి నుంచి కోలుకోవాలంటే శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. అంటే తుంటి కీలు మార్పిడి చేయాల్సి వస్తుంది.

తుంటి నుంచి మోకాలి వరకు ఒకే నరం ఉండటం వల్ల కొందరిలో తుంటి నొప్పి ఉండదు. కానీ, మోకాలి నొప్పితోబాధపడతారు.

నిర్ధారణ పద్ధతులు

ఎక్స్‌రే ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. అందులో కనిపించకపోతే ఎంఆర్‌ఐ ద్వారా స్పష్టంగా నిర్ధారించవచ్చు.

ఎంఆర్‌ఐ ద్వారా వ్యాధి ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చు.

జాగ్రత్తలు

తుంటి నొప్పి ఆరువారాలకు మించి ఉంటే వెంటనే ఎముకల వైద్యుణ్ని సంప్రదించడం ఉత్తమం.

మొదటి లేదా రెండో దశలోనే వ్యాధిని గుర్తించడం మంచిది. అంటే స్వల్ప లక్షణాలు కనిపించగానే అప్రమత్తం కావాలి.

కరోనా వైరస్‌కు గురైన వారు నడుము లేదా గజ్జలలో నొప్పి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చికిత్సా పద్ధతులు

మొదటి రెండు దశల్లో సాధారణ ఔషధాలతోనే చికిత్స చేయవచ్చు. ముందుగా రోగి ఆరోగ్య చరిత్ర తెలుసుకోవాల్సి ఉంటుంది. అంటే రోగి స్టెరాయిడ్స్ వాడుతున్నాడా లేదా తెలుసుకోవాలి. ఒకవేళ స్టెరాయిడ్స్ వాడుతుంటే వెంటనే వాటిని నిలిపివేయాలి. షుగర్, బీపీ, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి వాటిని నియంత్రణలోకి తీసుకురావాల్సి ఉంటుంది. ధూమపానం, మద్యపానం అలవాట్లను మాన్పించడం లేదా తగ్గించడం చేయాలి. క్రమం తప్పకుండా ఫిజియో థెరపీ అవసరమవుతుంది. ‘బై ఫాస్ఫోనేట్’ మాత్రలను మూడు నెలలపాటు వైద్యుల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది. వీటితోపాటు కాల్షియం, డి-విటమిన్ కూడా తీసుకోవాలి. ఒకవేళ రెండోదైన ప్రీ కొలాప్స్ స్టేజ్‌లో నొప్పి తీవ్రంగా ఉంటే కోర్ డి-కంప్రెషన్, కోర్ డి-కంప్రెషన్‌తోపాటు ఎముక మూలుగ (బోన్ మ్యారో) చికిత్సకు వెళ్లాలి. అయితే లోకల్ పీఆర్‌పీ ఇంజెక్షన్‌లు ప్రయోగ దశలో ఉన్నాయి. ఇక మూడో దశ అయిన కొలాప్స్ దశ, నాలుగో దశలో ఉన్న రోగులకు మాత్రం పూర్తిగా తుంటి ఎముక మార్చడం ఒక్కటే మార్గం.

వ్యాధికి ప్రధాన కారణాలు

రక్త నాళాల్లో కానీ, రక్త ప్రసరణలో కానీ లేదా రక్తం తయారీలో కానీ అవరోధాలు ఏర్పడటం

దెబ్బలు తగలడం

మద్యపానం

ఎక్కువ మోతాదులోస్టెరాయిడ్స్ వాడటం

ఇతర కొన్ని రకాల ఔషధాలు

# మీ జుట్టు తెల్లబడుతుందా.. అయితే గుండెజబ్బుల ముప్పు ఉన్నట్టే!

జుట్టు తెల్లబడటం ఇప్పుడు సర్వసాధారణం అయిపోయింది. పాతికేండ్లు నిండకుండానే జుట్టు నెరిసిపోవడం కనిపిస్తున్నది. చాలామంది దీన్ని చిన్న విషయంగా పరిగణిస్తుంటారు. దీనిని కాస్మొటిక్ అంశంగా నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరిస్తున్నారు పరిశోధకులు.

జుట్టు నెరవడం హృద్రోగానికి సంకేతమని చెబుతున్నారు. ఈజిప్ట్‌లోని కైరో యూనివర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా 545 మందిని ఎంపిక చేశారు. వాళ్ల ఆరోగ్యం, జుట్టు రంగు ఆధారంగా పరిశీలించారు. అందరూ ఒకే రకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.



పదేండ్ల పాటు వీళ్లను గమనించగా తెల్లజుట్టు ఉన్నవారిలో ఎక్కువ మందికి అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ ఉన్నట్టు కనుగొన్నారు. జుట్టు నల్లగా ఉన్నవాళ్లలో ఇలాంటి సమస్యలు అరుదుగా కనిపించాయి. తెల్లజుట్టు ఉన్నవాళ్లకు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండెజబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కాబట్టి ఇలాంటి వాళ్లు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుని ముందుజాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy